నేటి నుంచి కనకమహాలక్ష్మి సన్నిధిలో
శరన్నవరాత్రి ఉత్సవాలు



వన్‌టౌన్, న్యూస్‌టుడే: కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో నేటి నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. దసరా పర్వదినం వరకు రోజుకో అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఆలయంలో అమ్మవారి మూలవిరాట్‌కు అలంకరణలు చేయనున్నందున ఈనెల 3 నుంచి 12వ తేదీ వరకు గర్భాలయ దర్శనాలను ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 6.30గంటల వరకు నిలిపివేశామని, భక్తులు గమనించాలని ఆలయ వర్గాలు సూచించాయి. ఆయా రోజుల్లో మధ్యాహ్నం పూట నిర్వహించే పంచామృతాభిషేకం సేవలను నిలిపివేసినట్లు తెలిపారు. తొలిరోజు గురువారం అమ్మవారు ఆదిలక్ష్మి అలంకరణలో దర్శనమివ్వనున్నారు. ఈ సందర్భంగా లక్ష కుంకుమార్చన సేవ నిర్వహించనున్నారు.

రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ వార్షికోత్సవం

విజయవాడ(రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే: విజయవాడ, విశాఖపట్నం మధ్య నడిచే రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభమై 30 సంవత్సరాలు పూర్తవడంతో బుధవారం విజయవాడ రైల్వేస్టేషన్‌లో వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ రైలు అక్టోబరు 2, 1994లో ప్రారంభమైంది. మొదట రత్నగిరి హిల్స్ పేరుతో నడిచేది. 1999 నుంచి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌గా మారింది. 2006 నుంచి ఈ రైల్లో అత్యాధునిక సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా రైలు వేగంతో పాటు 24 బోగీలకు పెంచారు. ఉదయం విజయవాడ నుంచి బయలుదేరి రాత్రికి తిరిగి చేరుకునే ఈ రైలుకు ప్రయాణికుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. వేడుకల సందర్భంగా ప్రయాణికులు, రైల్వే సిబ్బంది విజయవాడ రైల్వే స్టేషన్‌లో కేక్ కోసి సంబరాలు నిర్వహించారు.


ప్రత్యామ్నాయంలో పాట్లు

- డాక్‌యార్డు వంతెన మూసివేత
- మరో మార్గంలో వెళ్తున్న వారికి ట్రాఫిక్ ఇక్కట్లు
- అటకెక్కిన పైవంతెన నిర్మాణ ప్రతిపాదనలు

గాజువాక, పారిశ్రామిక ప్రాంతంతో పాటు అనకాపల్లి, అచ్యుతాపురం, ఎలమంచిలి నుంచి విశాఖ నగరంలోకి వెళ్లే వారంతా పాతగాజువాక- సింధియా- కాన్వెంట్ జంక్షన్ మార్గాన్నే వినియోగిస్తుంటారు.

ఈ మార్గం మధ్యలో ఉన్న డాక్‌యార్డు వంతెనను ఇటీవల మరమ్మతుల పేరిట మూసేయడంతో.. ప్రయాణికులు ప్రత్యామ్నాయ రహదారుల్లో ప్రయాణిస్తున్నారు. కొత్త మార్గాల్లో ట్రాఫిక్, గోతులు తదితర సమస్యలతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

–న్యూస్‌టుడే, సింధియా



ములగాడ శివారు దారిలో వాహనాల రద్దీ

పారిశ్రామిక ప్రాంతంలోని ఎక్కువ భూభాగం రక్షణ స్థావరాలకు చెందినదే. ఏళ్ల తరబడి తూర్పు నౌకాదళం ముఖ్య కార్యాలయం పరిసరాల్లోంచే ప్రజలు నగరంలోకి రాకపోకలు సాగిస్తున్నారు. ప్రస్తుతం వంతెన మరమ్మతులు జరుగుతుండడంతో రాకపోకల్ని తాత్కాలికంగా నిలిపేశారు. భద్రతాపరమైన అంశాలకు సంబంధించి భవిష్యత్తులో ఆ మార్గాన్ని ఎప్పుడైనా శాశ్వతంగా మూసేసే అవకాశాలు ఉంటాయని రక్షణ ఉద్యోగులు చెబుతున్నారు.

గత ప్రతిపాదన ఇదీ..: పారిశ్రామిక ప్రాంతం ఐఎన్ఎస్ కల్యాణి ఆసుపత్రి వద్దే సేవా రహదారిని మూసివేయాలని గతంలో ఓసారి నౌకాదళ యంత్రాంగం భావించింది. కల్యాణి ఆసుపత్రి నుంచి డాక్‌యార్డు సమాంతర వంతెన వరకు అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలే ఏర్పాటై ఉన్నాయి. ఆయా సంస్థల్లో పని చేసే ఉద్యోగులు, కార్మికులను మాత్రమే గుర్తింపు కార్డుల ద్వారా అనుమతిస్తే సరిపోతుందని నిర్ణయించినా.. ప్రతిపాదన అమల్లోకి రాలేదు.

ట్రాఫిక్ కష్టాలు ఇలా..: ప్రస్తుతం ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు ప్రయాణించేందుకు ప్రత్యామ్నాయ రహదారిగా ఉన్న ములగాడ రోడ్డు మొత్తం గోతులతో అధ్వానంగా ఉంది. రాత్రి సమయంలో పలువురు ద్విచక్ర వాహన చోదకులు అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇరుకైన మార్గంలో తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది.

ఇవీ కొత్త మార్గాలు..: వంతెన మూసివేతతో గాజువాక, పారిశ్రామిక ప్రాంత ప్రజలంతా స్థానిక జింక్ ఆంజనేయ స్వామి ఆలయం, గాజువాక ఆర్టీసీ డిపో మధ్యలోని ఐఎన్ఎస్ ఏకశిల ముఖద్వారం, ములగాడ, ఏదురువానిపాలెం, శ్రావణ్ షిప్పింగ్ గోదాముల మీదుగా 'శీలానగర్- కాన్వెంటు' జాతీయ రహదారి మారుతీ కూడలిలోకి వెళ్లి, అక్కడ నుంచి నగరంలోకి వెళ్తున్నారు. ఆర్టీసీ బస్సులు మాత్రం గాజువాక, సింధియా మీదుగా ప్రయాణించి డాక్‌యార్డు వంతెన సమీప గోదాముల మార్గం నుంచి మారుతీ కూడలికి చేరుకుని నగరంలోకి వెళ్తున్నాయి.

అటకెక్కిన పైవంతెన..: ఐఎన్ఎస్ ఏకశిల సమీపం నుంచి 'శీలానగర్- కాన్వెంటు' జాతీయ రహదారిలోని మారుతీ కూడలి వరకు పైవంతెన నిర్మించాలని గత వైకాపా హయాంలో ప్రతిపాదించారు. నిర్మాణ పనులకు రూ.52 కోట్ల వరకు నిధులు వెచ్చించాలని భావించారు. ఆ తర్వాత పనుల ఊసెత్తలేదు.

సూచికలు
- వంతెన మూసివేతకు ముందు ప్రధాన మార్గం
- ప్రస్తుతం వెళ్తున్న మార్గాలు

రహదారిని బాగు చేయిస్తాం..: డాక్‌యార్డు వంతెన మరమ్మతుల పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా నిర్ణీత సమయంలో పూర్తయ్యేలా విశాఖ పోర్టు అథారిటీతో మాట్లాడతాం. ప్రస్తుతం ములగాడ శివారు నుంచి వినియోగిస్తున్న ప్రత్యామ్నాయ మార్గానికి మరమ్మతులు చేయిస్తాం. –పి.గణబాబు, పశ్చిమ ఎమ్మెల్యే

అంతటా.. మహాత్ముని నామస్మరణ



నగరంలో బుధవారం గాంధీ జయంతిని వాడవాడలా నిర్వహించారు. మహాత్ముడు దేశానికి చేసిన సేవలను కొనియాడారు. స్వాతంత్ర్య సంగ్రామాన్ని నడిపించిన తీరు స్ఫూర్తిదాయకమన్నారు. గాంధీ చూపిన బాటలో.. పలువురు రక్తదాన, సేవా కార్యక్రమాలను నిర్వహించారు. జీవీఎంసీ సమీప గాంధీ విగ్రహానికి వేసిన పూలదండలను చిత్రంలో చూడొచ్చు.

–న్యూస్‌టుడే, కార్పొరేషన్

ప్రతి నిర్ణయం.. అక్రమాల మయం!!
14వ పేజీలో



దేశాన్ని కాపాడాలి

పీసీసీ అధ్యక్షురాలు షర్మిల బుధవారం నగర పర్యటనలో భాగంగా... జీవీఎంసీ సమీప గాంధీ విగ్రహం వద్ద మాట్లాడారు. దేశాన్ని, రాజ్యాంగాన్ని భాజపా నుంచి కాపాడాలనే ప్లకార్డులను నేతలతో కలిసి ప్రదర్శించారు.

–న్యూస్‌టుడే, కార్పొరేషన్

నగరానికి స్వచ్ఛ బాగీదారి అవార్డు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయిలో విశాఖ నగరానికి స్వచ్ఛబాగీదారి అవార్డు లభించింది. ఈ మేరకు బుధవారం విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ అవార్డు అందుకున్నారు. కమిషనర్ మాట్లాడుతూ ఈ అవార్డు నగర ప్రజలకు అంకితం చేస్తున్నామన్నారు. ప్రజాప్రతినిధులు, పారిశుద్ధ్య కార్మికుల సహకారంతోనే ఈ అవార్డు వచ్చిందని అభిప్రాయపడ్డారు. సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 2 వరకు 'స్వచ్ఛత భావం-స్వచ్ఛత సంస్కారం' నినాదంతో చేపట్టిన కార్యక్రమంలో ప్రజలను భాగస్వామ్యం చేస్తూ నగరంలో సంపూర్ణ స్వచ్ఛతకు కృషి చేయడంతోపాటు సఫాయిమిత్ర సురక్ష శిబిరాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు.



ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

కొండవాలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులు

'స్థాయీ' అజెండాలో ప్రతిపాదన

4న సమావేశం నిర్వహణకు ఏర్పాట్లు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: మహా విశాఖ నగరపాలక సంస్థ స్థాయీ సంఘ సమావేశం ఈనెల 4న నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశామని జీవీఎంసీ కార్యదర్శి ఎంవీడీ ఫణిరాం తెలిపారు. అజెండా కాపీలను సభ్యులకు అందజేశామన్నారు. ఇటీవల సమావేశంలో వాయిదా పడ్డ మెకానికల్ విభాగానికి చెందిన ప్రతిపాదనలను తిరిగి పొందుపరిచారు. తూర్పు నియోజకవర్గంలోని కొండవాలు ప్రాంతాల్లో రక్షణగోడలు, సీసీ రహదారులు, కాలువల నిర్మాణానికి ఎమ్మెల్యే వెలగపూడి ప్రతిపాదనలు పెట్టించారు.

'ఆడుదాం.. ఆంధ్రా' పనులకు జీవీఎంసీ నిధులు: ఎన్నికల నియమావళి కారణంగా జోన్-3, 4లలో చెత్త తరలింపు వాహనాలకు టెండర్లు పిలవడానికి వీలు పడకపోవడంతో ఆ కాలంలో నామినేషన్‌పై ఆయా పనులు చేయించినట్లు ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. ఆయా ప్రతిపాదనలకు ఆమోదం తెలపాలని కోరారు. 9,10 వార్డుల్లోని కొండవాలు ప్రాంతాల్లో రక్షణ గోడలు, సీసీ రహదారులు, కాలువల నిర్మాణానికి రూ. 6. 92కోట్లు, 1. 80కోట్లతో ప్రతిపాదించారు. 12,13 వార్డులోని కొండవాలు ప్రాంతాల్లో రక్షణ గోడలకు రూ. 2. 98కోట్లు వెచ్చించనున్నారు. 8వ వార్డులోనూ పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రతిపాదించారు. 15వ వార్డులో రక్షణ గోడ, ఇతర అభివృద్ధి పనులకు రూ. 3. 52కోట్లు ప్రతిపాదించారు. గత వైకాపా ప్రభుత్వం హయాంలో ఏయూలో నిర్వహించిన 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమాలను జీవీఎంసీ ఆధ్వర్యంలో చేపట్టామని, దానికైన ఖర్చును చెల్లించాల్సి ఉందని తెలిపారు. ఏయూలో చేపట్టిన పనులకు జీవీఎంసీ నిధులు ఖర్చు చేయాలని కోరడం గమనార్హం.

- పూర్ణమార్కెట్ ఆశీలు వసూలు టెండరు ఈ ఏడాది ఆగస్టు 1 నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకు రూ. 52. 52లక్షలకు గుత్తేదారు దక్కించుకోగా, దాన్ని అనుమతించాలని ప్రతిపాదించారు. పశ్చిమ శాసనసభ్యుడు గణబాబు, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు క్షేత్రస్థాయి పర్యటనలో సూచించిన పలు అభివృద్ధి పనులను అజెండాలో చేర్చారు.

ప్రతి నిర్ణయం.. అక్రమాల మయం!!

ఈనాడు, విశాఖపట్నం

వైకాపా హయాంలో '22ఏ' జాబితా నుంచి భూముల తొలగింపు

వాటిపై ఆ పార్టీ నేతల కన్ను

హస్తగతమైన తీరుపై అధికారులు విచారణ



విశాఖ నగరం, చుట్టుపక్కల ప్రాంతాల్లో భూములంటే...బంగారంతో సమానం. చాలా ఖరీదైనవి. అదే గత వైకాపా ప్రభుత్వంలో నేతల కన్ను పడేందుకు కారణమయింది. అమాయకుల స్థలాలు, విదేశాల్లో ఉండే వారి ఆస్తులను బెదిరించి కొట్టేసిన కొందరు నేతలు వివాదాల్లోని భూములను హస్తగతం చేసుకున్నారు. అప్పట్లో కొందరు అధికారులు కూడా సహకరించారు. నిషిద్ధ భూముల జాబితా నుంచి తొలగించిన తీరూ వారికే మేలు చేసింది. ఎసైన్డ్ భూములు కేటాయించి 20 ఏళ్లు పూర్తయితే భూ యాజమాన్య హక్కులు కల్పించే(ఫ్రీహోల్డ్) విధానమూ వారి పంట పండించింది. చివరికి నష్టపోయింది పేదలే.

సిసోదియా రాకతో: విశాఖలో వైకాపా నేతలు భూములు అక్రమంగా చేజిక్కించుకున్నారన్న ఫిర్యాదులతో రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోదియా ఇటీవల విశాఖలో పర్యటించి క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టారు. గత అయిదేళ్లలో నిషేధిత జాబితా నుంచి 6,738 ఎకరాలు తొలగించినట్లు జిల్లా అధికారులు నివేదించారు. ఫ్రీహోల్డ్‌కు 609 ఎకరాలు గుర్తించగా 171 ఎకరాలకు రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఈ భూములు చేతులు మారిన తీరు, అక్రమ లావాదేవీలు వంటి అంశాలపై ప్రస్తుతం విచారణ చాలా వేగంగా జరుగుతోంది.

ఎన్నో ఉన్నాయ్... ✦ గతంలో వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది కాలంలోనే నిషేధిత జాబితా నుంచి పలు కీలక ప్రాంతాల్లోని భూములు తొలగించారు. ఇవన్నీ పలువురు నేతల పేరున మారాయి. స్థిరాస్తి రంగంతో సంబంధమున్న ఒక ప్రజాప్రతినిధి మధురవాడ, కొమ్మాదిలో కొన్ని భూములు క్రమబద్ధీకరించుకున్నారు.

✦ వైకాపాలో ఓ కీలక నేత కొమ్మాది, కాపులుప్పాడలో కొన్ని భూములను 22ఏ నుంచి తొలగించుకున్నారు.

✦ ఎన్నికలకు ముందు మధురవాడ, పెందుర్తి, అచ్యుతాపురం, అనకాపల్లిలో విలువైన భూములను '22ఏ' నుంచి బయటకు తెచ్చి భారీగా సొమ్ము చేసుకున్నారు.

అయిదేళ్లలో 22ఏ జాబితా నుంచి తొలగించిన భూములు : 6,738.65 ఎకరాలు

22ఏ(నిషిద్ధ జాబితా) నుంచి తొలగించినవి	ఎకరాలు
పోర్టు ట్రస్టు భూసేకరణ చేసినవి	5305.68
గృహ నిర్మాణ సంస్థ	161.47
ఏపీ టిడ్కో	1.27
ల్యాండ్ సీలింగ్ భూములు	38.62
భూసమీకరణ	384.45
ఫ్రీహోల్డ్	626.06
తప్పిదాల వల్ల సవరించినవి	221.10

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులు క్రీడలకు దూరమవుతున్నారు. దీనివల్ల ప్రతిభ ఉండి కూడా చాలామంది విద్యార్థులు ప్రదర్శించలేని పరిస్థితులు నెలకొన్నాయి. విద్యార్థులకు క్రీడలు శారీరక ఆరోగ్యంతో పాటు భవిష్యత్తులో ఉన్నత చదువులు, ఉద్యోగాలకు దోహదపడతాయి. అయితే అవేమి అందని పరిస్థితి ప్రభుత్వ కళాశాలల్లో ప్రస్తుతం ఉంది.





ఆట.. అటకెక్కింది..

క్రీడలకు దూరమవుతున్న ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులు

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: జిల్లాలో పది ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఇక్కడ ఆరువేల మందికి పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరికి చదువుతో పాటు క్రీడలను కూడా నేర్పించాల్సి ఉంది. వాలీబాల్, ఫుట్‌బాల్, క్రికెట్, షటిల్ బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్, త్రోబాల్, ఖోఖో వంటి క్రీడలు నేర్పించాలని ఇంటర్మీడియట్ విద్యాశాఖ నిర్దేశించింది. దీంతో పాటు డ్రిల్ కూడా చేయించాలి. అయితే జిల్లాలో ఏ కళాశాలలోనూ ఇది జరగడం లేదు. వ్యాయామ అధ్యాపకుల కొరతే దీనికి కారణం.



పది కళాశాలల్లోనూ కొరతే.. జిల్లాలో భీమిలి, ఆనందపురం, మధురవాడ, డాక్టర్ వీఎస్ కృష్ణ ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఒకేషనల్ కళాశాల, ప్రభుత్వ మహిళా కళాశాల, పెందుర్తి జూనియర్ కళాశాల, అగనంపూడి, ఇస్లాంపేట, మల్కాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలున్నాయి. ఈ పది కళాశాలల్లో ఎక్కడా వ్యాయామ అధ్యాపకులు లేరు. వీటిలో కొన్ని కళాశాలల్లో పెద్దసంఖ్యలో విద్యార్థులు ఉంటారు. అక్కడ కూడా లేరు. కొన్ని కళాశాలల్లో ఏడేళ్ల కిందట పోస్టులు భర్తీ కాలేదు. వ్యాయామ అధ్యాపకులు పదవీ విరమణ చేశాక వారి స్థానంలో ఇప్పటి వరకు ఎవరినీ నియమించలేదు.

క్రీడలకు దూరమైపోతున్నాం..


డాక్టర్ వీఎస్ కృష్ణ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సువిశాలమైన మైదానం ఉంది. ఇక్కడ క్రీడలు అనువుగా ఉంటుందని కళాశాలలో చేరేటప్పుడు అనుకున్నాం. వ్యాయామ అధ్యాపకుడు లేకపోవడంతో వసతులు ఉండి కూడా క్రీడలను నేర్చుకోలేని పరిస్థితి. దీనివల్ల క్రీడలకు దూరమైపోతున్నాం.



– జి.హేమంత్, ఇంటర్ విద్యార్థి

కొందరు ఇలా..

కొంతమంది విద్యార్థులకు క్రీడల్లో ఆసక్తి ఉంటుంది. అలాంటివారు అంతర్‌కళాశాల పోటీల్లో పాల్గొనాలనుకుంటే బయట కోచ్‌లను ఆశ్రయించి వారి సహాయంతో ఆయా పోటీల్లో పాల్గొంటున్నారు. శాశ్వత అధ్యాపకులు కాకపోయినా ఒప్పంద, అతిథి వ్యాయామ అధ్యాపకులైనా నియమించాలని విద్యార్థులు కోరుతున్నారు.



భర్తీ చేయాల్సి ఉంది..



వ్యాయామ అధ్యాపకులు పదవీ విరమణ చేశాక ఆ పోస్టుల్లో భర్తీ జరగకపోవడం వల్ల ఈ పరిస్థితి తలెత్తింది. ఈ విషయం మేము ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. భీమిలి, కృష్ణా కళాశాల, పెందుర్తి, ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్నందున ముందు అక్కడైనా భర్తీ చేయాలని కోరుతున్నాం.

– బొడ్డేపల్లి రాధ, జిల్లా వృత్తివిద్యాశాఖాధికారి

అప్పన్న సన్నిధిలో గరికపాటి

సింహాచలం, న్యూస్‌టుడే: ప్రముఖ ప్రవచనకర్త, సహస్రావధాని పద్మశ్రీ అవార్డు గ్రహీత గరికపాటి నరసింహారావు బుధవారం సాయంత్రం సతీ సమేతంగా సింహాద్రి అప్పన్న స్వామిని దర్శించుకున్నారు. ఆయనకు అధికారులు, అర్చకులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. కప్పస్తంభం ఆలింగనం చేసుకుని బేడామండపం ప్రదక్షిణం చేశారు. అంతరాలయంలో స్వామిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఐ.వి.రమణాచార్యులు నేతృత్వంలో పండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. దేవస్థానం డిప్యూటీ ఈవో రాధ, పర్యవేక్షకుడు పాలూరి నరసింగరావు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.



కప్పస్తంభం వద్ద గరికపాటి నరసింహారావు దంపతులు



మహిళా అధికారులతో అడ్మిరల్ దినేష్ త్రిపాఠి

'నావికా సాగర పరిక్రమ-2' ప్రారంభం

సింధియా, న్యూస్‌టుడే : భారత నౌకాదళంలో నారీశక్తికి పెద్దపీట వేస్తున్నట్టు నేవీ వర్గాలు స్పష్టం చేశాయి. ఈ మేరకు బుధవారం 'నావికా సాగర పరిక్రమ-2' పేరిట చేపట్టిన 'ఐఎన్ఎస్‌వీ తరణి' నేవల్ సెయిలింగ్ సాహసయాత్రను భారత నౌకాదళం అడ్మిరల్ దినేష్ త్రిపాఠి ప్రారంభించారు. గోవాలోని ఐఎన్ఎస్ మండోవి నుంచి బయలుదేరిన యాత్రలో మహిళా అధికారులు లెఫ్టినెంట్ కమాండర్ దిల్నా, లెఫ్టినెంట్ కమాండర్ ఎ.రూప ఉన్నారు. యాత్రలో ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా వరకు వెళ్లి వెనక్కి వస్తారు.

స్వచ్ఛతకు కదిలిన యంత్రాంగం..

వన్‌టౌన్, రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: గాంధీ జయంతి సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాల్లో బుధవారం స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ హరేంధిరప్రసాద్, జేసీ మయూర్ అశోక్, డీఆర్వో మోహన్‌కుమార్‌లతో పాటు కలెక్టరేట్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కలెక్టరేట్ ఆవరణలో ఉన్న చెత్తాచెదారాలను తొలగించారు. ఏపుగా పెరిగిన చెట్ల కొమ్మలను కత్తిరించారు. పరిసరాలను శుభ్రం చేశారు. జడ్పీ కార్యాలయ ఆవరణలో జరిగిన స్వచ్ఛత కార్యక్రమంలో ఇన్‌ఛార్జి సీఈఓ సత్యనారాయణ, ఉద్యోగులు పాల్గొని పరిసరాలను శుభ్రం చేశారు.



రైల్వేస్టేషన్ పరిసరాల్లో చెత్తను తొలగిస్తున్న వాల్తేరు డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్, ఇతర అధికారులు

మహాత్ముని జయంతి.. సేవా స్రవంతి



గాంధీజీ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్, జేసీ మయూర్‌అశోక్, తదితరులు

మహనీయుల ఆశయ సాధనకు కృషి

వన్‌టౌన్, న్యూస్‌టుడే: జాతిపిత మహాత్మాగాంధీ, మాజీ ప్రధాని లాల్ బహుదూర్‌శాస్త్రి వంటి మహనీయుల ఆశయ సాధనకు ప్రభుత్వఉద్యోగులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ కోరారు. బుధవారం ఉదయం కలెక్టరేట్ ఆవరణలో గాంధీ, లాల్‌బహుదూర్‌శాస్త్రి జయంతి నిర్వహించారు. గాంధీ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి నివాళి అర్పించారు. ప్రతి ఒక్కరు వారు చూపిన మార్గంలో నడవాలన్నారు. జేసీ మయూర్‌అశోక్, డీఆర్వో మోహన్‌కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు అండగా ఉంటాం: ఎంపీ రమేష్



స్టాల్స్‌ను పరిశీలిస్తున్న ఎంపీ రమేష్

పెదవాల్తేరు, న్యూస్‌టుడే : చేనేత కార్మికులకు అండగా ఉండాలని అనకాపల్లి పార్లమెంటు సభ్యులు సి.ఎం.రమేష్ కోరారు. ప్రధాని నరేంద్ర మోదీ పుట్టినరోజు నేపథ్యంలో సేవా పక్షోత్సవాల్లో భాగంగా గాంధీ జయంతి పురస్కరించుకొని లాసన్స్‌బేకాలనీ భాజపా కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన ఖాదీ సంతను సీఎం రమేష్ ప్రారంభించారు. ముందుగా మహాత్మాగాంధీ విగ్రహానికి ఎంపీ రమేష్‌తో పాటు కూటమి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ.. బాపూజీ మార్గం నేటి సమాజానికి ఎంతో ఉపయోగమన్నారు. అలాగే లాల్‌బహుదూర్‌శాస్త్రి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చేనేత ఉత్పత్తులతో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఎంపీ సి.ఎం.రమేష్, మాజీ ఎమ్మెల్సీ పి.వి.ఎన్.మాధవ్, జిల్లా అధ్యక్షులు మేడపాటి రవీంద్ర సందర్శించారు. చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.రాజు, దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి సురేంద్రమోహన్, రాష్ట్ర కోశాధికారి ఎం.నాగేంద్ర, జిల్లా మహిళా అధ్యక్షురాలు ఉమ్మడి సుజాత రాజ్, అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెదేపా కార్యాలయంలో...

వన్‌టౌన్, న్యూస్‌టుడే: జాతిపిత మహాత్మాగాంధీ మార్గం అనుసరణీయమని తెదేపా విశాఖ లోక్‌సభ నియోజకవర్గ అధ్యక్షులు గండి బాబ్జీ అన్నారు. బుధవారం ఉదయం తెదేపా కార్యాలయంలో మహాత్మాగాంధీ, మాజీ ప్రధానమంత్రి లాల్‌బహుదూర్ శాస్త్రి జయంతులను నిర్వహించారు. వారి చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించి నివాళి అర్పించారు. స్వాతంత్ర్య సాధనకు గాంధీజీ చేసిన త్యాగాలను కొనియాడారు. ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, పార్టీ దక్షిణ నియోజకవర్గ బాధ్యులు సీతంరాజు సుధాకర్, పార్టీ ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాసరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి తోటరత్నం, అధికార ప్రతినిధి గొంప కృష్ణ, కార్పొరేటర్లు గొలగాని వీరారావు, నారాయణరావు, భాస్కర్‌రావు, తెదేపా ఎస్సీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొడుగు కుమార్, గనగళ్ల సత్య తదితరులు పాల్గొన్నారు.



మహాత్మాగాంధీ, లాల్‌బహుదూర్ శాస్త్రి చిత్రపటాల వద్ద నివాళి అర్పిస్తున్న గండిబాబ్జీ, చిరంజీవిరావు తదితరులు

కేంద్ర కారాగారంలో ...

ఆరిలోవ, న్యూస్‌టుడే : కేంద్ర కారాగారంలో గాంధీ జయంతి సందర్భంగా బుధవారం ఖైదీల సంక్షేమ దినోత్సవం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, డీఎల్ఎస్ఏ సెక్రటరీ ఎం.వి.శేషమ్మ, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఖైదీలు సమాజంలో హక్కులతో పాటు బాధ్యతల గురించి కూడా తెలుసుకుని మెలగాలన్నారు. ఖైదీల ప్రవర్తనలో మార్పు దిశగా సంస్కరణలు ఉండాలన్నారు. ఈ సందర్భంగా ఆటల పోటీల్లో గెలుపొందిన ఖైదీలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కారాగారం పర్యవేక్షణాధికారి ఎస్.కిషోర్‌కుమార్, అదనపు పర్యవేక్షణాధికారి ఎం.వెంకటేశ్వర్లు, ఉప పర్యవేక్షణాధికారి ఎస్.కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, డీఎల్ఎస్ఏ సెక్రటరీ ఎం.వి.శేషమ్మ, తదితరులు

వన్యప్రాణుల వారోత్సవం

ఎండాడ, న్యూస్‌టుడే: విశాఖ జంతు ప్రదర్శనశాలలో ఈనెల 8వ తేదీ వరకు జరిగే వన్యప్రాణుల వారోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ (సీసీఎఫ్) శ్రీకంఠనాథరెడ్డి, జూ క్యూరేటర్ నందనీ సలారియా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వన్యప్రాణుల పట్ల చిత్రలేఖనం ద్వారా పలువురు విద్యార్థులు సృజనాత్మకత చాటారు. అనంతరం సీసీఎఫ్ విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడి వన్యప్రాణులు, వాటి సంరక్షణపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్న విద్యార్థుల సృజనాత్మక ప్రతిభను క్యూరేటర్ నందనీ సలారియా తదితరులు అభినందించారు. ఉత్సవాల్లో భాగంగా వారాంత కార్యక్రమాల్లోనూ విద్యార్థులు పాల్గొనాలన్నారు. అనంతరం గోడపత్రికను ఆవిష్కరించారు. మరిన్ని వివరాలకు 78936 32900 నంబరుకు ఫోనులో సంప్రదించాలని కోరారు. అటవీ శాఖ డిప్యూటీ కన్జర్వేటర్ మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న సీసీఎఫ్ శ్రీకంఠనాథరెడ్డి, జూ క్యూరేటర్ నందనీ సలారియా ఇతర అధికారులు

ఉక్కు పరిరక్షణకు నిరశన దీక్ష

కార్పొరేషన్, న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను విరమించుకున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటన చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.లోకనాథం డిమాండ్ చేశారు. కర్మాగారాన్ని పరిరక్షించాలని కోరుతూ బుధవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరాహారదీక్ష చేపట్టారు. ఆయన మాట్లాడుతూ రైతులు భూములను త్యాగం చేస్తే, కార్మిక సంఘాల ప్రతినిధులు ప్రాణాలర్పించి సాధించుకున్న ఉక్కును కేంద్ర ప్రభుత్వం నష్టాలబాట పట్టించి దశల వారీగా నిర్వీర్యం చేస్తోందన్నారు. సీపీఐ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ విశాఖ ఉక్కును పూర్తిస్థాయి సామర్థ్యంతో నడిపించడంతోపాటు సెయిల్‌లో విలీనం చేయాలని కోరారు. తొలగించిన 4వేల ఒప్పంద కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కర్మాగారం పరిరక్షణ ఉద్యమంలో విద్యార్థులు, యువత, మహిళలు పాల్గొనాలని కోరారు.



నిరాహార దీక్షలో పాల్గొన్న కార్మిక, ప్రజా సంఘాల నాయకులు



ఎం.వి.వి.ఎస్.మూర్తి స్మృతివనం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యక్షుడు ఎం.గంగాధరరావు, కార్యదర్శి ఎం.భరద్వాజ్ తదితరులు

డాక్టర్ ఎం.వి.వి.ఎస్.మూర్తికి నివాళి

ఎండాడ, సాగర్‌నగర్, న్యూస్‌టుడే: గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ (గీతం) విద్యాలయాన్ని స్థాపించడానికి దివంగత డాక్టర్ ఎం.వి.వి.ఎస్.మూర్తికి మహాత్మాగాంధీ స్ఫూర్తి అని గీతం ఉపాధ్యక్షుడు ఆచార్య ఎం.గంగాధరరావు పేర్కొన్నారు. డాక్టర్ మూర్తి వర్ధంతి సందర్భంగా గీతం డీమ్డ్ వర్సిటీ సమీప డాక్టర్ ఎం.వి.వి.ఎస్. మూర్తి స్మృతివనం వద్ద బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎంత కష్టమైనా గాంధీ మార్గంలో డాక్టర్ మూర్తి సాగించిన ప్రయాణాన్ని గీతం కొనసాగిస్తుందన్నారు. ముందుగా ఆచార్య గంగాధరరావుతో పాటు గీతం కార్యదర్శి ఎం.భరద్వాజ్, ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య వై.గౌతమ్‌రావు, తదితరులు మూర్తి స్మృతి వనం వద్ద నివాళులర్పించారు.


పేదరిక నిర్మూలనకు 'ధాన్' కృషి అభినందనీయం





మాట్లాడుతున్న వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్, హాజరైన సభ్యులు

డాబాగార్డెన్స్ (అల్లిపురం), న్యూస్‌టుడే: పేదరిక నిర్మూలన కోసం ధాన్ ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయమని వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ అన్నారు. ధాన్ ఫౌండేషన్ 28వ వ్యవస్థాపక దినోత్సవాన్ని బుధవారం డాబాగార్డెన్స్ అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కె.ఎస్.విశ్వనాథన్ మాట్లాడుతూ ధాన్ ఫౌండేషన్ చేపట్టే నగరాభివృద్ధి కార్యక్రమాల్లో వీఎంఆర్‌డీఏ భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందన్నారు. ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వాసిమలై ఆన్‌లైన్‌లో సందేశాన్ని అందించారు. సంస్థ విశాఖ సమన్వయకర్త శైలజ మాట్లాడుతూ తమ సంస్థ 2300 గ్రూప్‌లతో 33వేల కుటుంబాలతో పని చేస్తోందని వివరించారు. సంస్థ ప్రతినిధులు లోకేష్, ధనలక్ష్మి, రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	110	104
లైవ్	132	124
డ్రెస్డ్	191	218
స్కిన్‌లెస్	218	228

పెందుర్తి

తెరపై ఈనాడు
పెందుర్తిలో..
లక్ష్మీకాంత్ స్క్రీన్-1 - దేవర
స్క్రీన్-2 - సత్యం సుందరం

ఎంపీ రమేశ్‌కు ఘన స్వాగతం

పెందుర్తి, న్యూస్‌టుడే: రైల్వే శాఖ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్‌గా బాధ్యతలు తీసుకొని తొలిసారి విశాఖ విచ్చేసిన అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్‌కు పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు నేతృత్వంలో నాయకులు ఘన స్వాగతం పలికారు. బుధవారం విశాఖ విమానాశ్రయంలో ఆయనను కలిసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో జీవీఎంసీ తెదేపా ఫ్లోర్‌లీడర్ పీలా శ్రీనివాసరావు, 94వ వార్డు కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

హిందూ ధర్మ పరిరక్షణకు కృషి

పరవాడ, న్యూస్‌టుడే: హిందూ ధర్మ పరిరక్షణకు పాటు పడాలని సమరసత సేవా ఫౌండేషన్ పరవాడ మండల కన్వీనర్ ఎం.నాగపేర్రాజు పిలుపునిచ్చారు. పరవాడ సినిమాహాల్ కూడలిలోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో బుధవారం నిర్వహించిన మండల స్థాయి సమావేశంలో పాల్గొని మాట్లాడారు. దేవాలయాల్లో సామూహిక హారతి, సంకీర్తన, భజనలు చేయాలన్నారు. గొర్లె ఎరుకునాయుడు, పైలా శ్రీను, ఎల్.అప్పలనాయుడు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా 10 AM - 1 PM
పెందుర్తి : 90598 98721 వేపగుంట: 93472 79909

మర్యాదపూర్వక కలయిక

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎస్.వి.అంబేడ్కర్ బుధవారం ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబును సుజాతనగర్ క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పంచకర్లకు తహసీల్దార్ మొక్కను అందజేశారు. డిప్యూటీ తహసీల్దార్ సురేశ్‌నాయుడు పాల్గొన్నారు.

19 మద్యం దుకాణాల ఏర్పాటుకు అవకాశం


మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ అనిల్‌కుమార్

సబ్బవరం న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన ఎక్సైజ్ పాలసీ ఆధారంగా అనకాపల్లి జిల్లా కలెక్టర్ ఇచ్చిన నోటిఫికేషన్ ఆధారంగా సబ్బవరం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో సబ్బవరం, పరవాడ మండలాలు ఉంటాయని ఎక్సైజ్ సీఐ డి.అనిల్‌కుమార్ తెలిపారు. ఈ రెండు మండలాల్లో 19 మద్యం దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. సబ్బవరం మండలానికి 8, పరవాడ మండలానికి 11 దుకాణాలు కేటాయించారన్నారు. ప్రస్తుత నోటిఫికేషన్ ప్రకారం దుకాణాలు ఏర్పాటు చేసుకోదలచిన వారు దరఖాస్తు రుసుము రూ.2 లక్షల డిమాండ్ డ్రాఫ్ట్ డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఆఫీసర్ అనకాపల్లి పేరున డీడీ తీయవలసి ఉంటుందన్నారు. దరఖాస్తుతోపాటు ఆధార్ లేదా ఏదైనా గుర్తింపు కార్డు జత చేయాలన్నారు. ఈనెల 11న కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ తీసి దుకాణాలు కేటాయిస్తారన్నారు. ఒక్కో దుకాణానికి రూ.65 లక్షలుగా నిర్ణయించడం జరిగిందని ఇందులో 6వ వంతు మొత్తాన్ని మొదటి వాయిదాలో చెల్లించి రెండేళ్ల పాటు నిర్వహించుకోవచ్చునన్నారు. దరఖాస్తులకు చివరి తేదీ ఈనెల 10గా నిర్ణయించినట్లు తెలిపారు.

అనధికార పార్కింగ్‌తో అవస్థలు

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ నుంచి లంకెలపాలెం వెళ్లే ప్రధాన ఆర్‌అండ్‌బీ రహదారిలోని రాంకీ ఎస్‌ఈజెడ్ కూడలికి సమీపంలో అనధికార పార్కింగ్ కొనసాగుతోంది. ఫార్మాసిటీకి సామగ్రిని తీసుకొచ్చిన భారీ వాహనాలను రహదారిని ఆనుకుని నిలిపివేస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ దారిలో ఎదురుగా వచ్చే వాహనాల నుంచి తప్పించుకోవడానికి మార్గం సరిపోక ఇక్కట్లు పడుతున్నారు. కొందరు మొరాయించిన వాహనాలను రోడ్డుపైన రోజుల తరబడి ఇష్టానుసారంగా వదిలేస్తున్నారు. రాత్రి సమయంలో చీకటి కారణంగా దగ్గరికి వచ్చేవరకు ఆగి ఉన్న వాహనాలు కనబడకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి అనధికార పార్కింగ్ చేసే వాహనదారులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


రహదారి పక్కన నిలిపిన వాహనాలు

నూతన నియామకం

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : ఇండియన్ బాడీ బిల్డర్స్ ఫెడరేషన్ నూతన అధ్యక్షుడిగా సీనియర్ కోచ్ స్వామి రమేష్‌కుమార్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బుధవారం పెదగంట్యాడ సత్యహెల్త్ కేర్ జిమ్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి పాల్గొని కేక్ కట్ చేశారు. బాడీ బిల్డింగ్ పోటీల్లో గ్రామస్థాయి నుంచి జాతీయస్థాయికి ఎదగడానికి రమేష్‌కుమార్ చేసిన కృషి మరువలేనిదన్నారు. జాతీయ క్రీడాకారుడు డాక్టర్ ఎస్.రాజారావు, కోచ్‌లు సతీష్, రమణ, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెత్త పన్నుకు చెల్లు

వేపగుంట(నాయుడుతోట), న్యూస్‌టుడే



పేదలకు ఏ విధమైన పన్నులు విధించినా అది భారంగానే ఉంటుంది. గత వైకాపా ప్రభుత్వం సామాన్యుడి నెత్తిపై ఎన్ని రకాల ధరలు, పన్నుల భారాలను మోపాలో అన్నింటిని మోపింది. అందులో చెత్త పన్ను ఒకటి. దీనిపై పేదలు, మధ్య తరగతి ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించినప్పటికీ గత వైకాపా ప్రభుత్వం వెనకడుగు వేయలేదు. తాము అధికారంలోకి రాగానే చెత్త పన్ను లేకుండా చేస్తామని చంద్రబాబు ఎన్నికల్లో హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారమే గాంధీ జయంతి సందర్భంగా బుధవారం మచిలీపట్నంలో నిర్వహించిన బహిరంగ సభలో చెత్త పన్నును పూర్తిగా తొలగిస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. దీంతో పేద, సామాన్య ప్రజానీకం, మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సంక్షేమ పథకాలకు ముడిపెట్టి మరీ వసూలు..

ఇంటింటి చెత్త సేకరణ కోసం గత వైకాపా ప్రభుత్వం క్లాప్ వాహనాలను ఏర్పాటు చేసింది. ఆ వాహనాల నిర్వహణకు అయ్యే ఖర్చును స్థానిక సంస్థలే భరించుకునేలా నిర్ణయం తీసుకోవడంతో ఆ భారం ఆయా స్థానిక సంస్థలకు తలకు మించిన భారంగా మారింది. దీంతో ఈ భారాన్ని ప్రజలపై వేశారని అప్పట్లో పలువురు విమర్శించారు. సచివాలయ కార్యదర్శులపై ఒత్తిడి పెంచడంతో చెత్త పన్నును వారు ప్రజల ముక్కుపిండి వసూలు చేసేవారు. ఎవరైనా చెల్లించకపోతే సంక్షేమ పథకాలు నిలిపేస్తారని భయపెట్టడంతో చేసేది లేక ఎన్ని ఇబ్బందులైనా భరించి పన్ను చెల్లించేవారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి చెత్త పన్నును వసూలు చేయనప్పటికీ అధికారికంగా మాత్రం రద్దు చేయలేదు. ముఖ్యమంత్రి ప్రకటనతో పన్ను వసూలు అధికారికంగా రద్దు కానుంది.

జీవీఎంసీ జోన్-8 పరిధిలో..	
మొత్తం ఇళ్లు :	74 వేలు(సుమారు)
నెలకు చెల్లించాల్సిన చెత్త పన్ను :	రూ. 120
మురికివాడల్లో :	రూ. 60
ఏటా వసూలైన నగదు :	రూ. 11 కోట్లు పైగా..

ఎంత తగ్గినా మేలే..



మా ఆయన సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నారు. నేను టైలరింగ్ చేస్తున్నాను. ఇద్దరం కష్టపడినప్పటికీ ఇంటిని నడపడం కష్టంగానే ఉంటోంది. మాలాంటి పేదల కష్టాలు తెలుసుకోకుండా గత వైకాపా ప్రభుత్వం పలు రకాల పన్నులు వేసి మరింత కుంగుబాటుకు గురిచేసింది. ఏడాదికి రూ.1420 చెల్లించేవాళ్లం. చెత్త పన్ను రద్దు చేస్తున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటన మాలో ఎంతో సంతోషాన్నిచ్చింది. పేదలకు పన్నుల భారం తగ్గితే ఎంతో మేలు.
– టి.భగవద్గీత, బంటాకాలనీ

మాలాంటి కూలీలకు ఆసరా..



మా ఆయన, నేనూ ఇద్దరం కూలికి వెళ్తాం. కొన్ని రోజులు పనులు దొరకవు. దీంతో ఇల్లు గడవడం కష్టంగా ఉంటుంది. ఇలాంటి సమయాల్లో నెలకు రూ.120 చొప్పున ప్రతీనెలా చెల్లించడమంటే మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్టే. ఓ పక్క ఇంటి పన్నులు పెంచి మరోపక్క చెత్త పన్ను వసూలు చేయడంతో చాలా భారంగా ఉండేది. ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు చెత్త పన్ను రద్దు చేయడం మాలాంటి కుటుంబాలకు ఎంతో భారం తగ్గించినట్టు అవుతుంది.
– టి.సతోషకుమారి, అప్పన్నపాలెం

సనాతన ధర్మ పరిరక్షణ అందరి బాధ్యత

పెందుర్తి, న్యూస్‌టుడే: సనాతన ధర్మ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు పేర్కొన్నారు. జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా చేపట్టిన నగర సంకీర్తనను బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. సుజాతనగర్ 80 అడుగుల రహదారిలోని జనసేన పార్టీ కార్యాలయం నుంచి చినముషిడివాడలోని పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయం వరకు నగర సంకీర్తన కొనసాగించారు. మహిళలు కోలాటం చేస్తూ కీర్తనలు ఆలపించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


చినముషిడివాడలో నిర్వహించిన నగర సంకీర్తనలో పాల్గొన్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, నాయకులు

ఉత్తమ స్వచ్ఛ పంచాయతీగా పెదగాడి

పెదగాడి(పెందుర్తి), న్యూస్‌టుడే: గాంధీ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన స్వచ్ఛ తాహీ సేవ కార్యక్రమంలో భాగంగా పెందుర్తి మండలం పెదగాడి పంచాయతీని ఉత్తమ స్వచ్ఛ పంచాయతీగా ఎంపిక చేసినట్లు పంచాయతీ కార్యదర్శి శ్రీరామ్మూర్తి తెలిపారు. కాపులుప్పాడ డంపింగ్ యార్డు ఆవరణలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, జీవీఎంసీ మేయర్ గొలగాని హరి వెంకటకుమారి చేతుల మీదుగా అవార్డును అందుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు, పెందుర్తి ఈవోపీఆర్డీ దీపిక, స్వచ్ఛ కార్మికులు దేవుడు, శేషు, అప్పారావు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, మేయర్ హరి వెంకటకుమారి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న పంచాయతీ కార్యదర్శి శ్రీరామ్మూర్తి, సిబ్బంది

చెత్తను తొలగించి.. మొక్కలు నాటి..

సబ్బవరం, న్యూస్‌టుడే: గాంధీ జయంతిని పురస్కరించుకుని బుధవారం దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం(డీఎస్ఎన్ఎల్‌యూ) విద్యార్థులు సబ్బవరం పోలీస్‌స్టేషన్, బస్టాండులో చెత్తను తొలగించి మొక్కలు నాటారు. సీఐ పిన్నింటి రమణ ముఖ్యఅతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు, గాంధీజీ ఆశయ సాధనకు కృషి చేస్తున్న విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో డీఎస్ఎన్ఎల్‌యూ ఉపకులపతి ఆచార్య డి.సూర్యప్రకాష్, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఎన్ఏడీ పాల్, ముఖ్య వార్డెన్ భాగ్యలక్ష్మి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.


సబ్బవరం పోలీస్‌స్టేషన్‌లో మొక్కలు నాటుతున్న సీఐ రమణ, డీఎస్ఎన్ఎల్‌యూ విద్యార్థులు

బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో తర్పణాలు

వి.జుత్తాడ (పెందుర్తి), న్యూస్‌టుడే: మహాలయ అమావాస్యను పురస్కరించుకుని పెందుర్తి మండలం వి.జుత్తాడలోని బ్రాహ్మణ భవనంలో బుధవారం పితృదేవతలకు తిల తర్పణం, పిండ ప్రదానాలు సంప్రదాయబద్ధంగా జరిపారు. బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నగరంతో పాటు పలు ప్రాంతాలకు చెందిన బ్రాహ్మణులు పాల్గొన్నారు. పండితులు బ్రహ్మశ్రీ చొప్పలి సాయి శర్మ పర్యవేక్షణలో పితృదేవతలకు పూజలు చేసి తర్పణాలు సమర్పించారు.


తర్పణ కార్యక్రమాల్లో పాల్గొన్న బ్రాహ్మణులు

సమస్యలు పరిష్కరించాలని వినతి

పాలవలస(పరవాడ), న్యూస్‌టుడే: జీవీఎంసీ 77వ వార్డులోని సమస్యలను పరిష్కరించాలని వార్డు తెదేపా అధ్యక్షుడు పాల అచ్చిలనాయుడు కోరారు. ఈ మేరకు అనకాపల్లిలో ఎంపీ సీఎం రమేశ్‌ను బుధవారం వార్డు తెదేపా నాయకులతో కలిసి సమస్యలను వివరించి వినతిపత్రం అందజేశారు. ప్రముఖ పుణ్యక్షేత్రం అప్పికొండ సోమేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు, వార్డులోని చెరువులను అభివృద్ధి, రోడ్లు, కాలువల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. సింహాద్రి ఎన్టీపీసీ, హిందుజా విద్యుత్తు కేంద్రాల్లో భూ నిర్వాసితులకు ఉపాధి అవకాశాలను కల్పించాలని, కాలుష్య నివారణకు చర్యలు తీసుకోవాలని విన్నవించారు. తెదేపా నాయకులు పాల నగేశ్, కాకి నారాయణ, సాయి తదితరులు పాల్గొన్నారు.


ఎంపీ రమేశ్‌కు సమస్యలు వివరిస్తున్న పాల అచ్చిలనాయుడు

మాంసం దుకాణాల యజమానులకు జరిమానా

వేపగుంట, న్యూస్‌టుడే: గాంధీ జయంతి సందర్భంగా బుధవారం మాంసం దుకాణాలు తెరవొద్దని ప్రభుత్వం ఆదేశించినప్పటికీ కొంతమంది తమ వ్యాపారాలు కొనసాగించారు. జోన్-8 ప్రజారోగ్య విభాగం అధికారి అప్పలనాయుడు సారధ్యంలో సిబ్బంది దాడులు చేసి పలువురికి జరిమానా విధించి దుకాణాలను మూయించారు. పెందుర్తిలోని రెండు దుకాణాలకు రూ.3 వేలు చొప్పున, 94, 95వ వార్డుల్లో ఒక్కో దుకాణానికి రూ.వెయ్యి చొప్పున, 92వ వార్డులో ఆరు దుకాణాలకు రూ.300 చొప్పున జరిమానా విధించారు. భవిష్యత్తులో ప్రభుత్వం ప్రకటించిన శెలవు దినాల్లో మాంసం దుకాణాలు తెరచినట్లయితే భారీ ఎత్తున జరిమానా విధించడంతోపాటు సీజ్ చేయడం జరుగుతుందని ఏఎంహెచ్‌వో అప్పలనాయుడు హెచ్చరించారు.

ఉపాధి పనులతో గణనీయ అభివృద్ధి

రాంపురం(పెందుర్తి), న్యూస్‌టుడే: ఉపాధి హామీ పనులతో గ్రామాల్లో గణనీయమైన అభివృద్ధి సాకారం కానుందని విశాఖ జిల్లా డ్వామా పీడీ పూర్ణిమాదేవి అన్నారు. ఉపాధి పనుల ప్రణాళికలో భాగంగా బుధవారం పెందుర్తి మండలంలోని అన్ని పంచాయతీల్లో ప్రాథమిక గ్రామసభలు నిర్వహించారు. రాంపురంలో నిర్వహించిన సభలో పూర్ణిమాదేవి పాల్గొని మాట్లాడారు. పెందుర్తి మండలంలోని 15 పంచాయతీల్లో 2025-26 సంవత్సరానికి గాను 2,37,418 పనిదినాలు మంజూరయ్యాయన్నారు. వేతనాలు, సామగ్రి కలిపి రూ. 11,87,10,000 బడ్జెట్ ఆమోదానికి గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సర్పంచి అన్నంరెడ్డి శిరీష, ఎంపీటీసీ సభ్యురాలు గండి హిమబిందు, జెడ్పీ మాజీ ఫ్లోర్‌లీడర్ రెడ్డి నారాయణరావు, పంచాయతీ కార్యదర్శి పైడిరాజు, గ్రామస్థులు పాల్గొన్నారు.


గ్రామసభలో మాట్లాడుతున్న డ్వామా పీడీ పూర్ణిమాదేవి

మార్షల్ ఆర్ట్స్ హబ్‌గా విశాఖ

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: మార్షల్ ఆర్ట్స్ హబ్‌గా విశాఖ తయారైందని సినీ నటుడు, అఖిల భారత మార్షల్ ఆర్ట్స్ ఛైర్మన్ సుమన్ తెలిపారు. రెండో వైజాగ్ ఓపెన్ జాతీయస్థాయి కరాటే పోటీల గోడపత్రికలను బుధవారం పోర్టు స్టేడియంలోని విశ్వనాథ స్పోర్ట్స్‌క్లబ్‌లో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సీనియర్ కరాటే మాస్టర్ మేకల విజయసారథి జ్ఞాపకార్థం జాతీయస్థాయి పోటీలు నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. ఈ పోటీలు డిసెంబరు 15 నుంచి విశ్వనాథ స్పోర్ట్స్‌క్లబ్‌లో జరుగుతాయన్నారు. అంతకు ముందు లాల్‌బహుదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. టోర్నీ ఛైర్మన్ బొడ్డేటి కాశీవిశ్వనాథ్, భాజపా నాయకులు బొత్స సురేష్, జనసేన డాక్టర్ల సెల్ ఛైర్మన్ బొడ్డేపల్లి రఘు, టోర్నీ చీఫ్ ఆర్గనైజరు చిగురుపల్లి సతీష్‌కుమార్, ప్రతినిధులు అంగరాము, ఆనందబాలు, బాలకృష్ణ, అంబు, శివగణేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు

వేపగుంట, న్యూస్‌టుడే: నీటి గుంటలు, చెరువుల్లో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు జీవీఎంసీ 94వ వార్డు కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు తెలిపారు. వేపగుంట శ్మశానవాటిక సమీపంలో ఉన్న మురుగు నీటి గుంటల్లో దోమల నివారణ మందు చల్లేందుకు ప్రజారోగ్య విభాగం అధికారులు వినియోగిస్తున్న డ్రోన్ పిచికారీ యంత్రాన్ని బుధవారం బల్ల శ్రీనివాసరావు ప్రారంభించారు. దోమల నివారణకు ప్రజలు తమవంతుగా పరిశుభ్రతను పాటించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో అప్పలనాయుడు, సూపర్‌వైజర్ సత్యానంద్, మలేరియా విభాగం సిబ్బంది పాల్గొన్నారు.


డ్రోన్ పిచికారీ యంత్రాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు

ఆలయాలకు శరన్నవరాత్రుల శోభ

చినముషిడివాడ(పెందుర్తి), న్యూస్‌టుడే: దసరా వేడుకల్లో భాగంగా నియోజకవర్గంలోని పలు దేవాలయాలు, సంఘాల ఆధ్వర్యంలో గురువారం నుంచి శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు. ఆ మేరకు ఆలయ కమిటీలు, నిర్వాహకులు సన్నాహాలు పూర్తి చేశారు. జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడ శ్రమశక్తినగర్‌లో కొలువైన పంచముఖ గాయత్రీ, వేంకటాద్రి ఘాట్‌రోడ్డులోని ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రంలో, చినముషిడివాడ సప్తగిరినగర్‌లోని అలమేలు మంగాదేవి, సిద్ధార్థనగర్‌లోని లలితా పరమేశ్వరి, సుజాతనగర్, పెందుర్తి ప్రశాంతినగర్, ఎస్ఆర్ పురంలోని కనకదుర్గమ్మ, రాంపురంలోని మహాకామేశ్వరి పీఠంలో దేవీ నవరాత్రులు జరపనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.


శ్రమశక్తినగర్‌లో కొలువైన పంచముఖ గాయత్రీ అమ్మవారు


దేవీపురం రాజరాజేశ్వరి

వేపగుంట, న్యూస్‌టుడే: వేపగుంట ముత్యమాంబ అమ్మవారి ఆలయాన్ని విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఈసారి వేడుకల్లో బొమ్మల కొలువును ఏర్పాటు చేశారు. 9 రోజుల పాటు ఈ బొమ్మల కొలువు ఉంటుందని ఆలయ అర్చకులు శేషాద్రిశర్మ తెలిపారు. గవరజగ్గయ్యపాలెం, వేపగుంట, ప్రహ్లాదపురం, పురుషోత్తపురం, నరవ ప్రాంతాల్లో నవరాత్రి వేడుకలు జరపనున్నారు.

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలంలోని దేవీపురంలో దసరా బ్రహ్మోత్సవాలను శోభాయమానంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు కె.ప్రభాకర్ తెలిపారు. మహాలక్ష్మి, మహాసరస్వతి దేవీ సమష్టి రూపమైన శ్రీచండికా పరదేవతను కొలుచుకునే భాగ్యం భక్తులకు కలుగుతుందన్నారు.

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ, తానాం, దేశపాత్రునిపాలెం, వెన్నెలపాలెం, ధర్మారాయుడుపేట, తాడి, వాడచీపురుపల్లి, లంకెలపాలెం తదితర గ్రామాల్లో గురువారం దుర్గాదేవి విగ్రహాలను ప్రతిష్ఠించడానికి ఉత్సవ కమిటీ ప్రతినిధులు భారీ ఏర్పాట్లు చేశారు. వేదికల వద్ద ప్రత్యేక విద్యుత్తు దీపాలంకరణ చేశారు.


పరవాడలో రూపుదిద్దుకున్న ఉత్సవ మండపం


ముత్యమాంబ అమ్మవారి ఆలయంలో బొమ్మల కొలువు

స్ఫూర్తిదాయకం.. మహాత్ముడి మార్గం

సత్యం, అహింస ఆయుధాలుగా స్వాతంత్ర్య సాధనకు కృషి చేసిన మహనీయుడు జాతిపిత గాంధీజీ జీవితం స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని బుధవారం పెందుర్తి మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని మహాత్ముడి విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళి అర్పించారు. పలుచోట్ల దంత, వైద్య శిబిరాలు నిర్వహించారు. పేదలు, అనాథాశ్రమాలకు నిత్యావసరాలు అందజేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో మహాత్ముడి విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు.
– న్యూస్‌టుడే, పెందుర్తి, వేపగుంట, పరవాడ, సబ్బవరం


పెందుర్తి ఎంపీడీవో కార్యాలయం వద్ద మహాత్ముడి విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల, తదితరులు



సింహాద్రి ఎన్టీపీసీలో నివాళి అర్పిస్తున్న ఎన్టీపీసీ అధికారులు


పరవాడ పోలీస్‌స్టేషన్‌లో అంజలి ఘటిస్తున్న సీఐ మల్లికార్జునరావు


శిర్డీ సాయినగర్‌లో దంత వైద్య శిబిరం


పెందుర్తి గ్రంథాలయం వద్ద గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న జీవీఎంసీ తెదేపా ఫ్లోర్‌లీడర్ పీలా శ్రీనివాసరావు, పాఠకులు


నాయుడుతోటలో విశ్వకర్మ ఐక్యవేదిక సభ్యులు..


లంకెలపాలెంలో 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు


నంగి నారపాడు ఉన్నత పాఠశాలలో గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న జనసేన నేత ఇందల వెంకటరమణ



శ్రీనివాసనగర్‌లోని మనసు అనాథ పిల్లల ఆశ్రమానికి నిత్యావసరాలు అందిస్తున్న ఎస్వీఎల్ఎన్ వాకర్స్ క్లబ్ సభ్యులు


సబ్బవరం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో..


మొగలిపురంలో..


వేపగుంట ఓపెన్ జిమ్ వాకర్స్ క్లబ్ సమక్షంలో..


కృష్ణానగర్‌లో ఐహెచ్‌ఆర్‌సీ సంస్థ ఆధ్వర్యంలో..

ఈనాడు ప్రతిభ
pratibha.eenadu.net/eenadupratibha.net
విద్య, ఉద్యోగ పరీక్షల ప్రత్యేకం!

కరెంట్ అఫైర్స్

■ 18వ లోక్‌సభ తొలి సమావేశాల్లో సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఎంపీగా అచ్చ తెలుగులో ప్రమాణ స్వీకారం చేసిన తమిళనాడుకు చెందిన తెలుగు ఎంపీ ఎవరు? (ఈయన తమిళనాడులోని కృష్ణగిరి నుంచి ఎంపీగా ఎన్నికయ్యారు. గతంలో హోసూరు ఎమ్మెల్యేగా పనిచేసిన ఈయన తమిళనాడు శాసనసభలోనూ మాతృభాష తెలుగులోనే మాట్లాడేవారు.)



జ: కె. గోపీనాథ్

■ సంఘర్షణ, హింస, మానవ హక్కుల ఉల్లంఘనల ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా ఎంతమందికి పైగా నిరాశ్రయులైనట్లు ఐక్యరాజ్యసమితి శరణార్థుల హైకమిషన్ (యూఎన్‌హెచ్‌సీఆర్) ఇటీవల వెల్లడించింది?

మాదిరి ప్రశ్నలు

జ: 11.7 కోట్లు (వీరిలో 6.83 కోట్ల మంది సంఘర్షణలు, ఇతర సంక్షోభాల కారణంగా సొంత దేశాల్లోనే ఇతర ప్రాంతాలకు చెదిరిపోయారు. దాదాపు 4.5 కోట్ల మంది పొట్ట చేతపట్టుకుని శరణార్థులుగా విదేశాలకు వలస వెళ్లారు. వీరిలో దాదాపు మూడొంతులు (72 శాతం) అఫ్గానిస్థాన్ (64 లక్షలు), సిరియా (64 లక్షలు), వెనిజువెలా (61 లక్షలు), ఉక్రెయిన్ (60 లక్షలు), పాలస్తీనా (60 లక్షలు) దేశాల నుంచే వచ్చారు.)

■ ప్రపంచదేశాల అభివృద్ధి, అంతర్జాతీయ వ్యాపార విస్తరణలకు కృషిచేస్తోన్న ఐక్యరాజ్యసమితికి చెందిన ప్రత్యేకవిభాగం యూఎన్‌సీటీఏడీ (వాణిజ్యం, అభివృద్ధిపై ఐరాస సదస్సు) ఇటీవల ఎన్నో వార్షికోత్సవ సమావేశం నిర్వహించింది? జ: 60వ

మరింత సమాచారం

ప్రిపరేషన్ టెక్నిక్

సబ్జెక్టు ఏదైనా మౌలికాంశాలను అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలి. పరీక్షల కోసం ప్రశ్నలు-జవాబులను బట్టీ పట్టడం వల్ల ఉపయోగం ఉండదు. అవగాహన పెంచుకుని చదవడం వల్ల ఎలాంటి ప్రశ్నలకైనా సమాధానాలు రాయగలుగుతారు.

డీఎస్సీ/ టెట్ - 2024
గణితం మెథడాలజీ

JUNIOR INTER Maths - 1A Q&A

Then prove that..

2 Marks **FUNCTIONS**

1) If $f : R\setminus\{0\} \to R$ is defined by $f(x) = x + \frac{1}{x}$ then prove that $(f(x))^2 = f(x^2) + f(1)$

A: $f(x) = x + \frac{1}{x}$



$f(x^2) + f(1) = \left(x^2 + \frac{1}{x^2}\right) + \left(1 + \frac{1}{x}\right)$

$= x^2 + \frac{1}{x^2} + 2 = \left(x + \frac{1}{x}\right)^2$; $f(x)^2 + f(1) = (f(x))^2$

2) If $f : R - \{0\} \to R$ is defined by $f(x) = x^3 - \frac{1}{x^3}$, then show that $f(x) + f\left(\frac{1}{x}\right) = 0$

A: $f(x) + f\left(\frac{1}{x}\right) = \left(x^3 - \frac{1}{x^3}\right) + \left(\frac{1}{x^3} - x^3\right) = 0$

3) If $f : R \to R$ is defined by $f(x) = \frac{1 - x^2}{1 + x^2}$, then show that $f(\tan\theta) = \cos2\theta$.

A: $f(x) = \frac{1 - x^2}{1 + x^2} \Rightarrow f(\tan\theta) = \frac{1 - \tan^2\theta}{1 + \tan^2\theta} = \cos2\theta$

4) If $f : R\setminus\{\pm 1\} \to R$ if defined by $f(x) = \log\left|\frac{1 + x}{1 - x}\right|$, then show that $f\left(\frac{2x}{1 + x^2}\right) = 2f(x)$

A: $f(x) = \log\left|\frac{1 + x}{1 - x}\right|$

$f\left(\frac{2x}{1 + x^2}\right) = \log\left|\frac{1 + \frac{2x}{1 + x^2}}{1 - \frac{2x}{1 + x^2}}\right| = \log\left|\frac{1 + x^2 + 2x}{1 + x^2 - 2x}\right|$

$= \log\left|\left(\frac{1 + x}{1 - x}\right)^2\right| = 2\log\left|\frac{1 + x}{1 - x}\right|$; $f\left(\frac{2x}{1 + x^2}\right) = 2f(x)$

Some More Important Questions **2 Marks**

1) If $A = \left\{0, \frac{\pi}{6}, \frac{\pi}{4}, \frac{\pi}{3}, \frac{\pi}{2}\right\}$ and $f : A \to B$ is a surjection defined by $f(x) = \cos x$ then find B.

2) If $A = \{-2, -1, 0, 1, 2\}$ and $f : A \to B$ is a surjection defined by $f(x) = x^2 + x + 1$ then find B.


3) If $f(x) = \frac{\cos^2x + \sin^4x}{\sin^2x + \cos^4x}$ $\forall x \in R$ then show that $f(2012) = 1$.

for answers

– U.Prasanna Kumar

భిన్నాల సరళీకరణలో సాయం!

రెండు వాహనాలు ఏక కాలంలో, ఒకే స్థానానికి చేరాలంటే ఎంత సమయం పడుతుందో కసాగు చెప్పేస్తుంది. విభిన్న పొడవులున్న రెండు కర్రలను సమాన భాగాలుగా చేయాలంటే గసాభా సాయపడుతుంది. భిన్నాలను కూడటం, తీసివేయడం, సరళీకరించడం కోసం ఆ రెండు ప్రక్రియలూ ఉపయోగపడతాయి. రెండు లేదా అంతకంటే ఎక్కువ సంఖ్యల మధ్య సంబంధాలను అవి వివరిస్తాయి. వీటిపై పట్టు పెంచుకోవాలంటే సామాన్య కారణాంకాలు కట్టడాన్ని, ఇతర గణిత పరిక్రియలను అభ్యర్థులు తెలుసుకోవాలి. సాధారణ గుణకార, భాగహారాలను వేగంగా చేయడం నేర్చుకోవాలి.



కసాగు - గసాభా

కసాగు: రెండు లేదా అంతకంటే ఎక్కువ సంఖ్యల కారణాంకాల్లో మిక్కిలి చిన్నదాన్ని కసాగు (కనిష్ఠ సామాన్య గుణిజం) అంటారు.

గసాభా: రెండు లేదా అంతకంటే ఎక్కువ సంఖ్యల భాజకాల్లో మిక్కిలి పెద్దదాన్ని గసాభా (గరిష్ఠ సామాన్య భాజకం) అంటారు.

∴ రెండు సంఖ్యల లబ్ధం = ఆ రెండు సంఖ్యల కసాగు × గసాభా

సహ ప్రధాన సంఖ్యలు: రెండు సంఖ్యల గసాభా 1 అయితే అవి సహ ప్రధాన సంఖ్యలు. భిన్నరూపంలో ఉండే భిన్నాలు.

కసాగు = $\frac{\text{లవాల కసాగు}}{\text{హారాల గసాభా}}$

గసాభా = $\frac{\text{లవాల గసాభా}}{\text{హారాల కసాగు}}$

మాదిరి ప్రశ్నలు

1. రెండు సంఖ్యల కసాగు వాటి గసాభాకు 45 రెట్లు. వాటి గసాభా, కసాగుల మొత్తం 1150. అందులో ఒక సంఖ్య 125 అయితే రెండో సంఖ్య ఎంత?

1) 200 2) 215 3) 225 4) 235

సాధన: కసాగు = l, గసాభా = h అనుకుందాం.

దత్తాంశం ప్రకారం $l = 45h$; $l + h = 1150$

$l + h = 1150$ లో $l = 45h$ ను ప్రతిక్షేపించగా

$45h + h = 1150$, $46h = 1150$

$h = \frac{1150}{46} = 25$

$l + h = 1150 \Rightarrow l + 25 = 1150$, $l = 1125$

రెండు సంఖ్యల లబ్ధం = వాటి కసాగు × గసాభా

$125 \times x = 25 \times 1125$

$x = \frac{25 \times 1125}{125} = 225$

రెండో సంఖ్య = 225 అవుతుంది. జ: 3

సంక్షిప్త పద్ధతి:

```
         45
       ┌────┐
       5 × 9
  × 25|     |× 25
   125       225
```

2. $\frac{3}{5}, \frac{6}{25}, \frac{9}{20}, \frac{27}{50}$ ల గసాభా x, కసాగు y అయితే కింది వాటిలో ఏది సత్యం?

1) y = 90 x 2) y = 180 x
3) y = 270 x 4) y = 360 x

సాధన: భిన్నరూపంలో ఉంటే

i) కసాగు = $\frac{\text{లవాల కసాగు}}{\text{హారాల గసాభా}}$

ii) గసాభా = $\frac{\text{లవాల గసాభా}}{\text{హారాల కసాగు}}$

```
i) 3 | 3, 6, 9, 27        5, 25, 20, 50
   3 | 1, 2, 3, 9         5) 50 (10
     |  2, 1, 3              50
                              0
```

కసాగు = 54 గసాభా = 5

$y = \frac{54}{5}$

```
ii) గసాభా 3, 6, 9, 27    5 | 5, 25, 20, 50
3) 27 (9                  5 | 1, 5, 4, 10
   27                     2 |  1, 4, 2
    0
```

$x = \frac{3}{100}$ కసాగు = 100

$\frac{y}{x} = \frac{\frac{54}{5}}{\frac{3}{100}} = \frac{54}{5} \times \frac{100}{3}$

$\frac{y}{x} = 360 \Rightarrow y = 360x$ జ: 4

3. $x^2 + 5x + 6$, $x^2 + 8x + 15$ ల గసాభా $(x + k)$ అయితే k విలువ ఎంత?

1) 5 2) 3 3) 2 4) 1

సాధన: x^2+5x+6 $x^2+8x+15$

$x^2+2x+3x+6$ $x^2+3x+5x+15$

$x(x+2)+3(x+2)$ $x(x+3)+5(x+3)$

$(x+2)(x+3)$ $(x+3)(x+5)$

రెండింటిలో ఉమ్మడిగా ఉంటేనే గసాభా అవుతుంది.

కాబట్టి గసాభా $(x + 3) = (x + k)$

∴ k = 3 అవుతుంది జ: 2

4. కిందివాటిలో పరిపూర్ణసంఖ్య ఏది?

1) 6 2) 9 3) 15 4) 20

సాధన: ఏ సంఖ్య యొక్క కారణాంకాల మొత్తం (ఆ సంఖ్య తప్ప) ఆ సంఖ్యకు సమానం కావాలి.

6 కారణాంకాలు 1, 2, 3 = 6

9 కారణాంకాలు 1, 3 = 4

15 కారణాంకాలు 1, 3, 5 = 9

20 కారణాంకాలు 1, 2, 4, 5, 10 = 22

∴ కాబట్టి కారణాంకాల మొత్తం ఆ సంఖ్యకు సమానం అవుతుంది. కాబట్టి 6 అవుతుంది. జ: 1

5. రెండు అవిభాజ్య సంఖ్యలు a, b (a > b) ల కసాగు 319 అయితే a – 2b విలువ ఎంత?

1) –8 2) 9 3) 8 4) 7

సాధన: a విలువ b కంటే పెద్దది

319 = 29 × 11
↓ ↓
a b

జనరల్ స్టడీస్ అరిథ్‌మెటిక్

దత్తాంశం ప్రకారం = a – 2b = 29 – 2 (11)

= 29 – 22 = 7 జ: 4

6. రెండు సంఖ్యల మొత్తం 125. వాటి గసాభా 25, కసాగు 150. అయితే ఆ సంఖ్యల వ్యుత్క్రమాల (విలోమాల) మొత్తం ఎంత?

1) $\frac{1}{65}$ 2) $\frac{1}{50}$ 3) $\frac{1}{40}$ 4) $\frac{1}{30}$

సాధన: రెండు సంఖ్యలు వరుసగా x, y అనుకుందాం. అప్పుడు దత్తాంశం ప్రకారం

x + y = 125

కావాల్సినవి $\frac{1}{x} + \frac{1}{y} = \frac{y + x}{xy}$

$= \frac{125}{25 \times 150} = 30$

xy = రెండు సంఖ్యల కసాగు × గసాభా

∴ కావాల్సిన జవాబు = $\frac{1}{30}$ జ: 4

7. ఒక సంఖ్య kతో 3026, 5053 లను భాగించినప్పుడు వరుసగా వచ్చే శేషాలు 11, 13. అయితే k గరిష్ఠ విలువ ఎంత?

1) 45 2) 36 3) 15 4) 60

సాధన:

```
5053    3026
 –13     –11
5040    3015
```

రెండింటికి గసాభా కనుక్కోవాలి.

```
3015) 5040 (1
      3015
      2025) 3015 (1
            2025
             990) 2025 (2
                  1980
                    45) 990 (22
                        990
                          0
```



గసాభా k = 45 అవుతుంది. జ: 1

8. రెండు ధనపూర్ణాంకాల మొత్తం 594. వాటి గసాభా 33. ఈ నియమాలను తృప్తిపరిచే క్రమయుగ్మాల సంఖ్య ఎంత?

1) 2 2) 3 3) 4 4) 5

సాధన: రెండు సంఖ్యలు x, y అనుకుందాం.. వాటి గసాభా 33 అయితే అప్పుడు ఆ సంఖ్యలు 33x, 33y.

దత్తాంశం ప్రకారం

33x + 33y = 594, 33(x + y) = 594

$x + y = \frac{594}{33} = 18$, x + y = 18

1 + 17 – 1, 2 + 16, 3 + 15,

4 + 14, 5 + 13 – 2, 6 + 12,

7 + 11 – 3, 8 + 10, 9 + 9

పక్కన రాసిన వాటి గసాభా 1 అయితే తృప్తిపరుస్తుంది.

జ: 2



రచయిత: బిజ్జుల విష్ణువర్ధన్‌రెడ్డి

భాజపాది విభజించు, పాలించు సిద్ధాంతం

పీసీసీ అధ్యక్షురాలు వై.ఎస్. షర్మిల



మహాత్మాగాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న షర్మిల

కార్పొరేషన్, న్యూస్‌టుడే: కేంద్రంలోని భాజపా ప్రభుత్వం విభజించు, పాలించు సిద్ధాంతాన్ని అమలు చేస్తోందని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా బుధవారం ఆమె జీవీఎంసీ దరి గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ మహాత్ముడు విశ్వసించిన సత్యం, అహింస, శాంతి, సమానత్వం ప్రస్తుత భాజపా ప్రభుత్వంలో ఉన్నాయా అని ప్రశ్నించారు. భాజపా గాడ్సే సిద్ధాంతాలను అమలు చేస్తోందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితేనే దేశానికి మంచి రోజులొస్తాయన్నారు. కేంద్రంలో భాజపా ప్రభుత్వం కూలిపోవడానికి సహకరించే తెదేపా, వైకాపా, జనసేన తదితర ఏ పార్టీకైనా తాము మద్దతివ్వడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. భాజపా పాలనలో విశాఖ ఉక్కు అన్యాయానికి గురైందన్నారు. గతంలో కార్మాగారం ఏర్పాటు, నిర్వహణ, ఇతర ఇబ్బందులను తొలగించింది కాంగ్రెస్ పార్టీయేనన్నారు. కర్మాగారం పరిరక్షణకు అవసరమైతే పార్టీ అగ్రనాయకులు రాహుల్‌గాంధీ వచ్చి పోరాటం చేస్తారన్నారు. సీఎం చంద్రబాబు సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయకుండా కల్తీ నెయ్యి వ్యవహారం తెరపైకి తెచ్చి డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో ఏఐసీసీ సభ్యులు వేగి వెంకటేష్, పీసీసీ ప్రధాన కార్యదర్శి మహేష్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఎ.వెంకట వర్మరాజు, సీనియర్ నాయకులు సోడదాసు సుధాకర్, సత్యారెడ్డి, ప్రియాంక దండి, గుత్తుల శ్రీనివాస్, లక్ష్మీ, చినబాబు, సంతోష్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎం చోరీ దొంగల గుట్టురట్టు

మధ్యప్రదేశ్‌కు చెందిన ఇద్దరు నిందితుల అరెస్టు



పీఎంపాలెం స్టేషన్‌లో వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ వెంకట్రావు

పీఎంపాలెం, న్యూస్‌టుడే: ఏటీఎంలో నగదు చోరీకి పాల్పడిన అంతర్రాష్ట్ర దొంగలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ ఎ.వెంకట్రావు తెలిపారు. పీఎంపాలెం నేర విభాగం స్టేషన్‌లో బుధవారం విలేకరులకు వెల్లడించిన ఆ వివరాలిలా.. కారుషెడ్డు కూడలిలో కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ ఏటీఎం ఉంది. గత నెల 30వ తేదీన బ్యాంకు మేనేజర్ పొట్లూరి భానుతేజ విధుల్లో ఉండగా కంప్యూటర్ స్క్రీన్ ఒక్కసారిగా బ్లింక్ అయ్యింది. దీంతో అనుమానం వచ్చి ఏటీఎంలో ఉండాల్సిన నగదు, అప్పటి వరకు జరిగిన లావాదేవీలను ఆమె పరిశీలించగా నగదు కొరత కనిపించింది. వెంటనే అప్రమత్తమై ఏటీఎం కేంద్రంలోని సీసీ టీవీ ఫుటేజీని పరిశీలించారు. సాయంత్రం 4.18 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు అధునాతన టెక్నాలజీతో సెన్సార్‌పై బొటన వేలితో నొక్కుతూ నకిలీ ఏటీఎం కార్డులతో రూ.19,500 నగదు కాజేసినట్లు గుర్తించారు. ఆ మేరకు బాధిత వినియోగదారుడు కూడా వెంటనే బ్యాంకును ఆశ్రయించగా మేనేజర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై వారు లోతుగా దర్యాప్తు చేయగా.. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన నలుగురు వ్యక్తులు ఇందుకు పాల్పడినట్లు తేలింది. వీరిలో ధర్మేంద్రకుమార్, అఖిలేష్ యాదవ్‌లను కారుషెడ్డు కూడలిలో అదుపులోకి తీసుకున్నారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారని, వారి కోసం గాలిస్తున్నట్లు ఏసీపీ పేర్కొన్నారు. నిందితుల నుంచి రూ.10 వేల నగదు, వివిధ బ్యాంకులకు చెందిన 15 నకిలీ ఏటీఎం కార్డులను స్వాధీన పర్చుకున్నట్లు చెప్పారు. త్వరితగతిన కేసు ఛేదించిన పీఎంపాలెం సీఐ బి.ఎస్.ఎస్.ప్రకాష్, ఏఎస్ఐ కె.ఈశ్వరరావు, హెచ్‌సీ పి.నర్సింగరావు, పీసీలు జె.నాగరాజు, వి.చంద్రశేఖర్, జె.ఎం.మల్లిక్‌లను ఏసీపీ అభినందించారు.

దివ్యాంగులకు కృత్రిమ అవయవాల పంపిణీ

గురుద్వారా, న్యూస్‌టుడే: మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా క్షత్రియ సంక్షేమ సమితి, మంగళంపాలెం గురుదేవ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సీతమ్మధార క్షత్రియ కల్యాణమండపంలో బుధవారం దివ్యాంగులకు కృత్రిమ అవయవాల పంపిణీ చేశారు. విజయనగరం ఆర్డీఓ దాట్ల కీర్తి ముఖ్య అతిథిగా హాజరై దివ్యాంగులకు ట్రైసైకిళ్లు, వీల్‌ఛైర్లు, వినికిడి పరికరాలు, ఊతకర్రలు పంపిణీ చేశారు. ఇంతటి మంచి కార్యక్రమానికి సహకారం అందజేసిన దాతలను అభినందించారు. క్షత్రియ సంక్షేమ సమితి ఛైర్మన్ ఎం.ఎస్.రాజు, డైరెక్టర్ ఎం.ఆర్.కె.రాజు, అధ్యక్షులు దాట్ల తిరుపతిరాజు, కార్యదర్శి ఆర్‌వీ గణపతిరాజు, ఉపాధ్యక్షులు ఎస్.ఎస్.ఎన్.రాజు, బుద్ధరాజు శివాజీ, గురుదేవ ఛారిటబుల్ ట్రస్టు డైరెక్టర్ జగదీశ్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.



కృత్రిమ అవయవాల పంపిణీలో పాల్గొన్న విజయనగరం ఆర్డీవో దాట్ల కీర్తి, ట్రస్టు సభ్యులు

బ్యాంకుల్లో.. ఇంటి దొంగలు!!



బ్యాంకుల్లో ఇటీవల మోసాలు ఎక్కువైపోతున్నాయి. కొందరికి తెలియకుండానే వారి సంస్థల పేరుతో రుణాలు ఇతరులకు ఇచ్చేస్తున్నారు. ఇంకా అనేక రూపాల్లో మోసాలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో కొందరు బ్యాంకు ఉన్నతాధికారులే అక్రమాలకు సహకరిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. బ్యాంకులకు కొత్త మేనేజర్లు వచ్చాక ఇలాంటి మోసాలు బయటపడుతున్నాయి. వీటిపై వినియోగదారులు, బ్యాంకు ఉన్నతాధికారులు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయడం మేలు. కానీ, అలా జరగకపోవడంతో కొన్నే వెలుగులోకి వస్తున్నాయి. ఈనాడు, విశాఖపట్నం

సంఘటన 1

విశాఖలో వైద్య సంబంధ సేవలందించే ఓ సంస్థ పేరుతో లాసన్స్‌బే కాలనీలోని ఓ బ్యాంకుకు దరఖాస్తు అందింది. సంస్థకు మంచి పేరుండడం, అదే బ్యాంకులో ఖాతా ఉండడంతో కొనుగోలు చేసే వైద్య పరికరం విలువైనది కావడంతో రుణం మంజూరు చేశారు. డబ్బులు సంస్థకు చెందిన బ్యాంకు ఖాతాలో కాకుండా దరఖాస్తు చేసిన వ్యక్తి ఖాతాలో జమ చేశారు. కొద్ది రోజుల తర్వాత బ్యాంకుకు కొత్త మేనేజర్ వచ్చారు. రెండు నెలలుగా రుణ వాయిదా చెల్లించకపోవడంతో సంస్థ ప్రతినిధులను ఫోన్లో సంప్రదించగా అసలు విషయం బయటపడింది. గతంలో పని చేసిన ఓ మేనేజర్ ఈ రుణం మంజూరులో కీలకంగా ఉన్నట్లు సమాచారం. ఈ అంశంపై పోలీసులకూ ఎటువంటి ఫిర్యాదు అందకపోవడం గమనార్హం.

సంఘటన 2

మద్రిపాలెం వుడా కాలనీకి చెందిన ఓ కుటుంబ సభ్యులు... అమెరికాలో ఉన్న పిల్లల వద్దకు తరచూ వెళ్లి వస్తుంటారు. ఈ నేపథ్యంలో ఇంట్లో విలువైన వస్తువులను బ్యాంకు లాకర్లో ఉంచారు. ఒక రోజు లాకరు తెరిచి ఉందని, ఆభరణాలు లేవని బ్యాంకు సిబ్బంది ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. ఇదెలా జరిగిందో తెలియరాలేదన్నారు. సీసీ కెమెరా పరిధిలో ఆ లాకరు లేకపోవడంతో మరిన్ని అనుమానాలు రేగుతున్నాయి. పోలీసుల దృష్టికి ఈ విషయం వెళ్లినా... కేసు నమోదు కాలేదు.

సంఘటన 3

గోపాలపట్నంలోని ఓ బ్యాంకు ఖాతాదారు మృతి చెందారు. అతని పేరున ఉన్న స్థిర డిపాజిట్లను బ్యాంకు సిబ్బంది మూడో కంటికి తెలియకుండా నొక్కేశారు. ఇంటి పెద్ద మృతి చెందిన తరువాత ఆరు నెలలకు డబ్బులు తీసుకునేందుకు బ్యాంకుకు వెళ్లిన కుటుంబ సభ్యులు కంగుతిన్నారు. ఖాతాలో ఏమీ లేవని చెప్పడంతో అవాక్కయ్యారు. కొందరు సిబ్బంది చేతివాటం ప్రదర్శించినట్లు తెలిసింది.

ముగిసిన మహిళల సాహసయాత్ర



ట్రెక్కింగ్‌లో పాల్గొన్న నేవల్ డాక్‌యార్డు మహిళా ఉద్యోగులు

సింధియా, న్యూస్‌టుడే : విశాఖపట్నం నేవల్ డాక్‌యార్డు మహిళా ఉద్యోగులు చేపట్టిన ట్రెక్కింగ్ విజయవంతంగా ముగిసిందని బుధవారం నేవీ వర్గాలు తెలిపాయి. ఇయర్ ఆఫ్ నేవల్ సివిలియన్స్ కార్యకలాపాల్లో భాగంగా డాక్‌యార్డు నుంచి 15 మంది మహిళా ఉద్యోగులు వారం కిందట సాహస యాత్రకు శ్రీకారం చుట్టారు. అటల్ బిహారీ వాజ్‌పేయీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మౌంటెయినరింగ్ అండ్ అలైడ్ స్పోర్ట్స్ (ఏబీవీఐఎంఏఎస్) ఆధ్వర్యంలో హిమాచల్‌ప్రదేశ్ ధర్మశాల వద్ద యాత్ర చేపట్టారు.

మహిళను వేధిస్తున్న నిందితుడి అరెస్టు

ఎండాడ, న్యూస్‌టుడే: సామాజిక మాధ్యమాలను ఆధారంగా చేసుకుని ఓ మహిళను వేధిస్తున్న వ్యక్తిని బుధవారం అరెస్టు చేసినట్లు విశాఖ సైబర్ పోలీసులు వెల్లడించారు. ఆ వివరాలిలా.. నగరానికి చెందిన ఓ మహిళకు కడప ప్రాంతానికి చెందిన వ్యక్తితో గతంలో వివాహం జరిగింది. తర్వాత కొన్ని రోజులకే వేర్వేరు కారణాల వల్ల వారిద్దరూ విడిపోయారు. అలా విడిపోయినప్పటికీ ఆమెను ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశంతో అతడు సామాజిక మాధ్యమాల వేదికగా పోస్టులు పెడుతుండడంతో బాధితురాలు సైబర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సాంకేతిక పరిజ్ఞానంతో దర్యాప్తు చేసిన పోలీసులు నిందితుడు వెంకటరమణను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఈత కొలనులో మునిగి ఒకరి మృతి

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: కొండకర్ల ఈతకొలనులో ప్రమాదవశాత్తు మునిగి విశాఖలోని గోపాలపట్నం ఆదర్శనగర్‌కు చెందిన పెదపాటి రాజు (39) మృతి చెందారు. అచ్యుతాపురం సీఐ నమ్మి గణేష్ కథనం ప్రకారం.. అచ్యుతాపురం సెజ్‌లోని ఓ కంపెనీలో పనిచేసే కొందరితో రాజు బుధవారం రాత్రి కొండకర్లలోని ఒక రిసార్ట్‌కు వచ్చాడు. స్నేహితులు ఒడ్డున ఉండగా రాజు కొలనులో దిగాడు. కొద్ది సమయం ఈతకొట్టి నీటిలో మునిగిపోయాడు. సరదాగా ఆసనాలు వేస్తున్నాడని స్నేహితులు భావించారు. ఎంతకీ పైకి రాకపోవడంతో దిగి చూస్తే అప్పటికే అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే అచ్యుతాపురంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి అక్కడ నుంచి అనకాపల్లి ఆసుపత్రికి తరలించినా ప్రయోజనం లేకపోయింది. రాజు గుండెపోటుతో మృతిచెంది ఉంటాడని స్నేహితులు తెలిపారు. మృతుడి తండ్రికి గుండె సంబంధిత ఆరోగ్య సమస్యలు ఉన్నట్లు వారు తెలిపారు. స్నేహితులతో సరదాగా గడపడానికి వచ్చి మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, స్నేహితులు కన్నీరు పెట్టుకున్నారు. భార్య మౌనిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

కార్మికుల ప్రయోజనాలే ముఖ్యం : తెదేపా

గాజువాక, న్యూస్‌టుడే : స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ, ఉక్కు ఒప్పంద కార్మికుల ప్రయోజనాలే ముఖ్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తుందని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. బుధవారం గాజువాక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కొందరు అపోహలు సృష్టించి, కార్మికులను గందరగోళానికి గురి చేస్తున్నారని, అసత్య ప్రచారాలు నమ్మొద్దన్నారు. పార్టీ పర్యవేక్షకులు జి.వినీత్, కార్పొరేటర్లు బొండా జగన్, గంధం శ్రీనివాస్, పల్లా శ్రీనివాస్, బీఎన్ పాత్రుడు, ముత్యాలనాయుడు, రౌతు శ్రీనివాస్, నాయకులు పులి వెంకటరమణారెడ్డి, పుచ్చా విజయకుమార్, అనంతలక్ష్మి ప్రసాదుల శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తెదేపా రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, పక్కన కార్పొరేటర్లు

54 మాంసం, చేపల దుకాణాల సీజ్

కార్పొరేషన్, న్యూస్‌టుడే: గాంధీ జయంతి నాడు మాంసం, చేపలు విక్రయిస్తున్న 54 దుకాణాలను సీజ్ చేసినట్లు పశువైద్యాధికారి కిశోర్‌కుమార్ తెలిపారు. బుధవారం నగరంలోని పలు ప్రాంతాల్లోని మాంసం దుకాణాలపై దాడులు నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా 180 కిలోల చికెన్, 110 కిలోల మటన్, 30 కిలోల చేపలు, 23 కిలోల రొయ్యలు స్వాధీనం చేసుకుని కాపులుప్పాడ డంపింగ్‌యార్డులో పూడ్చి వేసినట్లు చెప్పారు. దుకాణదారులకు రూ.68వేల అపరాధ రుసుము విధించినట్లు పేర్కొన్నారు.

టోల్‌గేటు సిబ్బందిపై దాడి

దాకమర్రి (గ్రామీణభీమిలి), న్యూస్‌టుడే: చిట్టివలస-రాయపూర్ 26వ నంబరు జాతీయ రహదారిపై (విజయనగరం రోడ్డు) భీమిలి మండలం బోడమెట్టపాలెం టోల్‌గేటు సిబ్బందిపై కొందరు వ్యక్తులు దాడి చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. టోల్‌ప్లాజా వద్ద బోడమెట్టపాలెం గ్రామానికి చెందిన లొడగల సురేశ్ సూపరువైజర్‌గా, వారాది ధనరాజు హెల్పరుగా విధులు నిర్వహిస్తున్నారు. విజయనగరం గ్రామీణ మండలంలోని చింతలవలస గ్రామానికి చెందిన కొందరు బుధవారం సాయంత్రం నాలుగు చక్రాల వాహనంపై వచ్చి టోల్ టికెట్ తీసుకోకుండా వెళ్లిపోవడంతో వాగ్వాదం తలెత్తింది. ఈక్రమంలో వాహనంపై వచ్చిన వ్యక్తులు విధుల్లో ఉన్న సిబ్బందిని గాయపర్చడంతో వారు భీమిలి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సుధాకర్ పేర్కొన్నారు.

భీమిలి

సినిమాలు

చిట్టివలస(తగరపువలస), న్యూస్‌టుడే

గణేశ్ - సత్యం సుందరం
రాములమ్మ- దేవర
తాతా - మత్తు వదలరా, సప్తగిరి- దేవర
మహరాజ్ (ఆనందపురం) - దేవర

బాపూ మన్నించు..

కొమ్మాది, న్యూస్‌టుడే: గాంధీజయంతి రోజున మాంసం, చేపల విక్రయాలపై నిషేధం ఉన్నప్పటికీ కొందరు వ్యాపారులు బుధవారం యథేచ్ఛగా విక్రయాలు చేపట్టారు. మధురవాడ, కొమ్మాది, శివశక్తినగర్, మారికవలస, బోయపాలెం కూడళ్లలో మాంసం, చేపల విక్రయాలు కొనసాగాయి. తర్వాత ఈ విషయం తెలిసి జోన్-2 ఏఎంహెచ్‌వో డాక్టర్ కిశోర్ సంబంధిత దుకాణాలపై దాడులు చేసి సరకు స్వాధీనం చేసుకుని అపరాధరుసుం విధించారు.

స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకుందాం

కొమ్మాది, న్యూస్‌టుడే: దేశ ప్రజలను ఏకతాటిపై నడిపించి పోరాడిన మహనీయుడు మహాత్ముని స్ఫూర్తితో విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకుందామంటూ పలువురు నిరసన వ్యక్తం చేశారు. కొమ్మాది కూడలి వద్ద సిటూ, ఐద్వా మధురవాడ జోన్ కమిటీల ఆధ్వర్యంలో గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్లకార్డులు ప్రదర్శించారు.

జూ పార్కు వద్ద పార్కింగ్ పేరిట దోపిడీ

ఎండాడ, న్యూస్‌టుడే: ఇందిరాగాంధీ జూపార్కు బీచ్ గేట్ వైపు వాహనాల పార్కింగ్ పేరిట నిర్వాహకులు దోపిడీకి పాల్పడుతున్నారు. ఇక్కడ టికెట్ రూ.10 ఉండగా రూ.50 వరకు వసూలు చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. అలాగే పార్కింగ్ స్థలంలో వాహనాల నుంచి పెట్రోల్, హెల్మెట్లు దొంగిలిస్తున్నారని వాహనదారులు వాపోతున్నారు. అలాగే కొందరు అనధికార ఫీజులు వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు బుధవారం జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియాకు పలువురు ఫిర్యాదు చేశారు.

మురికివాడల్లో మలబార్ ట్రస్ట్ సేవలు

తాటిచెట్లపాలెం, న్యూస్‌టుడే: తాటిచెట్లపాలెం ఏఎస్సార్‌నగర్‌లోని మురికివాడలో చదువు మధ్యలో ఆపేసిన విద్యార్థులను గుర్తించి వారిని చదివించడంతో పాటు మంచి పౌష్టికాహారం అందించేందుకు మలబార్ ఛారిటబుల్ ట్రస్ట్ సంస్థ ముందుకొచ్చింది. ఈ సంస్థ ప్రతినిధులు బుధవారం ఏఎస్సార్‌నగర్, మధురవాడలోని బక్కన్నపాలెం, కే1, కే2 కాలనీ, గాయత్రినగర్ మురికివాడలను సందర్శించారు. బడి మానేసిన చిన్నారుల తల్లిదండ్రులతో సమావేశమయ్యారు. తమ సంస్థ ఎంపిక చేసిన ఈ 5 కేంద్రాల్లోని విద్యార్థులకు బోధించేందుకు ఉపాధ్యాయులను నియమించడంతో పాటు వారికి ప్రతిరోజూ పోషకాహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు.




ఇటీవల కురిసిన చిన్నపాటి వర్షానికే సాగర్‌నగర్ బీచ్‌లో వాహనాల పార్కింగ్ స్థలం పరిస్థితి, తీరానికి వెళ్లే మార్గం ఇలా..

చినుకు పడితే చిక్కులే..!

సందర్శకులకు తప్పని ఇబ్బందులు

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: జూపార్కు సాగరతీర ద్వారం సమీప గుడ్లవానిపాలెం అమ్మవార్ల ఆలయాల ప్రాంతం, సాగర్‌నగర్ బీచ్ పరిసరాల్లో ఏమాత్రం వర్షం కురిసినా సరే బురదమయంగా అధ్వాన పరిస్థితులు తలెత్తుతున్నాయి. గతంలో జీ-20 నిర్వాహక సదస్సులో భాగంగా జీవీఎంసీ అధికారులు కోట్లాది రూపాయలు వెచ్చించి ఇక్కడ బీచ్‌రోడ్డుకు ఆనుకుని సముద్రానికి ఎదురుగా విశాలమైన ఆహ్లాదకర ప్రదేశాల్లో అభివృద్ధి పనులు చేపట్టినా సరే కొంత కాలానికే ఈ దుస్థితి తలెత్తడం శోచనీయమని స్థానికులు వాపోతున్నారు. వాహనాల పార్కింగ్ స్థలాల్లో బురద పేరుకుపోయి వారం రోజులకు పైగా అసౌకర్య పరిణామాలు తలెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఉదయం, సాయంత్రం వేళల్లో నడకకు వచ్చేవారి ప్రయోజనార్థం నిర్మించిన వాకింగ్ ట్రాక్‌పై మట్టి పేరుకుపోయి రాకపోకలకు ఇబ్బందులు తయారవుతున్నాయి. ఇటీవల ఇక్కడ చోటుచేసుకున్న పరిణామాలతో కొంత సేపు ఆహ్లాదకరంగా గడుపుదామని వచ్చే సందర్శకులు నిరుత్సాహానికి గురవుతున్నారు.

మౌలిక వసతులు కల్పించాలి



నగరానికి అతి చేరువలో ఉన్న విశాల సుందర తీర ప్రాంతాల ప్రాధాన్యం దృష్ట్యా ఇక్కడకు నిత్యం అధిక సంఖ్యలో జనం వస్తుంటారు. ప్రజా ప్రయోజనాలకు అనువుగా.. సందర్శనీయ స్థలాల్లో వర్షాలు పడే సందర్భాల్లో తలెత్తుతున్న సమస్యల పరిష్కారానికి అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలి. రానున్న విజయదశమి, దీపావళి, కార్తిక మాసాల నేపథ్యంలో విహారయాత్రల్లో భాగంగా రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాల నుంచి నిత్యం వేల సంఖ్యలో సందర్శకులు వచ్చే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో బీచ్‌రోడ్డులోని పర్యాటక ప్రదేశాల్లో ఈ తరహా సమస్యలు పునరావృతం కాకుండా తగిన వసతులు కల్పించాలి. -పి.ఆర్.పి.శ్రీనివాస్, సాగర్‌నగర్

మేమున్నాం.. మీకు తోడుగా

80086 11711, 99122 22247

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

ఎండాడ, న్యూస్‌టుడే

సమస్య: వైఎల్పీ లేఅవుట్(ఎండాడ) నుంచి బీచ్ రోడ్డు(సాగర్‌నగర్)కు వెళ్లే దారిలో ఓ కళాశాలకు చెందిన వ్యర్థాలు రోడ్డుపైకి వచ్చేస్తుండడంతో తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. -స్థానికులు, ఎండాడ
సమాధానం: క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.
-సింహాచలంనాయుడు, జోన్-2 కమిషనర్

సమస్య: జూ పార్కు(సాగర్‌నగర్) నుంచి రుషికొండకు వెళ్లే ప్రధాన మార్గంలో విద్యుత్ దీపాలు పనిచేయడం లేదు. -రామకృష్ణ, రుషికొండ
సమాధానం: విద్యుత్ దీపాలకు మరమ్మతులు చేపడతాం. -సురేష్, విద్యుత్ ఏఈ

సమస్య: రుషికొండ నుంచి ఎండాడ 100 అడుగుల రహదారిలో ఇరువైపులా అనధికారిక దుకాణాలతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోంది.
-స్థానికులు, ఎండాడ
సమాధానం: ఆ మార్గంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటాం.
-కేవీఎస్ఎన్ ప్రసాద్, ఆరిలోవ ట్రాఫిక్ సీఐ

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో విశాఖను మొదటి స్థానంలో నిలపాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, చిత్రంలో కలెక్టర్ హరేంధిరప్రసాద్, నాయకులు

కొమ్మాది, న్యూస్‌టుడే: స్వచ్ఛసర్వేక్షణ్‌లో విశాఖ నగరాన్ని మొదటి స్థానంలో నిలిపేందుకు జీవీఎంసీతో పాటు ప్రజలు సైతం పరిశుభ్రతలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. 'స్వచ్ఛభారత్ దివస్' సందర్భంగా కాపులుప్పాడ డంపింగ్‌యార్డు వద్ద 15 రోజులు నిర్వహించిన 'స్వచ్ఛతా హీ సేవా' ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా పలువురు పారిశుద్ధ్య కార్మికులకు పురస్కారాలు అందించారు. కలెక్టర్ హరేంధిరప్రసాద్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరి సహకారం అవసరమన్నారు. అనంతరం డంపింగ్‌యార్డు ప్రాంతాల్లో మొక్కలు నాటారు. మేయర్ జి.హరివెంకటకుమారి, జెడ్సీ బి.సింహాచలంనాయుడు, తెదేపా జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, కార్పొరేటర్లు మొల్లి హేమలత, లొడగల అప్పారావు, నాయకులు మొల్లి లక్ష్మణరావు, చెట్టిపల్లి గోపి, గంటా నూకరాజు, గాడు చిన్నికుమారిలక్ష్మి, వాండ్రాసి అప్పలరాజు, బోయి రమాదేవి, నాగోతి సత్యనారాయణ, కె.నాగరాజు, మన్యాల సోంబాబు తదితరులు పాల్గొన్నారు.

'ఫ్రెండ్స్' సేవలు ప్రశంసనీయం: ఆర్జేడీ

చిట్టివలస(తగరపువలస), న్యూస్‌టుడే: చిట్టివలసలో పలు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు ఏర్పాటు చేసిన ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఉచిత పోటీ పరీక్షల శిక్షణ కేంద్రాన్ని బుధవారం విద్యాశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు (ఆర్జేడీ) బి.విజయ్‌భాస్కర్ సందర్శించి గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి మాట్లాడారు. గత అయిదేళ్లుగా విద్యార్థులకు ఇక్కడ ఉచిత శిక్షణ ఇవ్వడం గర్వకారణమని కొనియాడారు. సొసైటీ వ్యవస్థాపకుడు గంటాన మోహనరావు తదితరులు పాల్గొన్నారు.



బాపూజీ విగ్రహం వద్ద ఆర్జేడీ విజయభాస్కర్, తదితరులు



అడివివరంలో మహాత్ముడి విగ్రహానికి నివాళులర్పిస్తున్న సహకారసంఘం పాలకవర్గం, సిబ్బంది



మధురవాడ సునీల్‌శర్మ కాలనీ ఉన్నత పాఠశాలలో..




స్వతంత్రనగర్‌లో పౌరసంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..



చంద్రంపాలెం ఉన్నత పాఠశాల వద్ద పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో..

మహాత్ముడి మార్గం.. అందరికీ ఆదర్శప్రాయం



జాతిపిత మహాత్మాగాంధీ చూపిన మార్గం అందరికీ ఆదర్శనీయమని పలువురు పేర్కొన్నారు. గాంధీజీ, లాల్‌బహదూర్ శాస్త్రి జయంతిని పురస్కరించుకుని వక్తలు బుధవారం ఆ మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు దేశానికి చేసిన సేవలను కొనియాడారు.

సింహాచలం, న్యూస్‌టుడే: అడివివరం సహకార పరపతి సంఘం పాలకవర్గ సభ్యులు, స్థానిక తెదేపా వైకాపా నాయకులు, సింహాచలం దేవస్థానం సిబ్బంది వేర్వేరుగా మహాత్ముడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: సాగర్‌నగర్‌లో గాంధీ విగ్రహానికి 8వవార్డు తెదేపా, జనసేన అధ్యక్ష, ఉపాధ్యక్షులు చెట్టిపల్లి గోపి, శాఖరి శ్రీనివాస్, సారిపల్లి శ్రీనివాస్, కార్పొరేటర్ లొడగల అప్పారావు తదితర నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలి తెదేపా ఆధ్వర్యంలో భీమిలి బీచ్ వద్ద ఉన్న బాపూజీ పార్కులో ఆయన విగ్రహానికి తెదేపా రాష్ట్రకార్యదర్శి గంటా నూకరాజు ఆధ్వర్యంలో పూలమాలవేసి నివాళి అర్పించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోనూ ఈ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సమాజాభివృద్ధికి కృషి చేస్తామని ఎన్.ఎస్.ఎస్.వాలంటీర్లు ప్రతిజ్ఞ చేశారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు క్యాంప్ కార్యాలయంలో స్థానిక వైకాపా నాయకులు ఈ వేడుకలు నిర్వహించారు.

మధురవాడ, పీఎంపాలెం, న్యూస్‌టుడే: ఏడోవార్డు సునీల్‌శర్మ కాలనీ జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన వేడుకల్లో వార్డు కార్పొరేటర్ పిల్లా మంగమ్మ, తెదేపా రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి పిల్లా వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు. పౌరసంక్షేమ సంఘం అధ్యక్షుడు నాగోతి సూర్యప్రకాష్ ఆధ్వర్యంలోనూ, మిథిలాపురి వుడాకాలనీ గాంధీబొమ్మ కూడలిలోనూ ఈ వేడుకలు వేర్వేరుగా జరిగాయి. 7, 8 వార్డుల కార్పొరేటర్లు పిల్లా మంగమ్మ, లొడగల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కొమ్మాది, న్యూస్‌టుడే: చంద్రంపాలెం ఉన్నత పాఠశాలలో 1992-93 బ్యాచ్ విద్యార్థులు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జీవీఎంసీ జోన్-2 కార్యాలయంలోనూ, చంద్రంపాలెం బాపూజీ కళామందిరం వద్ద, ఏపీఎస్పీ 16వ బెటాలియన్‌లో కొమ్మాది కూడలిలో సిటూ ఆధ్వర్యంలో, జవహర్ నవోదయ విద్యాలయంలోనూ ఈ వేడుకలు ఘనంగా జరిగాయి.



మిథిలాపురి వుడాకాలనీ గాంధీబొమ్మ కూడలిలో..



6వ వార్డులో గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న తెదేపా నాయకులు



భీమిలి బీచ్ వద్ద బాపూజీ పార్కులో తెదేపా నాయకులు..



జీవీఎంసీ జోన్-2 కార్యాలయం వద్ద..



సాయిరాంకాలనీలో తెదేపా 5వవార్డు కార్పొరేటర్ హేమలత తదితరులు..



ఏపీఎస్పీ 16వ బెటాలియన్‌లో..



ఎండాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో..

గీతం డీమ్డ్ వర్సిటీలో..: సాగర్‌నగర్, న్యూస్‌టుడే: గీతం డీమ్డ్ వర్సిటీలో గాంధీ విగ్రహం వద్ద గీతం ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య వై.గౌతమ్‌రావు, ఉపాధ్యక్షుడు ఆచార్య ఎం.గంగాధరరావు, కార్యదర్శి ఎం.భరద్వాజ్ పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. గాంధీ మార్గమే ప్రపంచానికి శాంతి బాట అని వక్తలు అభిప్రాయపడ్డారు. గాంధీ పాటించిన సత్యం, ధర్మం, అహింసను మనస్ఫూర్తిగా ఆచరిస్తే సమాజంలో విలువలు పెరుగుతాయన్నారు. జిమ్‌సర్ ప్రొ-వీసీ డాక్టర్ బి.గీతాంజలి, గీతం సలహాదారు ఆచార్య జి.సూర్యనారాయణ, సీఈవో మీనా తదితరులు పాల్గొన్నారు.



గీతంలో గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య వై.గౌతమ్‌రావు, ఉపాధ్యక్షుడు ఆచార్య ఎం.గంగాధరరావు తదితరులు

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: రుషికొండలోని గిరిజన సంక్షేమ పరిశోధన, శిక్షణ మిషన్ (టీసీఆర్ అండ్ టీఎం) కార్యాలయంలో సంబంధిత ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ రాణి మంద, తదితరులు గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



గ్రామీణభీమిలి, న్యూస్‌టుడే: భీమిలి మండల పరిషత్తు కార్యాలయ ఆవరణలోని గాంధీ విగ్రహానికి ఎంపీడీవో హిమమంతకుమార్, ఎంపీపీ వాసురాజు, జడ్పీటీసీ సభ్యుడు వెంకటప్పుడు, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ★ తగరపువలస సీపీఐ కార్యాలయంలో, తగరపువలస కాంగ్రెస్ కార్మిక సంఘం కార్యాలయంలో, అవంతి ఇంజినీరింగు కళాశాలలోనూ ఈ వేడుకలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో కలిసి స్వచ్ఛభారత్ నిర్వహించారు.



భీమిలి మండల పరిషత్తు కార్యాలయం వద్ద..

భీమిలి తీరంలో పరిశుభ్రత

భీమునిపట్నం, న్యూస్‌టుడే: మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా భీమిలి బీచ్‌లో పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. భీమిలి జోనల్ కమిషనర్ పి.ప్రేమప్రసన్నవాణి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత తను పాటించి పర్యావరణ పరిరక్షణ కోసం కృషిచేయాలని కోరారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల విద్యార్థులు, ఎన్‌సీసీ, ఎన్.ఎస్.ఎస్.వాలంటీర్ల ఆధ్వర్యంలో జోనల్ కార్యాలయం నుంచి లైట్‌హౌస్ వరకు బీచ్‌ను శుభ్రపర్చారు. సేకరించిన చెత్తను డంపింగ్‌యార్డుకు తరలించారు.



సేకరించిన వ్యర్థాలతో విద్యార్థులు

ముగ్గురు సైబర్ మోసగాళ్ల అరెస్టు

ఎండాడ, న్యూస్‌టుడే: మనీ లాండరింగ్ కేసులో చిక్కుకున్నట్లు ఓ వ్యక్తిని బెదిరించిన ముగ్గురిని విశాఖ సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. ఆ వివరాలిలా.. నగరానికి చెందిన వ్యక్తికి ఓ బెదిరింపు ఫోన్‌కాల్ వచ్చింది. హైదరాబాద్‌కు చెందిన మనీ లాండరింగ్ కేసులో తక్షణమే హాజరు కావాలని అందులో పేర్కొన్నారు. ఆందోళనకు గురైన ఆతడు హుటాహుటిన హైదరాబాద్ వెళ్లగా హోటల్‌లో ఒంటరిగా ఉండాలని, ఈ విషయం ఎవరికీ తెలియజేయవద్దని ఆగంతకులు సూచించారు. అంతేకాక తాము సూచించిన ఖాతాకు రూ.16.50 లక్షలు పంపించాలనడంతో ఆ మేరకు జమ చేశారు. తర్వాత తాను మోసపోయానని గ్రహించి బాధితుడు సైబర్ పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు లోతుగా దర్యాప్తు చేసి హైదరాబాద్‌కు చెందిన ఉదయ్‌కిరణ్, మోహనరెడ్డి, మల్లికార్జున్ అనే ముగ్గురిని బుధవారం అరెస్టు చేసి విశాఖ తీసుకొచ్చి రిమాండ్‌కు తరలించారు. ఈ నిందితులపై వేర్వేరు రాష్ట్రాల్లో 8 కేసులు ఇప్పటికే నమోదై ఉన్నట్లు సైబర్ పోలీసులు పేర్కొన్నారు.

మార్షల్ ఆర్ట్స్ హబ్‌గా విశాఖ

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: మార్షల్ ఆర్ట్స్ హబ్‌గా విశాఖ తయారైందని సినీనటుడు, అఖిల భారత మార్షల్ ఆర్ట్స్ ఛైర్మన్ సుమన్ తెలిపారు. రెండో వైజాగ్ ఓపెన్ ఛాంపియన్‌షిప్ కరాటే పోటీల గోడపత్రికలను బుధవారం పోర్టు స్టేడియంలోని విశ్వనాథ స్పోర్ట్స్‌క్లబ్‌లో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సీనియర్ కరాటే మాస్టర్ మేకల విజయసారథి జ్ఞాపకార్థం జాతీయస్థాయి పోటీలు నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. ఈ పోటీలు డిసెంబరు 15 నుంచి విశ్వనాథ స్పోర్ట్స్‌క్లబ్‌లో జరుగుతాయన్నారు. అంతకు ముందు లాల్‌బహదూర్‌శాస్త్రి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. పోర్ట్ ఛైర్మన్ బొడ్డేటి కాశీవిశ్వనాథ్, భాజపా నాయకులు బొడ్డేపల్లి రఘు, పోర్ట్ చీఫ్ ఆర్గనైజరు చిగురుపల్లి సతీష్‌కుమార్, ప్రతినిధులు అంగరాము, ఆనందబాలు, బాలకృష్ణ, అంబు, శివగణేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సన్నిధిలో మిజోరం గవర్నర్



ఆలయ ప్రాంగణంలో మిజోరం గవర్నర్ హరిబాబు తదితరులు

ఎండాడ, న్యూస్‌టుడే: ఎండాడ కొండపై గల శ్రీ మహాలక్ష్మీ, గోదాదేవి సహిత శ్రీవేంకటేశ్వరస్వామిని బుధవారం మిజోరం గవర్నర్ కంభంపాటి హరిబాబు దర్శించుకున్నారు. అంతరాలయ పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అర్చకులు, పండితులు వేదాశీర్వాదం చేసి ప్రసాదం అందజేశారు. అంతకుముందు ఆలయ అధికారులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు.

గోశాల లేఅవుట్‌లో శరన్నవరాత్రి వేడుకలు

అడివివరం (సింహాచలం), న్యూస్‌టుడే: జీవీఎంసీ 98వ వార్డు అడివివరం పాత గోశాల సమీప సింహగిరి పునరావాస కాలనీలో కొలువైన గ్రామ దేవతల ఆలయంలోని బాలాత్రిపుర సుందరి అమ్మవారి సన్నిధిలో గురువారం నుంచి దేవీ శరన్నవరాత్రి వేడుకలు జరుగుతాయని ఆలయ కమిటీ తెలిపింది. 12వ తేదీ వరకు జరిగే ఈ వేడుకల్లో భాగంగా అమ్మవారు రోజుకొక అవతారంలో భక్తుల పూజలు అందుకుంటారని తెలిపారు.



వేడుకగా అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, న్యూస్‌టుడే: సింహాద్రి అప్పన్న స్వామి నిత్య కల్యాణోత్సవం బుధవారం సింహగిరిపై వేడుకగా జరిగింది. అర్చకులు వేకువజామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ఆరాధన, బాలభోగం సేవలు జరిపారు. శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. వేదమంత్రాలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ దేవతామూర్తుల పరిణయోత్సవాన్ని కమనీయంగా జరిపించారు. భక్తులు పాల్గొని స్వామిని సేవించారు. తొలుత సహస్రనామార్చన ప్రత్యేక పూజా కార్యక్రమం జరిగింది.



ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

వైభవంగా గరుడ వాహన సేవ

సింహాచలం: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి దేవాలయంలో బుధవారం గరుడ వాహన సేవ ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని పట్టు పీతాంబరాలు, ఆభరణాలతో అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని వెండి గరుడ వాహనంపై ఆశీనులను చేశారు. తులసీ దళాలతో అష్టోత్తర శతనామార్చన జరిపారు. భక్తులు పాల్గొని స్వామికి ప్రదక్షిణలు చేసి మొక్కు తీర్చుకున్నారు.



సంప్రదాయబద్ధంగా అమావాస్య తిరువీధి



ఆలయ బేడామండపంలో స్వామి, అమ్మవార్ల ఊరేగింపు

సింహాచలం, న్యూస్‌టుడే: అమావాస్య తిథిని పురస్కరించుకుని బుధవారం సాయంత్రం సింహాద్రి అప్పన్న స్వామి తిరువీధి ఉత్సవం జరిగింది. అర్చకులు దేవేరుల సమేతుడైన గోవిందరాజ స్వామిని శోభాయమానంగా అలంకరించి పల్లకీలో అధిష్ఠింపజేశారు. పండితులు వేదమంత్రోచ్ఛారణలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ ఆలయ బేడామండపంలో దేవతామూర్తుల తిరువీధి వేడుక సంప్రదాయబద్ధంగా జరిగింది.

భైరవస్వామికి ప్రత్యేక పూజలు

అడివివరం (సింహాచలం), న్యూస్‌టుడే: అమావాస్య తిథిని పురస్కరించుకుని భైరవవాకలో కొలువైన భైరవస్వామి సన్నిధిలో బుధవారం విశేష పూజలు జరిగాయి. తెల్లవారుజాము నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు భైరవవాక చేరుకున్నారు. స్వామిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. అర్చకులు పంచామృతాలతో భైరవుడిని అభిషేకించారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో దీపారాధన చేశారు. వడమాలలు సమర్పించి మొక్కు చెల్లించుకున్నారు.



విశాఖ తూర్పు

4 కిలోల గంజాయి స్వాధీనం

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: విశాఖ మీదుగా మచిలీపట్నానికి గంజాయి రవాణా చేసేందుకు యత్నించిన వ్యక్తిని విశాఖలో రైల్వే పోలీసులు అరెస్టు చేశారని జీఆర్పీ సీఐ ధనుంజయనాయుడు తెలిపారు. స్టేషన్‌లో ఆర్పీఎఫ్, జీఆర్పీ బృందాలు గస్తీ కాస్తున్న సమయంలో మచిలీపట్నంకు చెందిన బోయిన వెంకటరమణ అనుమానాస్పదంగా కనిపించడంతో ఆర్పీఎఫ్ ఎస్ఐ కీర్తిరెడ్డి సోదాలు చేశారు. అతని బ్యాగ్‌లో 4 కిలోల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడ్ని న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

– న్యూస్‌టుడే, ఎంవీపీకాలనీ

మేమున్నాం.. మీకు తోడుగా 10 AM - 1 PM
ఎంవీపీకాలనీ 80085 74768 మద్దిలపాలెం 99121 20229

సమస్య : ఎంవీపీకాలనీ సెక్టార్-11లోని 87/బి/1/2పోల్‌పై వీధి దీపాలు వెలగటం లేదు. – రామకృష్ణ

సమాధానం : సిబ్బందిని నియమించి మరమ్మతులు చేయిస్తాం. – విక్రాంత్, వర్క్ ఇన్‌స్పెక్టర్

సమస్య : ఎంవీపీకాలనీ సెక్టార్-4 చండీ అమ్మ వారి ఆలయ వీధిలో 41/బి/2 పోల్‌పై వీధి దీపాల సమస్య తీవ్రంగా ఉంది. – సుమతి సుందరి

సమాధానం : పరిశీలించి పాడైన దీపాలను మారుస్తాం. – విక్రాంత్, వర్క్ ఇన్‌స్పెక్టర్

అ వీ ఇ వీ

■ **చెత్తపై యూజర్ ఛార్జీలు రద్దుపై సీపీఎం హర్షం**

శివాజీపాలెం, (మద్దిలపాలెం), న్యూస్‌టుడే : రాష్ట్రంలో చెత్తపై యూజర్ ఛార్జీలు రద్దుచేస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించడాన్ని సీపీఎం హర్షం వ్యక్తం చేస్తున్నట్లు సీపీఎం 78వ వార్డు కార్పొరేటర్ బి.గంగారావు తెలిపారు. ఆస్తివిలువ ఆధారిత పన్ను కూడా రద్దుచేయాలని డిమాండ్ చేశారు.

■ **సమస్యలు పరిష్కరించాలని ఉపాధ్యాయుల ఆందోళన**

కార్పొరేషన్, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్(డీటీఎఫ్), యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్(యూటీఎఫ్) ఆధ్వర్యంలో బుధవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆందోళన నిర్వహించారు. డీటీఎఫ్ అధ్యక్షుడు కె.రామారావు మాట్లాడుతూ జీఓ 117ను రద్దు చేస్తామని హామీ ఇచ్చినా, ఇప్పటికీ చర్యలు చేపట్టలేదన్నారు. అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్ మాట్లాడుతూ పాఠశాల్లో మాతృభాష ఉద్యమాన్ని కొనసాగించి, ఆ మేరకు సెక్షన్లు పెంచాలని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు డి.నాగేశ్వరరావు మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు సక్రమంగా నిర్వహించడం లేదని, వారికి అర్బన్ ఎంఈఓ పోస్టులివ్వాలని కోరారు. సంఘం నాయకులు టీఆర్ అంబేడ్కర్, టి.అప్పారావు, ఎస్.నాగమణి, ఉమాదేవి, కె.రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

■ **భక్తిశ్రద్ధలతో అమావాస్య పూజలు**

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : కొత్త వెంకోజీపాలెం గౌరీ జ్ఞానలింగేశ్వరాలయంలో ఉన్న భైరవస్వామి ఆలయంలో భక్తులు పెద్ద సంఖ్యలో పూజలు జరిపారు. అమావాస్యను పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ అర్చకులు భక్తులతో పూజలు జరిపించారు. పెద్ద సంఖ్యలో భక్తులు బారులు తీరి కనిపించారు.



బారులు తీరిన భక్తులు

■ **ఘనంగా ఏఎంసీ వ్యవస్థాపక దినోత్సవం**

వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఆంధ్ర వైద్య కళాశాల వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మంగళవారం రాత్రి కళాశాల ఆవరణలో జరిగిన ఈ వేడుకల్లో ప్రిన్సిపల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, కేజీహెచ్ పర్యవేక్షక వైద్యాధికారి డాక్టర్ పి.శివానంద, ఉప ప్రిన్సిపాళ్లు డాక్టర్ రాజేంద్రప్రసాద్, డాక్టర్ మన్మథరావు, ప్రొఫెసర్లు డాక్టర్ కృష్ణవేణి, డాక్టర్ పార్వతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమంగా రాణించిన 31 మంది మెడికోలుకు పతకాలు, 12 మందికి నగదు బహుమతులు, 58 మందికి ధ్రువపత్రాలు అందజేసినట్లు ప్రిన్సిపల్ తెలిపారు.

ఫ్లెక్సీ తొలగింపుపై అభ్యంతరం

జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పేరిట పెట్టిన ఫ్లెక్సీని కొందరు తెదేపా నాయకులు తొలగించడంతో జనసేనకు చెందిన నాయకులు అభ్యంతరం తెలిపారు. నగర పరిధిలోని జాతీయ రహదారికి ఆనుకుని జనసేనకు చెందిన ఓ మహిళా కార్పొరేటర్ దసరా సందర్భంగా పవన్‌కల్యాణ్ చిత్రపటంతో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఇతర ప్రజాప్రతినిధుల ఫొటలతో కూడిన ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. దీనిని ఓ తెదేపా నేత అనుచరులు తొలగించి, తెదేపాకు చెందిన నాయకుల ఫ్లెక్సీని ఏర్పాటు చేయటంతో జనసైనికులు అభ్యంతరం తెలిపారు. ఈ సమాచారాన్ని అందుకున్న తెదేపా ముఖ్యనేత ఇరువురిని శాంతపరిచే ప్రయత్నంలో ఉన్నట్లు సమాచారం.

– న్యూస్‌టుడే, విశాఖపట్నం

ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి



న్యూస్‌టుడే, ఉషోదయ కూడలి (ఎంవీపీకాలనీ)

ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

'మా ప్రభుత్వం వంద రోజుల పాలనను పూర్తిచేసుకుంది. నా నియోజకవర్గంలో దీర్ఘకాలిక సమస్యలపై దృష్టిపెట్టాను. అత్యధికులకు ప్రయోజనకరంగా ఉండేలా సింహాచలం దేవస్థానం భూ సమస్యను పరిష్కరించే విషయంలో చివరిదశకు చేరుకున్నాం. తెదేపా ప్రభుత్వ హయాంలో 296 జీవో లబ్ధిదారులకు తమ ఇళ్లను రిజిస్ట్రేషన్ చేసుకునేలా ఉత్తర్వులు జారీ చేయాలని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లటం జరిగిందంటూ' ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో దీర్ఘకాలిక పనులు.. వాటి పురోగతిపై 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు.

296 జీవో లబ్ధిదారులకు న్యాయం చేస్తాం..

« తెదేపా హయాంలో 100 గజాలలోపు ప్రభుత్వ భూముల్లో స్థిరనివాసం ఏర్పరచుకున్న వారికి ఉచితంగా పట్టాలను జారీ చేసేందుకు 296 జీవోను విడుదల చేయటంతో అనేక మంది లబ్ధి పొందారు. పట్టాలు పొందిన వారంతా రెండేళ్ల తర్వాత రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం ఉన్నా, వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం రావటంతో లబ్ధిదారులకు న్యాయం జరిగేలా నాటి జీవోకు అనుగుణంగా రిజిస్ట్రేషన్ చేసుకుని, యాజమాన్య హక్కు పొందేలా చర్యలు తీసుకుంటాం. ఆ సమయంలో అనేక మంది ఈ జీవోను సద్వినియోగం చేసుకోలేదని తెలిసింది. వారందరికి కోసం ఇదే జీవోను కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని కోరగా, ఆయన కూడా సానుకూలంగా స్పందించారు.

జూనియర్ కళాశాలను తీసుకువచ్చేలా చర్యలు

« నియోజకవర్గంలో చాలా కాలంగా తోటగరువు ఉన్నత పాఠశాలను జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్(నవీకరణ) చేయాలని స్థానికులు కోరుతున్నారు. గత తెదేపా హయాంలోనే ఇందుకు తగిన ప్రతిపాదనలు రాష్ట్ర విద్యాశాఖకు పంపించాం. అనివార్య కారణాలతో మధ్యలోనే ప్రతిపాదనలు ఆగిపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ ప్రతిపాదనలు మరోసారి ముందుకు తీసుకువెళ్లటం జరిగింది. తోటగరువు ఉన్నత పాఠశాలను జూనియర్ కళాశాలగా మార్చేసేందుకు అన్నిరకాల సదుపాయాలు ఉన్నాయి. విద్యా శాఖమంత్రి నారా లోకేశ్ దృష్టికి కూడా ఈ సమస్యను తీసుకువెళ్లటం జరిగింది. ఆయన కూడా సానుకూలంగా స్పందించారు. త్వరలోనే మంచి కబురు వస్తుందని భావిస్తున్నాం.

ప్రత్యామ్నాయ భూమిని ఇవ్వటానికి కలెక్టర్ సుముఖత

« నియోజకవర్గంలో సింహాచలం దేవస్థానానికి చెందిన భూముల్లో స్థిరనివాసం ఏర్పరచుకుని ఉన్నారు. వీరందరికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. ఈ సమస్యను కొలిక్కి తీసుకువచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సింహాచలం భూముల విషయమై ప్రత్యామ్నాయ భూమిని దేవస్థానానికి ఇవ్వటానికి జిల్లా కలెక్టర్ సుముఖత వ్యక్తం చేశారు. అలాగే న్యాయపరమైన అంశాలు కూడా ఉన్నాయి. నవంబరులో ఈ సమస్యకు పరిష్కారం లభించే అవకాశం ఉంది. ఈలోగా సింహాచలం భూముల్లో ఉంటున్న వారి నివాసాలు మరమ్మతులు చేపట్టుకునేలా చర్యలు తీసుకుంటాం.

ఆరిలోవ రైతుబజారుకు నిధులు..

« నియోజకవర్గంలో కొండవాలు ప్రాంతాల్లో అనేక మంది నిరుపేదలు స్థిరనివాసం ఏర్పరచుకుని ఉన్నారు. ఇక్కడ సదుపాయాల కల్పనకు గత వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం వహించింది. వర్షాలు కురిస్తే చాలు ఆయా ప్రాంతీయులు ఆందోళన చెందుతూనే ఉంటున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన 100 రోజుల్లో క్షేత్రస్థాయిలో అధికారులతో అధ్యయనం చేయించి, రూ.25 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసి, జీవీఎంసీ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లాం. దశల వారీగా నిధులు విడుదల చేసే అవకాశాలున్నాయి. దీంతో కొండవాలులో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం. ఇక ఆరిలోవ రైతుబజారుకు నిధులు విడుదల చేయాల్సి ఉంది. ఇందుకోసం మంత్రితో చర్చించాను. త్వరలో నిధులు ఇస్తామని చెప్పారు.

ముగ్గురు సైబర్ మోసగాళ్ల అరెస్టు

ఎండాడ, న్యూస్‌టుడే: మనీ లాండరింగ్ కేసులో చిక్కుకున్నట్లు ఓ వ్యక్తిని బెదిరించిన ముగ్గురిని విశాఖ సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. ఆ వివరాలిలా.. నగరానికి చెందిన వ్యక్తికి ఓ బెదిరింపు ఫోన్ కాల్ వచ్చింది. హైదరాబాద్‌కు చెందిన మనీ లాండరింగ్ కేసులో తక్షణమే హాజరు కావాలని అందులో సమాచారం. ఆందోళనకు గురైన అతడు హుటాహుటిన హైదరాబాద్ వెళ్లగా హోటల్‌లో ఒంటరిగా ఉండాలని, ఈ విషయం ఎవరికీ తెలియజేయవద్దని అగంతకులు సూచించారు. అంతేకాక తాము సూచించిన ఖాతాకు రూ.16.50 లక్షలు పంపించాలనడంతో ఆ మేరకు జమ చేశారు. తర్వాత తాను మోసపోయానని గ్రహించి బాధితుడు సైబర్ పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు లోతుగా దర్యాప్తు చేసి హైదరాబాద్‌కు చెందిన ఉదయకిరణ్, మోహనరెడ్డి, మల్లికార్జున్ అనే ముగ్గురిని అరెస్ట్ చేసి విశాఖ తీసుకొచ్చి రిమాండ్‌కు తరలించారు. ఈ నిందితులపై వేర్వేరు రాష్ట్రాల్లో 8 కేసులు ఇప్పటికే నమోదై ఉన్నట్లు సైబర్ పోలీసులు పేర్కొన్నారు.

చెత్త తొలగింపు



తీరంలో శుభ్రం చేస్తున్న వాలంటీర్లు

పెదవాల్తేరు, ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: గాంధీ జయంతి పురస్కరించుకొని ఆర్.కె.బీచ్ తీరంలో నెహ్రూ యువకేంద్రం, ఏయూ జాతీయ సేవా పథకం సంయుక్తంగా తీర శుభ్రతా చర్యలు చేపట్టారు. బీచ్‌లో చెత్త తొలగించారు. కేంద్ర ప్రభుత్వ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్ మంత్రిత్వశాఖ డైరెక్టర్ సారా జయల్ సాక్షి, ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ విజయలక్ష్మి, నెహ్రూ యువకేంద్రం జిల్లా మేనేజర్ ఎం.మహేశ్వరరావు, ఎన్.ఎస్.ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : శ్రీసాయి గోకుల గురుదత్త విహార్ సద్గురు రాజయోగి సాయి సుధాకర పూర్ణానందస్వామి నేతృత్వంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం నుంచి వైభవంగా నిర్వహించనున్నారు. ఎంవీపీకాలనీ సెక్టారు-6లోని భద్రం పార్కు ఆవరణలోగల సామాజిక భవనంలో ఈనెల 12 వరకు ఎంతో భక్తిప్రపత్తులతో జరిపేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

చైతన్యనగర్‌లో..

కేఆర్ఎం.కాలనీ, (మద్దిలపాలెం), న్యూస్‌టుడే: జీవీఎంసీ పరిధి 23వ వార్డు చైతన్యనగర్‌లో శ్రీ హిమవత్‌గౌరి కనకదుర్గా ఆలయంలో శరన్నవరాత్రుల ఉత్సవాలను చైతన్యయూత్ అసోసియేషన్, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం నుంచి ఘనంగా నిర్వహిస్తున్నట్లు సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని విద్యుత్తు కాంతులతో ముస్తాబు చేశారు.



చైతన్యనగర్‌లో వెలసిన అమ్మవారు



లలితాదేవి అమ్మవారు

కిర్లంపూడి లేఅవుట్‌లో..

పెదవాల్తేరు, న్యూస్‌టుడే : కిర్లంపూడి లేఅవుట్‌లో వెలసిన శ్రీ లలితా త్రిపురసుందరి ఆలయంలో 3 నుంచి 19 తేదీ వరకు దసరా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ పర్యవేక్షకులు కాండూరి లక్ష్మణస్వామి తెలిపారు.

దంత సమస్యలకు ఆధునిక చికిత్స

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: దంత సమస్యలకు అత్యాధునిక వైద్యం అందుబాటులోకి వచ్చిందని ప్రముఖ దంత వైద్యనిపుణురాలు డాక్టర్ వెంకట మౌనిక తెలిపారు. సిరిపురం కూడలి వద్ద ప్రపంచ దంత వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించిన నిర్వహించిన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. గతంలో పుచ్చిపళ్లు, వంకర పళ్లు సరిచేయడానికి ఎన్నో ఇబ్బందులు ఉండేవని.. ఇప్పుడు పన్ను తొలగించకుండానే నొప్పిని తగ్గించే పద్ధతులు వచ్చాయన్నారు. వంకర పళ్లు సరిచేయడానికి కూడా క్లిప్పుల అవసరం లేకుండా ఎలైనర్స్ ద్వారా సరిచేయవచ్చన్నారు.

దయాల్బాగ్ వస్తు ప్రదర్శనకు స్పందన

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: విశాలాక్షినగర్‌లోని దయాల్బాగ్ విద్యాకేంద్రం ఆవరణలో బుధవారం దయాల్బాగ్ కేంద్రాల్లో తయారైన తోలువస్తువుల ప్రదర్శనకు సందర్శకుల నుంచి మంచి స్పందన కనిపించింది. రూ. 1.50 లక్షల సరకు కేవలం అర గంట వ్యవధిలోనే అమ్ముడైపోయింది. ఎగ్జిబిషన్ ఇన్‌ఛార్జ్ సూర్య ప్రకాశరావు, కాలనీ సంఘం కార్యదర్శి డాక్టర్ రాజేష్ వెంకట్, కోర్సుల సమన్వయకర్త దక్షిణామూర్తి, సత్సంగ్ సభ్యులు పర్యవేక్షించారు.



వస్తువులు కొనుగోలు చేస్తున్న సందర్శకులు

బాపూ.. మార్గంలో పయనిద్దాం



తెదేపా కార్యాలయంలో వద్ద గాంధీకి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : గాంధీ జయంతిని పురస్కరించుకుని మహాత్మునికి ఘనంగా నివాళులు అర్పించారు. ఎంవీపీకాలనీ తెదేపా కార్యాలయం వద్ద ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు నేతృత్వంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గాంధీ ఆశయాలను కొనసాగిస్తూ, ఆయన చూపిన మార్గంలో అందరూ పయనించాలని ఎమ్మెల్యే సూచించారు. వేజెళ్ల సుబ్బరాజు, ధనరెడ్డి, అక్కరబోయిన రాంబాబు, బుగత సత్యనారాయణ, కాళ్ల శంకర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

★ విశాఖ డాక్ అండ్ పోర్టు ఎంప్లాయిస్ యూనియన్, ఎంవీపీకాలనీ సెక్టారు-6 నివాసుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏబీసీ పార్కు వద్ద గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ఇగ్నోలో స్వచ్ఛతా దివస్

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం(ఇగ్నో) ప్రాంతీయ కేంద్రం గాంధీ జయంతి పురస్కరించుకుని స్వచ్ఛతా దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి ధ్రువపత్రాలు అందించారు. కార్యక్రమంలో ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ గోనిపాటి ధర్మారావు, పూర్వ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ ఎస్.రాజారావు, వి.వెంకటరమణ, డాక్టర్ శిరీష, నాగరాజు కుమారి, జీవీఎంసీ పాఠశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.



ఏయూలో మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటిస్తున్న ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో డీఈఓ చంద్రకళ గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కార్యాలయ ఆవరణలో స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమం నిర్వహించారు. కృష్ణకుమార్, ఇమంది పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఏయూ తెలుగు మాధ్యమ పాఠశాలలో..

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే : ఆంధ్రవిశ్వవిద్యాలయం తెలుగు మాధ్యమ పాఠశాలలో మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ ట్రస్ట్ ఛైర్మన్ డాక్టర్ ఖాజా రహ్మతుల్లా ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని సలోమి, జిల్లా వినియోగదారుల కమిషన్ సభ్యులు రహిమున్నీసాబేగం, మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ ట్రస్టీ డాక్టర్ ఎస్.కె.బేగం తదితరులు పాల్గొన్నారు.



ఆళ్వార్‌దాస్ మైదానంలో విశాఖ శాటిలైట్‌సిటీ వాకర్స్ క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో..

★ గాంధీ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో ఏయూ న్యాయ కళాశాలలో 'ఇష్యూస్ అండ్ ఛాలెంజెస్ ఆఫ్ జెండర్ జస్టిస్ అండ్ ఈ క్వాలిటీ-ఎ గాంధీయన్ పర్‌స్పెక్టివ్' రెండు రోజుల అంతర్జాతీయ సదస్సును వీసీ ప్రారంభించారు.

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని పోలీసు కమిషనరేట్‌లో భాగంగా ఎ.డి.పి.సి.(పరిపాలన) డాక్టర్ వి.బి.రాజ్‌కమల్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు.



గాంధీ విగ్రహం వద్ద సెక్టారు-6 నివాసుల సంక్షేమ సంఘం సభ్యులు



ఉపాధ్యాయులతో కలిసి కార్యాలయం పరిసరాలు శుభ్రం చేస్తున్న డీఈఓ



గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న వి.ఎం.ఆర్.డి.ఎ కమిషనర్ విశ్వనాథన్



గాంధీకి నివాళులు అర్పిస్తున్న ఎ.డి.సి.పి. రాజ్‌కమల్



ధ్రువపత్రాలు అందుకున్న విద్యార్థులతో ఇగ్నో అధికారులు

తాగునీరు వృథా



రోడ్డుమీద పారుతున్న తాగునీరు

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : సెక్టారు-6లో తాగునీరు వృథాగా పోతుంది. డీఆర్‌డీఏ కార్యాలయం ఎదురు వీధిలో నాగవల్లీ అపార్టుమెంట్ వద్ద తాగునీరు సరఫరా పైపులైన్ మరమ్మతులకు వచ్చింది. గతంలో అనేక మార్లు మరమ్మతులు చేపట్టినా ఇంకా సమస్య పరిష్కారం కాలేదు. ప్రస్తుతం మరమ్మతుల పనులు గత నాలుగు రోజులుగా నిర్వహిస్తున్నా నీటి వృథా మాత్రం ఆగలేదు. నిత్యం తాగునీరు విడుదల చేసే సమయంలో పెద్ద ఎత్తున నీరంతా రహదారి పాలవుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి, నీటి వృథాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో సత్తా చాటిన లతాదాస్



లతాదాస్‌ను సత్కరించిన కాలేజీ యాజమాన్యం

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : ఇటీవల స్వీడన్‌లో జరిగిన మాస్టర్స్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో నగరానికి చెందిన మాస్టర్స్ అథ్లెటిక్ లతాదాస్ మెరుగైన ప్రతిభను చాటారు. 4×100 మీటర్ల రిలేలో 4వ స్థానం, 2వేల మీటర్ల స్టీపుల్ చేజ్ విభాగం, 200 మీటర్ల హర్డిల్స్‌లో 5వ స్థానంలో నిలిచారు. ఆళ్వార్‌దాస్ పబ్లిక్ స్కూలులో వ్యాయామ ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్న లతాదాస్‌ను ఈ సందర్భంగా ఆళ్వార్‌దాస్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ ఎస్.పి.రవీంద్ర, కరస్పాండెంటెంట్ విజయారవీంద్రలు ఘనంగా సత్కరించారు.

రద్దీగా అన్నక్యాంటీన్లు



పాతపందుల ఫారం అన్నక్యాంటీన్ వద్ద బారులు తీరి..

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : ఇటీవల నగరంలో అన్న క్యాంటీన్లు ప్రారంభం కాగా.. ఎక్కడ చూసినా రద్దీగానే కనిపిస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో వీటిని తొలగించగా.. కూటమి ప్రభుత్వం వచ్చాక అన్నక్యాంటీన్లు పునరుద్ధరించిన సంగతి తెలిసిందే. క్యాంటీన్ తెరిచిన గంట వ్యవధిలోనే 300 టోకెన్లన్నీ అయిపోతున్నాయి. మధ్యాహ్నం మంచి డిమాండ్ ఉంటుందని నిర్వాహకులు చెప్పన్నారు. ఆరిలోవ కాలనీలో ఎప్పుడు చూసినా జనం బారులు తీరి కనిపిస్తున్నారు.



వ్యర్థాలతో నిండిన తీరం

తీరమంతా అధ్వానం...!

పర్యాటకులను అమితంగా ఆకర్షించే విశాఖ తీర ప్రాంతం అధ్వానంగా మారుతోంది. సీతకొండ దిగువ భాగంలో ఇతర ప్రాంతాల నుంచి మురుగునీరు తీరంలోనే నిలిచిపోతుంది. దీంతో పాటు ప్లాస్టిక్, ఇతరత్రా వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. వాస్తవానికి ఈ ప్రాంతాన్ని ఎవరూ శుభ్రం చేయకపోవటంతో సందర్శకులు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం నడకకు వచ్చేవారంతా తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ ప్రాంతాన్ని శుభ్రం చేయాలని పలువురు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ఎంవీపీకాలనీ



ఫార్మా రంగంలో ఉద్యోగాలు కల్పించాలి



జిల్లా అధ్యక్షులు రవీంద్రకు వినతిపత్రం అందజేస్తున్న ఫార్మా అసోసియేషన్ ప్రతినిధులు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: ఫార్మా రంగంలో ఉద్యోగాలకు నోటిఫికేషన్ వేయాలని, గత 20 సంవత్సరాలుగా ఉద్యోగాల ఊసేలేదని ఏపీ ఫార్మసీ అసోసియేషన్ సభ్యులు బుధవారం భాజపా జిల్లా అధ్యక్షులు మేడపాటి రవీంద్రను కలిసి భాజపా కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఏపీ ఫార్మసీ అండ్ డ్రగ్ కంట్రోల్ అథారిటీ బాడీ నియామకాలు జరగలేదన్నారు. ఇకపై శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగ నియామకాలు చేపట్టాలని కోరారు.

శునకాలతో భయం.. భయంగా..



రవీంద్రనగర్‌లో కుక్కల గుంపు

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : తూర్పు నియోజకవర్గ రవీంద్రనగర్‌లో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉంది. పదుల సంఖ్యలో గ్రామ సింహాలు తిరుగుతూ జనాన్ని భయపెడుతున్నాయి. వీధుల్లో తిరిగే చిన్నారులపై, మహిళలపై దాడికి పాల్పడుతుండటంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ప్రధానంగా రాత్రి సమయంలో ద్విచక్రవాహనాల వెనుక పడుతుండటంతో వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీటిని తరలించాలని కోరుతున్నారు.

విశాఖ ఉత్తరం

•విశాఖ ఉత్తరం •విశాఖ దక్షిణం

అనధికార పార్కింగ్‌పై కేసులు


రైల్వే స్టేషన్ నో పార్కింగ్ జోన్‌లో నిలిపిన ద్విచక్ర వాహనాలు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: రైల్వేస్టేషన్ ఆవరణలోని నో పార్కింగ్ జోన్‌లో నిలిపి ఉంచిన వాహనాలపై ఆర్పీఎఫ్ పోలీసులు కేసులు నమోదు చేశారు. గత కొంత కాలంగా హెచ్చరికలు జారీ చేస్తున్నప్పటికీ ఫలితం లేకపోవడంతో బుధవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి దాదాపు 60 మంది చోదకులపై కేసులు నమోదు చేసినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. వాహనాలను అడ్డగా నిలిపి ప్రయాణికులకు అసౌకర్యం కల్పిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అల్లిపురం, న్యూస్‌టుడే

మేము న్నాం.. మీకు తోడుగా 10 AM - 1 PM
విశాఖ ఉత్తరం: 80747 24699
విశాఖ దక్షిణం: 80085 66543

సమస్య: 33వ వార్డు అల్లిపురం, వెంకటేశ్వరమెట్ట తదితర ప్రాంతాల్లో కాలువల్లో పూడిక తొలగించడం లేదు. దీంతో చలేని దుర్వాసనతో నిలువలేకపోతున్నాం. – రాజు, అల్లిపురం

సమాధానం: వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టరు దృష్టికి తీసుకువెళ్లి మీ ప్రాంతంలోని కాల్వల్లో పూడిక తొలగించేలా చర్యలు తీసుకుంటాం.– ఎస్.ఎస్.కిషోర్, జోన్-4 శానిటరీ సూపర్‌వైజర్

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

మురళీనగర్, న్యూస్‌టుడే : సెక్టార్-8 బాలికల విద్యాలయంలో 8, 9, 10 తరగతి విద్యార్థులకు బుధవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సత్యసాయి సేవా సమితి మురళీనగర్ శాఖ ఆధ్వర్యంలో 'భగవంతునిపై నమ్మకం' అనే అంశంపై జరిగిన ఈ వ్యాసరచన పోటీలో 130 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సేవాసమితి సభ్యులు జనార్థన, నాగమణి, డి.అప్పారావు, పాఠశాల ప్రిన్సిపల్ ఎస్.వి.శుభశ్రీ, వ్యాయామ సంచాలకులు సి.హెచ్.రమణారావు పాల్గొన్నారు.


వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు


స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొన్న భారత మత్స్య పరిశోధన సంస్థ ఉద్యోగులు


గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దక్షిణం తెదేపా బాధ్యులు సీతంరాజు సుధాకర్, నాయకులు


కేజీహెచ్‌లో పర్యవేక్షక వైద్యాధికారి డాక్టర్ శివానంద తదితరులు

మహాత్ముని బోధనలు శిరోధార్యం

వన్‌టౌన్, పూర్ణమార్కెట్, కార్పొరేషన్, న్యూస్‌టుడే: జాతిపిత మహాత్మాగాంధీ అహింస, శాంతి బోధనలను ప్రతి ఒక్కరు ఆచరించాలని వక్తలు పిలుపునిచ్చారు. బుధవారం నగర వ్యాప్తంగా గాంధీ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, ఉద్యోగులు మహాత్ముని విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. చేపలరేవులో ఎఫ్ఎస్ఐ ఉద్యోగులు, కేజీహెచ్‌లో ఆసుపత్రి పర్యవేక్షక వైద్యాధికారి డాక్టర్ పి.శివానంద, పూర్ణమార్కెట్ వద్ద 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, దక్షిణం తెదేపా బాధ్యులు సీతంరాజు సుధాకర్ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ జీవీఎంసీ గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు.

మాధవధార, గురుద్వారా, అక్కయ్యపాలెం, తాటిచెట్లపాలెం, న్యూస్‌టుడే: ఉత్తరం నియోజకవర్గంలో మహాత్మాగాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి జయంతులను ఘనంగా నిర్వహించారు. బిర్లా జంక్షన్‌లోని ఎస్‌బీఐ అధికారులు, సిబ్బంది.., ఉత్తర నియోజకవర్గం భాజపా కార్యాలయంలో ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు కుమార్తె శ్యామలా దీపిక, 104 ఏరియా బాపూజీనగర్‌లో బాపూజీ సేవా సంఘం.., రవాణా కార్యాలయంలో డీటీఓ జి.ఆదినారాయణ, ఏపీ ఈపీడీసీఎల్ సంస్థ గురుద్వారా కార్పొరేట్ కార్యాలయంలో సీజీఎంలు డి.సుమన్‌కల్యాణి, టీవీఎస్ఎన్ మూర్తి, బి.అశోక్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి.

కంచరపాలెం, న్యూస్‌టుడే: శ్రీగౌరీసంక్షేమ సేవాసమితి, శ్రీగౌరీ డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో వానప్రస్థ వృద్ధాశ్రమంలో, కేర్ అండ్ లవ్ బుద్ధిమాంద్యం ఆశ్రమంలో ఉచితంగా ఆహారాన్ని అందించి ఉదారత చాటుకున్నారు.

మురళీనగర్, న్యూస్‌టుడే : సెక్టర్-8 వైశాఖి స్పోర్ట్స్ పార్కులో, సెక్టర్-8 వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో, అక్కయ్యపాలెం పోర్టు స్టేడియం లో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రసాదరావు ఆధ్వర్యంలో, కస్తూరినగర్‌లో జనసేన ఉత్తరం సమన్వయకర్త పసుపులేటి ఉషాకిరణ్, తాటిచెట్లపాలెం సంతోషిమాత ఆలయం వద్ద బీసీ సెల్ అధ్యక్షులు బొడ్డేటి గంగా మహేశ్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.

సీతంపేట, న్యూస్‌టుడే: జనసేన నగర పార్టీ కార్యాలయంలో దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, సహృదయ సాహితి ఆధ్వర్యంలో రాజేంద్రనగర్‌లోని ప్రిజమ్ కళాశాలలో గాంధీ జయంతి నిర్వహించారు.

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: విశాఖ రైల్వేస్టేషన్‌లో బుధవారం స్వచ్ఛతా హీ సేవ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ మహాత్ముని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్


నరసింహనగర్‌లో గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న పి.ఉషాకిరణ్, నేతలు


పోర్టు స్టేడియం వాకర్స్..


జీవీఎంసీ అధికారులు..


స్వచ్ఛతా హీ సేవలో పాల్గొన్న బిర్లా జంక్షన్ ఎస్‌బీఐ అధికారులు, సిబ్బంది.


నివాళులర్పిస్తున్న శ్యామలదీపిక, హేమ, కూటమి నాయకులు

గాంధీ జయంతికి మేయరు గైర్హాజరు

కార్పొరేషన్: గాంధీ జయంతి వేడుకలకు మేయరు హరి వెంకట కుమారి గైర్హాజరయ్యారు. జీవీఎంసీ అదనపు కమిషనర్లు, ఇతర అధికారులు ఉదయం 9 గంటలకు గాంధీ విగ్రహం వద్దకు చేరుకున్నారు. మేయరు కోసం వేచి చూడగా ఆమె రాలేదు. దీనిపై మేయరును వివరణ కోరగా పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి వెళ్లడంతో హాజరు కాలేకపోయినట్లు చెప్పారు.


బాపూజీనగర్‌లో పారిశుద్ధ్య కార్మికులకు నగదు బహుమతులు అందజేస్తున్న జేడీ బి.రాము


రవాణా కార్యాలయంలో డీటీఓ జి.ఆదినారాయణ, సిబ్బంది నివాళి


నివాళులర్పిస్తున్న ఏపీ ఈపీడీసీఎల్ సంస్థ ఉద్యోగులు



వృద్ధులకు ఆహారం అందజేస్తున్న శ్రీగౌరీ సంక్షేమ సేవాసమితి ప్రతినిధులు


ప్రత్యేక అలంకరణలో పరమశివుడు

మహాలయ పక్షం ముగింపు

మురళీనగర్, న్యూస్‌టుడే : మహాలయ అమావాస్య సందర్భంగా స్థానిక ఉమారామలింగేశ్వరాలయంలో శాస్త్రోక్తంగా పూజలు చేశారు. ఈ ప్రత్యేక కార్యక్రమంలో శివునికి ప్రత్యేక అలంకరణ చేసి దర్శనం కల్పించారు.

అలరించిన సంగీత విభావరి

డాబాగార్డెన్స్ (అల్లిపురం), న్యూస్‌టుడే: డాబాగార్డెన్స్ అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో బుధవారం రాగమయి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో 'ఎటో వెళ్లిపోయింది' శీర్షికతో సంగీత విభావరి నిర్వహించారు. సంస్థ గౌరవాధ్యక్షుడు ఫణిస్వామి, ఇతర ప్రతినిధులు జ్యోతి వెలిగించి విభావరిని ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు సన్‌మూర్తి, జేఎంఆర్ నెహ్రూ, శ్రీనివాస్, మహమ్మద్ ఖాన్, పీతల రాజేంద్రప్రసాద్, వెంకటేశ్ పలువురు గాయకులు ఆపాత మధుర గీతాలను ఆలపించారు.


జ్యోతి వెలిగిస్తున్న సంస్థ సభ్యులు

సమస్యలు పరిష్కరించాలని ఉపాధ్యాయుల ఆందోళన

కార్పొరేషన్, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్(డీటీఎఫ్), యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్(యూటీఎఫ్) ఆధ్వర్యంలో బుధవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆందోళన నిర్వహించారు. డీటీఎఫ్ అధ్యక్షుడు కె.రామారావు మాట్లాడుతూ జీఓ 117ను రద్దు చేస్తామని హామీ ఇచ్చినా, ఇప్పటికీ చర్యలు చేపట్టలేదన్నారు. అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్ మాట్లాడుతూ పాఠశాల్లో మాతృభాష ఉద్యమాన్ని కొనసాగించి, ఆ మేరకు సెక్షన్లు పెంచాలని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు డి.నాగేశ్వరరావు మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు సక్రమంగా నిర్వహించడం లేదని, వారికి అర్బన్ ఎంఈఓ పోస్టులివ్వాలని కోరారు. సంఘం నాయకులు టీఆర్ అంబేడ్కర్, టి.అప్పారావు, ఎస్.నాగమణి, ఉమాదేవి, కె.రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.



ఆందోళనలో పాల్గొన్న ఉపాధ్యాయులు

నేటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

మాధవధార, న్యూస్‌టుడే: మాధవధార సీతన్నగార్డెన్స్ వెలసిన కనకమహాలక్ష్మీ, గాయత్రిదేవి, కనకదుర్గాదేవి ఆలయంలో గురువారం నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ ధర్మకర్త సనపల కీర్తి, సభ్యులు తెలిపారు. ఈనెల 3 నుంచి 12 వరకు వరకు ప్రతి రోజు ఉదయం, సాయంత్రం అమ్మవారికి క్షీరాభిషేకం, కుంభాభిషేకం, సుగంధ ద్రవ్యలతో అభిషేకాలు, గణపతి హోమం, సామూహిక కుంకుమార్చనలు నిర్వహిస్తామన్నారు. సాయంత్రం తిరువీధి మహోత్సవం, దర్బార్ సేవ ఉంటుందన్నారు. అమ్మవారు రోజుకో అవతారంలో దర్శనమిస్తారని తెలిపారు. అక్టోబర్ 10న అన్న సంతర్పణ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

సాయిబాబా మందిరంలో ...

గురుద్వారా, న్యూస్‌టుడే: సీతమ్మధార నార్త్‌ఎక్స్‌టెన్సన్ దరి సాయిబాబా మందిరంలో గురువారం నుంచి దుర్గాదేవి నవరాత్రి, శ్రీవారి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఈవో బండారు ప్రసాద్ తెలిపారు. తొమ్మిది రోజులపాటు అమ్మవారిని రోజుకో అవతారంలో అలంకరిస్తామన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన ఉంటుందన్నారు.

చెత్త ఛార్జీల నుంచి విముక్తి..

కార్పొరేషన్, న్యూస్‌టుడే: చెత్త ఛార్జీల నుంచి నగర వాసులకు ఎట్టకేలకు విముక్తి లభించింది. గత వైకాపా ప్రభుత్వం చెత్త సేవా రుసుములను అమలులోకి తెచ్చింది. మురికివాడల్లో రూ.60, ఇతర ప్రాంతాల్లో రూ.120 చొప్పున వసూలుకు శ్రీకారం చుట్టింది. జీవీఎంసీ వార్డు కార్యదర్శులు, వాలంటీర్లకు రుసుముల వసూలు బాధ్యతలను అప్పగించారు. వారు నెలనెలా ఇంటింటికి తిరిగి ముక్కు పిండి రుసుములు వసూలు చేసేవారు. నెలకు రూ.2కోట్లు ప్రభుత్వానికి సమకూరేది. జీవీఎంసీ పాలకవర్గంతో సంబంధం లేకుండా నేరుగా క్లాప్ గుత్తేదారుకు నిధులు జమ అయ్యేవి. చెత్త ఛార్జీలకు నిరసనగా పలుచోట్ల నివాసితులు రోడ్డెక్కి ఆందోళన చేపట్టారు. నివాసిత సంక్షేమ సంఘాలు కోర్టును ఆశ్రయించాయి. ఇటీవల ఎన్నికల సమయంలో కూటమి నాయకులు చెత్త ఛార్జీలను రద్దు చేస్తామని హామీ ఇచ్చారు. మూడు నెలల కిందట కూటమి ప్రభుత్వం రావడంతో అప్పటి నుంచే చెత్త ఛార్జీలను వసూలు చేయడం నిలిపేశారు. అయితే అధికారికంగా ప్రకటించలేదు. ఎట్టకేలకు బుధవారం సీఎం చంద్రబాబు చెత్త ఛార్జీలను రద్దు చేస్తూ ప్రకటించారు. దీనిపై నగర వాసులు, నివాసిత సంక్షేమ సంఘాలు హర్షం వ్యక్తం చేశారు.

అంబికాబాగ్ ఆలయంలో పచ్చదనానికి శ్రీకారం

వన్‌టౌన్, న్యూస్‌టుడే: కనకమహాలక్ష్మి అమ్మ వారి దత్తత అంబికాబాగ్ సీతారామస్వామి ఆలయ ప్రాంగణంలో పచ్చదనానికి శ్రీకారం చుట్టారు. బుధవారం పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. ఆలయ ఏఈఓ తిరుమలేశ్వరరావు, ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

కంచరపాలెం, న్యూస్‌టుడే: మర్రిపాలెం రైల్వే క్వార్టర్ల 11కేవీ ఫీడరు మరమ్మతుల కారణంగా ఈనెల 4న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్తు నిలుపుదల చేస్తున్నట్లు జోన్-2 ఈఈ బి.కె.నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా మర్రిపాలెం ప్రధాన రోడ్డు, రైల్వే క్వార్టర్లు, గవరవీధి, గొల్లవీధి, రాణా ప్రతాప్‌నగర్, శ్రీనివాస్‌నగర్, హుస్సేన్‌నగర్ ప్రాంతాలకు విద్యుత్తు ఉండదన్నారు. స్థానికులు సహకరించాలని ఆయన కోరారు.

చెత్త ఛార్జీల రద్దుపై హర్షం

కార్పొరేషన్, న్యూస్‌టుడే: చెత్త ఛార్జీలను రద్దు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించడంపై 72వ వార్డు సీపీఎం కార్పొరేటర్ బి.గంగారావు, సీపీఐ నగర కార్యదర్శి ఎం.పైడిరాజు హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం ప్రజల నుంచి ముక్కుపిండి వసూలు చేసిన చెత్త ఛార్జీలను గుత్తేదారులకు ధార పోశారన్నారు. ప్రజలకు భారంలా మారిన ఆస్తి పన్ను విధానంలోనూ మార్పులు తీసుకొచ్చి, పాత విధానాన్ని అమలు చేసేలా ఆదేశాలివ్వాలని కార్పొరేటర్ గంగారావు కోరారు.

4 కిలోల గంజాయి స్వాధీనం

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: విశాఖ మీదుగా మచిలీపట్నానికి గంజాయి రవాణా చేసేందుకు యత్నించిన వ్యక్తిని విశాఖలో రైల్వే పోలీసులు అరెస్టు చేశారని జీఆర్పీ సీఐ ధనుంజయనాయుడు తెలిపారు. స్టేషన్‌లో ఆర్పీఎఫ్, జీఆర్పీ బృందాలు గస్తీ కాస్తున్న సమయంలో మచిలీపట్నంకు చెందిన బోయిన వెంకటరమణ అనుమానాస్పదంగా కనిపించడంతో ఆర్పీఎఫ్ ఎస్ఐ కీర్తిరెడ్డి సోదాలు చేశారు. అతని బ్యాగ్‌లో 4 కిలోల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడ్ని న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.


రైల్వే పోలీసుల అదుపులో నిందితుడు

మూర్తి సేవలు నిరుపమానం

వన్‌టౌన్, న్యూస్‌టుడే: మాజీ ఎంపీ, తెదేపా సీనియర్ నేత, దివంగత ఎంవీవీఎస్ మూర్తి ఎంపీ, ఎమ్మెల్సీగా అందించిన సేవలు నిరుపమానమని తెదేపా నాయకులు కొనియాడారు. మూర్తి వర్ధంతిని బుధవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళి అర్పించారు. తెదేపా విశాఖ లోక్‌సభ నియోకవర్గ అధ్యక్షులు గండిబాబ్జీ, ఎమ్మెల్సీ చిరంజీవిరావు, దక్షిణ నియోజకవర్గ బాధ్యులు సీతంరాజు సుధాకర్, పార్టీ నాయకులు పొలమరశెట్టి శ్రీనివాసరావు, గొంపకృష్ణ, పొడుగు కుమార్ తదితరులు పాల్గొన్నారు.


మాజీ ఎంపీ ఎంవీవీఎస్ మూర్తి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న తెదేపా నేతలు

ఘనంగా ఏఎంసీ వ్యవస్థాపక దినోత్సవం

వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఆంధ్ర వైద్య కళాశాల వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మంగళవారం రాత్రి కళాశాల ఆవరణలో జరిగిన ఈ వేడుకల్లో ప్రిన్సిపల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, కేజీహెచ్ పర్యవేక్షక వైద్యాధికారి డాక్టర్ పి.శివానంద, ఉప ప్రిన్సిపాళ్లు డాక్టర్ రాజేంద్రప్రసాద్, డాక్టర్ మన్మథరావు, ప్రొఫెసర్లు డాక్టర్ కృష్ణవేణి, డాక్టర్ పార్వతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమంగా రాణించిన 31 మంది మెడికోలకు పతకాలు, 12 మందికి నగదు బహుమతులు, 58 మందికి ధ్రువపత్రాలు అందజేసినట్లు ప్రిన్సిపల్ తెలిపారు.


వేడుకల్లో పాల్గొన్న ప్రిన్సిపల్ డాక్టర్ బుచ్చిరాజు, కేజీహెచ్ పర్యవేక్షక వైద్యాధికారి డాక్టర్ శివానంద తదితరులు

మోకాళ్ల ఔషధం పేరిట మోసం

గురుద్వారా, న్యూస్‌టుడే: ఆయుర్వేద ఔషధం పేరిట ఓ వృద్ధుడ్ని మోసం చేయడంపై ద్వారకా పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మర్రిపాలెం ప్రాంతానికి చెందిన ప్రకాశ్ (69) మోకాళ్ల నొప్పితో బాధపడుతున్నారు. ఆయుర్వేదం ఔషధం వాడడంతో మోకాళ్ల నొప్పులు తగ్గిపోయాయని అతనికి పరిచయమైన వ్యక్తి చెప్పాడు. రామాటాకీస్ ప్రాంతంలోని అతను చెప్పిన దుకాణానికి జులైలో ప్రకాశ్ వెళ్లారు. అక్కడ వైద్య నిమిత్తం రూ.60వేలు తీసుకొని ఐదు రకాల ముందులు ఇచ్చారు. తగ్గకపోతే నగదు తిరిగి ఇచ్చేస్తానని నిర్వాహకులు నమ్మబలికారు. ఎన్ని రోజులు వాడినా ఎలాంటి ప్రయోజనం కనిపించకపోవడంతో నిర్వాహకులను ప్రశ్నించాలని వెళారు. అక్కడ దుకాణం లేకపోవడం చూసి మోసపోయానని గ్రహించి బుధవారం ద్వారకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ డి.వి. రమణ పర్యవేక్షణలో ఎస్ఐ ధర్మేంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన మెగా బాడ్మింటన్ టోర్నీ

తాటిచెట్లపాలెం, న్యూస్‌టుడే: పోలియో నిర్మూలన కోసం రోటరీ క్లబ్ ఇంటర్నేషనల్ నిధికి విరాళం అందజేసే కార్యక్రమంలో భాగంగా రోటరీ క్లబ్ గ్రేటర్ విశాఖ ఆధ్వర్యంలో రైల్వే బాడ్మింటన్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన మెగా బాడ్మింటన్ టోర్నీ బుధవారంతో ముగిసింది. పురుషుల డబుల్స్ విభాగంలో విజయనగరం సెంట్రల్ క్లబ్ టీమ్ విజేతగా నిలిచింది. సోంపేట రోటరీ క్లబ్ ద్వితీయ, గ్రేటర్ విశాఖ తృతీయ స్థానాల్లో నిలిచాయి. సింగిల్స్‌లో విజయనగరం సెంట్రల్ క్లబ్‌కు చెందిన పైడిరాజు, గ్రేటర్ విశాఖ క్లబ్‌కు చెందిన ఎస్.సునీల్ ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. పారా ఒలింపిక్ ఇండియన్ కోచ్ మురళీకృష్ణను ఈ సందర్భంగా సన్మానించారు. టోర్నమెంట్ అధ్యక్షుడు డాక్టర్ అశోక్ దేవరకొండ, పి.డి.జి.కిషోర్‌కుమార్, క్లబ్ అధ్యక్షుడు ఎం.డి.యాసిన్, సెక్రటరీ చింతా నేతాజీ, పి.డి.జి.బి.బ్రహ్మానందం, జి.కే.మూర్తి, డాక్టర్ నరేష్ చేతలమీదుగా బహుమతులు అందజేశారు.



విజేతలకు జ్ఞాపికలు అందజేస్తున్న రోటరీ క్లబ్ గ్రేటర్ విశాఖ ప్రతినిధులు

మోర్తా రాజారావుకు సత్కారం

వన్‌టౌన్, న్యూస్‌టుడే: మాజీ రాష్ట్రపతి, దివంగత అబ్దుల్ కలామ్ అవార్డు గ్రహీత, తెదేపా సీనియర్ నాయకులు డాక్టర్ మోర్తా రాజారావును పార్టీ నేతలు బుధవారం సత్కరించారు. తెదేపా లోక్‌సభ నియోజకవర్గ అధ్యక్షులు గండిబాబ్జీ, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, పార్టీ ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాసరావు, ఇతర నాయకులు వెల్లంకి భరత్, పొడుగుకుమార్, అప్పారావు, బొడ్డేడి మోహన్ తదితరులు ఆయనకు శాలువా కప్పి సత్కరించి అభినందనలు తెలిపారు.


మోర్తా రాజారావును సత్కరిస్తున్న గండిబాబ్జీ, పార్టీ నాయకులు

రక్తదాన శిబిరానికి స్పందన

గురుద్వారా, న్యూస్‌టుడే: క్రెడాయ్ విశాఖపట్నం, వైజాగ్ రన్నర్స్, ఏఎస్ రక్తనిధి సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం సీతమ్మధార కేఎస్ఆర్ కాంప్లెక్స్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. సంస్థ జాతీయ సంయుక్త కార్యదర్శి రాజా శ్రీనివాస్, అధ్యక్షులు వి.ధర్మేంద్ర శిబిరాన్ని ప్రారంభించారు. సుమారు 50 మంది సభ్యులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. సంస్థ ఉపాధ్యక్షులు ఇ.అశోక్‌కుమార్, సంయుక్త కార్యదర్శులు కంచెటి శ్రీనివాస్, పి.నర్సింహరావు, జి.కార్తీక్, ఎన్. భర్నేందర్, మహిళా విభాగ కార్యదర్శి కె.కిరణ్మయి, సభ్యులు అప్పల శ్రీనివాస్‌రావు, కిరణ్‌కుమార్, వైజాగ్ రన్నర్స్ సంఘం కోశాధికారి కె.రాధిక, సభ్యులు రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న సభ్యులు

కార్మిక, ప్రజా సంఘాల ర్యాలీ

జగదాంబకూడలి (కార్పొరేషన్): స్టీలు ప్లాంటును ప్రయివేటీకరించవద్దని కోరుతూ ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ నేతృత్వంలో కార్మిక సంఘాల నాయకులు ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ కూడలి నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు ర్యాలీగా వచ్చి బహిరంగ సభ నిర్వహించారు. ప్రజా కళామండలి, అరుణోదయ సంస్థ కళాకారులు పాటలు, నృత్యాలతో హోరెత్తించారు.


ర్యాలీలో పాల్గొన్న ప్రజాసంస్థ ప్రతినిధులు

తాత్కాలిక ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలి

జగదాంబకూడలి (కార్పొరేషన్): భారత జీవిత బీమా సంస్థలో 1993 నుంచి 1997 వరకు పనిచేసిన తమను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ తొలగించిన ఉద్యోగులు బుధవారం ఆందోళన నిర్వహించారు. ముందస్తు నోటీసులు జారీ చేయకుండా తొలగించడం అన్యాయమని వెంకటరమణ అనే ఉద్యోగి పేర్కొన్నారు. తక్షణమే తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు.

ప్రతి నిర్ణయం.. అక్రమాల మయం!!

ఈనాడు, విశాఖపట్నం

వైకాపా హయాంలో '22ఏ' జాబితా నుంచి భూముల తొలగింపు

వాటిపై ఆ పార్టీ నేతల కన్ను

హస్తగతమైన తీరుపై అధికారులు విచారణ



విశాఖ నగరం, చుట్టుపక్కల ప్రాంతాల్లో భూములంటే...బంగారంతో సమానం. చాలా ఖరీదైనవి. అదే గత వైకాపా ప్రభుత్వంలో నేతల కన్ను పడేందుకు కారణమయింది. అమాయకుల స్థలాలు, విదేశాల్లో ఉండే వారి ఆస్తులను బెదిరించి కొట్టేసిన కొందరు నేతలు వివాదాల్లోని భూములను హస్తగతం చేసుకున్నారు. అప్పట్లో కొందరు అధికారులు కూడా సహకరించారు. నిషిద్ధ భూముల జాబితా నుంచి తొలగించిన తీరూ వారికే మేలు చేసింది. ఎసైన్డ్ భూములు కేటాయించి 20 ఏళ్లు పూర్తయితే భూ యాజమాన్య హక్కులు కల్పించే(ఫ్రీహోల్డ్) విధానమూ వారి పంట పడించింది. చివరికి నష్టపోయింది పేదలే.

సిసోదియా రాకతో: విశాఖలో వైకాపా నేతలు భూములు అక్రమంగా చేజిక్కించుకున్నారన్న ఫిర్యాదులతో రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోదియా ఇటీవల విశాఖలో పర్యటించి క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టారు. గత అయిదేళ్లలో నిషేధిత జాబితా నుంచి 6,738 ఎకరాలు తొలగించినట్లు జిల్లా అధికారులు నివేదించారు. ఫ్రీహోల్డ్‌కు 609 ఎకరాలు గుర్తించగా 171 ఎకరాలకు రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఈ భూములు చేతులు మారిన తీరు, అక్రమ లావాదేవీలు వంటి అంశాలపై ప్రస్తుతం విచారణ చాలా వేగంగా జరుగుతోంది.

ఎన్నో ఉన్నాయ్... ✦ గతంలో వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది కాలంలోనే నిషేధిత జాబితా నుంచి పలు కీలక ప్రాంతాల్లోని భూములు తొలగించారు. ఇవన్నీ పలువురు నేతల పేరున మారాయి. స్థిరాస్తి రంగంతో సంబంధమున్న ఒక ప్రజాప్రతినిధి మధురవాడ, కొమ్మాదిలో కొన్ని భూములు క్రమబద్ధీకరించుకున్నారు.

✦ వైకాపాలో ఓ కీలక నేత కొమ్మాది, కాపులుప్పాడలో కొన్ని భూములను 22ఏ నుంచి తొలగించుకున్నారు.

✦ ఎన్నికలకు ముందు మధురవాడ, పెందుర్తి, అచ్యుతాపురం, అనకాపల్లిలో విలువైన భూములను '22ఏ' నుంచి బయటకు తెచ్చి భారీగా సొమ్ము చేసుకున్నారు.

అయిదేళ్లలో 22ఏ జాబితా నుంచి తొలగించిన భూములు : 6,738.65 ఎకరాలు

22ఏ(నిషిద్ధ జాబితా) నుంచి తొలగించినవి	ఎకరాలు
పోర్టు ట్రస్టు భూసేకరణ చేసినవి	5305.68
గృహ నిర్మాణ సంస్థ	161.47
ఏపీ టిడ్కో	1.27
ల్యాండ్ సీలింగ్ భూములు	38.62
భూసమీకరణ	384.45
ఫ్రీహోల్డ్	626.06
తప్పిదాల వల్ల సవరించినవి	221.10

ప్రాయశ్చిత దీక్షకు మద్దతుగా నగర సంకీర్తన

తాటిచెట్లపాలెం, న్యూస్‌టుడే: జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత దీక్షకు మద్దతుగా తాటిచెట్లపాలెం ఆంజనేయస్వామి విగ్రహం వద్ద బుధవారం జీవీఎంసీ 45 వార్డు జనసేన నాయకుడు తుమ్మల త్రినాథరావు ఆధ్వర్యంలో 'నగర సంకీర్తన' నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఉత్తర నియోజకవర్గ జనసేన సమన్వయకర్త పసుపులేటి ఉషాకిరణ్ పాల్గొని మాట్లాడారు. తిరుమల లడ్డూ ప్రసాదం కల్తీ జరిగితే క్షమించరాని నేరమని పేర్కొన్నారు. కోట్లాది మంది హిందువులు, భక్తుల మనోభావాలు దెబ్బ తీసే విధంగా గత వైకాపా ప్రభుత్వం వ్యవహరించిన తీరును ఖండిస్తూ ఈ దీక్షను చేపట్టామని తెలిపారు. ఆంజనేయస్వామి విగ్రహం నుంచి ప్రారంభమైన నగర సంకీర్తన రామచంద్రనగర్, చిల్లిబాబు కాలనీ, లక్ష్మీనారాయణపురం, కైలాసపురం పురవీధుల్లో కొనసాగింది. జనసేన నేతలు పోలవరపు లక్ష్మీ చౌదరి, శ్యామల, నాగమణి, దివాకర్, భాస్కర్, పరమేశ్, అప్పారావు, పీలా హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



తాటిచెట్లపాలెంలో...

కార్పొరేషన్, న్యూస్‌టుడే: ప్రాయశ్చిత దీక్ష చేపట్టిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు మద్దతుగా బుధవారం కూటమి నాయకులు నగర సంకీర్తన నిర్వహించారు. కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం నుంచి కంచరపాలెం వెంకటేశ్వరస్వామి దేవాలయం వరకు కోలాటం, సన్నాయి మేళాలు, గోవింద నామస్మరణతో సంకీర్తన జరిపారు.



నగర సంకీర్తనలో కూటమి ప్రతినిధులు

మురికివాడల్లో మలబార్ ట్రస్ట్ సేవలు

తాటిచెట్లపాలెం, న్యూస్‌టుడే: తాటిచెట్లపాలెం ఏఎస్ఆర్‌నగర్‌లోని మురికివాడలో చదువు మధ్యలో ఆపేసిన విద్యార్థులను గుర్తించి వారిని చదివించడంతో పాటు మంచి పౌష్టికాహారం అందించేందుకు మలబార్ ఛారిటబుల్ ట్రస్ట్ సంస్థ ముందుకొచ్చింది. ఈ సంస్థ ప్రతినిధులు బుధవారం ఏఎస్ఆర్‌నగర్, మధురవాడలోని బక్కన్నపాలెం, కే1, కే2 కాలనీ, గాయత్రినగర్ మురికివాడలను సందర్శించారు. బడి మానేసిన చిన్నారుల తల్లిదండ్రులతో సమావేశమయ్యారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మొదటి స్థానంలో నిలవాలి

కొమ్మాది, న్యూస్‌టుడే: స్వచ్ఛసర్వేక్షణ్‌లో విశాఖ నగరాన్ని మొదటి స్థానంలో నిలిపేందుకు జీవీఎంసీతో పాటు ప్రజలు సైతం పరిశుభ్రతలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. 'స్వచ్ఛభారత్ దివస్' సందర్భంగా కాపులుప్పాడ డంపింగ్‌యార్డు వద్ద 15 రోజులు నిర్వహించిన 'స్వచ్ఛతా హీ సేవా' ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కలెక్టర్ హరేంధిరప్రసాద్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరి సహకారం అవసరమన్నారు. అనంతరం డంపింగ్‌యార్డు ప్రాంతాల్లో మొక్కలు నాటారు. మేయర్ జి.హరి వెంకటకుమారి, జెడ్పీ బి.సింహాచలంనాయుడు, తెదేపా జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, కార్పొరేటర్లు మొల్లి హేమలత, లొడగల అప్పారావు, చిన్ని లక్ష్మికుమారి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

అప్పన్న సన్నిధిలో గరికపాటి

సింహాచలం, న్యూస్‌టుడే: ప్రముఖ ప్రవచనకర్త, సహస్రావధాని పద్మశ్రీ అవార్డు గ్రహీత గరికపాటి నరసింహారావు బుధవారం సాయంత్రం సతీ సమేతంగా సింహాద్రి అప్పన్న స్వామిని దర్శించుకున్నారు. ఆయనకు అధికారులు, అర్చకులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. కప్పస్తంభం ఆలింగనం చేసుకుని బేడామండపం ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో స్వామిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఐ.వి.రమణాచార్యులు నేతృత్వంలో వేదపండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. దేవస్థానం డిప్యూటీ ఈవో రాధ, పర్యవేక్షకుడు పాలూరి నరసింగరావు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.



కప్పస్తంభం వద్ద గరికపాటి నరసింహారావు దంపతులు

పోర్టు ఆసుపత్రిని కాపాడాలని వినతి

తాటిచెట్లపాలెం, న్యూస్‌టుడే: విశాఖ పోర్టు ఆసుపత్రి ప్రైవేటీకరణ నిలిపివేయాలని కోరుతూ గాంధీ చిత్రపటానికి పోర్టు ఉద్యోగులు వినతి పత్రం అందజేశారు. పోర్టు ఆసుపత్రిని ప్రైవేటీకరణ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం టెండర్లు పిలుస్తున్నందుకు నిరసనగా యునైటెడ్ పోర్టు అండ్ డాక్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్ష శిబిరంలో బుధవారం గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడు వి.ఎస్.పద్మనాభరాజు మాట్లాడుతూ గాంధీ స్ఫూర్తి నివాళి అర్పించడంతో ప్రభుత్వ ఆసుపత్రులను కాపాడుకోవడమేనన్నారు. పోర్టు ఉద్యోగులు, కుటుంబ సభ్యులు, పెన్షనర్లకు వైద్యానికి దూరం చేయాలనే ఆలోచనతోనే కేంద్రం ఇటువంటి చర్యలకు పాల్పడుతుందని ఆరోపించారు. టెండర్ల నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకొని డిమాండ్ చేశారు. యూనియన్ ప్రతినిధులు కె.సత్యనారాయణ, ఈశ్వరరావు, జె.సత్యనారాయణ పాల్గొన్నారు.

స్వచ్ఛతకు కదిలిన యంత్రాంగం..

వన్‌టౌన్, రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: గాంధీ జయంతి సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాల్లో బుధవారం స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ హరేంధిరప్రసాద్, జేసీ మయూర్ అశోక్, డీఆర్వో మోహన్‌కుమార్‌లతో పాటు కలెక్టరేట్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కలెక్టరేట్ ఆవరణలో ఉన్న చెత్తాచెదారాలను తొలగించారు. ఏపుగా పెరిగిన చెట్ల కొమ్మలను కత్తిరించారు. పరిసరాలను శుభ్రం చేశారు. జడ్పీ కార్యాలయ ఆవరణలో జరిగిన స్వచ్ఛత కార్యక్రమంలో ఇన్‌ఛార్జి సీఈఓ సత్యనారాయణ, ఉద్యోగులు పాల్గొని పరిసరాలను శుభ్రం చేశారు.



రైల్వేస్టేషన్ పరిసరాల్లో చెత్తను తొలగిస్తున్న వాల్తేరు డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్, ఇతర అధికారులు

మహాత్ముని జయంతి.. సేవా స్రవంతి



గాంధీజీ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్, జేసీ మయూర్‌అశోక్, తదితరులు

మహనీయుల ఆశయ సాధనకు కృషి

వన్‌టౌన్, న్యూస్‌టుడే: జాతిపిత మహాత్మాగాంధీ, మాజీ ప్రధాని లాల్ బహుదూర్‌శాస్త్రి వంటి మహనీయుల ఆశయ సాధనకు ప్రభుత్వఉద్యోగులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ కోరారు. బుధవారం ఉదయం కలెక్టరేట్ ఆవరణలో గాంధీ, లాల్‌బహుదూర్‌శాస్త్రి జయంతి నిర్వహించారు. గాంధీ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి నివాళి అర్పించారు. ప్రతి ఒక్కరు వారు చూపిన మార్గంలో నడవాలన్నారు. జేసీ మయూర్‌అశోక్, డీఆర్వో మోహన్‌కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు అండగా ఉంటాం: ఎంపీ రమేష్

పెదవాల్తేరు, న్యూస్‌టుడే : చేనేత కార్మికులకు అండగా ఉండాలని అనకాపల్లి పార్లమెంటు సభ్యులు సి.ఎం.రమేష్ కోరారు. ప్రధాని నరేంద్ర మోదీ పుట్టినరోజు నేపథ్యంలో సేవా పక్షోత్సవాల్లో భాగంగా గాంధీ జయంతి పురస్కరించుకొని లాసన్స్‌బేకాలనీ భాజపా కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన ఖాదీ సంతను సీఎం రమేష్ ప్రారంభించారు. ముందుగా మహాత్మాగాంధీ విగ్రహానికి ఎంపీ రమేష్‌తో పాటు కూటమి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ.. బాపూజీ మార్గం నేటి సమాజానికి ఎంతో ఉపయోగమన్నారు. అలాగే లాల్‌బహుదూర్‌శాస్త్రి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చేనేత ఉత్పత్తులతో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఎంపీ సి.ఎం.రమేష్, మాజీ ఎమ్మెల్సీ పి.వి.ఎన్.మాధవ్, జిల్లా అధ్యక్షులు మేడపాటి రవీంద్ర సందర్శించారు. చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.రాజు, దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి సురేంద్రమోహన్, రాష్ట్ర కోశాధికారి ఎం.నాగేంద్ర, జిల్లా మహిళా అధ్యక్షురాలు ఉమ్మడి సుజాత రాజ్, అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



స్టాల్స్‌ను పరిశీలిస్తున్న ఎంపీ రమేష్

తెదేపా కార్యాలయంలో...

వన్‌టౌన్, న్యూస్‌టుడే: జాతిపిత మహాత్మాగాంధీ మార్గం అనుసరణీయమని తెదేపా విశాఖ లోక్‌సభ నియోజకవర్గ అధ్యక్షులు గండి బాబ్జీ అన్నారు. బుధవారం ఉదయం తెదేపా కార్యాలయంలో మహాత్మాగాంధీ, మాజీ ప్రధానమంత్రి లాల్‌బహుదూర్ శాస్త్రి జయంతులను నిర్వహించారు. వారి చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించి నివాళి అర్పించారు. స్వాతంత్ర్య సాధనకు గాంధీజీ చేసిన త్యాగాలను కొనియాడారు. ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, పార్టీ దక్షిణ నియోజకవర్గ బాధ్యులు సీతంరాజు సుధాకర్, పార్టీ ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాసరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి తోటరత్నం, అధికార ప్రతినిధి గొంప కృష్ణ, కార్పొరేటర్లు గొలగాని వీరారావు, నారాయణరావు, భాస్కర్‌రావు, తెదేపా ఎస్సీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొడుగు కుమార్, గనగళ్ల సత్య తదితరులు పాల్గొన్నారు.



మహాత్మాగాంధీ, లాల్‌బహుదూర్ శాస్త్రి చిత్రపటాల వద్ద నివాళి అర్పిస్తున్న గండిబాబ్జీ, చిరంజీవిరావు తదితరులు

కేంద్ర కారాగారంలో ...

ఆరిలోవ, న్యూస్‌టుడే : కేంద్ర కారాగారంలో గాంధీ జయంతి సందర్భంగా బుధవారం ఖైదీల సంక్షేమ దినోత్సవం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, డీఎల్ఎస్ఏ సెక్రటరీ ఎం.వి.శేషమ్మ, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద ముఖఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఖైదీలు సమాజంలో హక్కులతో పాటు బాధ్యతల గురించి కూడా తెలుసుకుని మెలగాలన్నారు. ఖైదీల ప్రవర్తనలో మార్పు దిశగా సంస్కరణలు ఉండాలన్నారు. ఈ సందర్భంగా ఆటల పోటీల్లో గెలుపొందిన ఖైదీలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కారాగారం పర్యవేక్షణాధికారి ఎస్.కిషోర్‌కుమార్, అదనపు పర్యవేక్షణాధికారి ఎం.వెంకటేశ్వర్లు, ఉప పర్యవేక్షణాధికారి ఎస్.కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, డీఎల్ఎస్ఏ సెక్రటరీ ఎం.వి.శేషమ్మ, తదితరులు

మార్షల్ ఆర్ట్స్ హబ్‌గా విశాఖ

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: మార్షల్ ఆర్ట్స్ హబ్‌గా విశాఖ తయారైందని సినీనటుడు, అఖిల భారత మార్షల్ ఆర్ట్స్ ఛైర్మన్ సుమన్ తెలిపారు. రెండో వైజాగ్ ఓపెన్ జాతీయ స్థాయి కరాటే పోటీల గోడపత్రికలను బుధవారం పోర్టు స్టేడియంలోని విశ్వనాథ స్పోర్ట్స్‌క్లబ్‌లో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సీనియర్ కరాటే మాస్టర్ మేకల విజయసారథి జ్ఞాపకార్థం జాతీయస్థాయి పోటీలు నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. ఈ పోటీలు డిసెంబరు 15 నుంచి విశ్వనాథ స్పోర్ట్స్‌క్లబ్‌లో జరుగుతాయన్నారు. అంతకు ముందు లాల్‌బహుదూర్‌శాస్త్రి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. టోర్నీ ఛైర్మన్ బొడ్డేటి కాశీవిశ్వనాథ్, భాజపా నాయకులు బొత్స సురేష్, జనసేన డాక్టర్ల సెల్ ఛైర్మన్ బొడ్డేపల్లి రఘు, టోర్నీ చీఫ్ ఆర్గనైజరు చిగురుపల్లి సతీష్ కుమార్, ప్రతినిధులు అంగరాము, ఆనందబాలు, బాలకృష్ణ, అంబు, శివగణేష్, రాము తదితరులు పాల్గొన్నారు.



గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న సుమన్, బొడ్డేటి కాశీవిశ్వనాథ్, సురేష్ తదితరులు

రోటరీ క్లబ్ చక్రాల కుర్చీల వితరణ

తాటిచెట్లపాలెం: రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ విశాఖ ఆధ్వర్యంలో గాయత్రి విద్యా పరిషత్ ఆసుపత్రిలోని రోగుల సౌకర్యార్థం పది చక్రాల కుర్చీలను అందజేశారు. గాంధీ జయంతిని పురస్కరించుకొని బుధవారం రైల్వేన్యూకాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధి పి.డి.జి.కిషోర్‌కుమార్ ఆసుపత్రి ప్రతినిధులకు చక్రాల కుర్చీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతివ్యక్తి, స్వచ్ఛంద సంస్థలు సేవా భావాన్ని అలవర్చుకొని సమాజానికి తమ వంతు సాయం అందించాలని పిలుపునిచ్చారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఎం.డి.యాసిన్, కార్యదర్శి చింతా నేతాజీ, బ్రహ్మానందం, జి.కే.మైత్రి పాల్గొన్నారు.



చక్రాల కుర్చీల పంపిణీలో పాల్గొన్న రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ విశాఖ ప్రతినిధులు

ఉక్కు పరిరక్షణకు నిరశన దీక్ష

కార్పొరేషన్, న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను విరమించుకున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటన చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.లోకనాథం డిమాండ్ చేశారు. కర్మాగారాన్ని పరిరక్షించాలని కోరుతూ బుధవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరాహారదీక్ష చేపట్టారు. ఆయన మాట్లాడుతూ రైతులు భూములను త్యాగం చేస్తే, కార్మిక సంఘాల ప్రతినిధులు ప్రాణాలర్పించి సాధించుకున్న ఉక్కును కేంద్ర ప్రభుత్వం నష్టాలబాట పట్టించి దశల వారీగా నిర్వీర్యం చేస్తోందన్నారు. సీపీఐ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ విశాఖ ఉక్కును పూర్తిస్థాయి సామర్థ్యంతో నడిపించడంతోపాటు సెయిల్‌లో విలీనం చేయాలని కోరారు. తొలగించిన 4వేల ఒప్పంద కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కర్మాగారం పరిరక్షణ ఉద్యమంలో విద్యార్థులు, యువత, మహిళలు పాల్గొనాలని కోరారు.



నిరాహార దీక్షలో పాల్గొన్న కార్మిక, ప్రజా సంఘాల నాయకులు

పేదరిక నిర్మూలనకు 'ధాన్' కృషి అభినందనీయం



మాట్లాడుతున్న వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్, హాజరైన సభ్యులు

డాబాగార్డెన్స్ (అల్లిపురం), న్యూస్‌టుడే: పేదరిక నిర్మూలన కోసం ధాన్ ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయమని వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ అన్నారు. ధాన్ ఫౌండేషన్ 28వ వ్యవస్థాపక దినోత్సవాన్ని బుధవారం డాబాగార్డెన్స్ అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కె.ఎస్.విశ్వనాథన్ మాట్లాడుతూ ధాన్ ఫౌండేషన్ చేపట్టే నగరాభివృద్ధి కార్యక్రమాల్లో వీఎంఆర్‌డీఏ భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందన్నారు. ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వాసిమలై ఆన్‌లైన్‌లో సందేశాన్ని అందించారు. సంస్థ విశాఖ సమన్వయకర్త శైలజ మాట్లాడుతూ తమ సంస్థ 2300 గ్రూప్‌లతో 33వేల కుటుంబాలతో పని చేస్తోందని వివరించారు. సంస్థ ప్రతినిధులు లోకేష్, ధనలక్ష్మి, రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు (కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	110	104
లైవ్	132	124
డ్రెస్డ్	191	218
స్కిన్‌లెస్	218	228

గాజువాక

•గాజువాక •విశాఖ పశ్చిమం

ఎట్టకేలకు పార్కు పనుల్లో కదలిక


పనులు చేస్తున్న సిబ్బంది

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : జీవీఎంసీ 76వ వార్డు హౌసింగ్‌బోర్డుకాలనీలో నిలిచిపోయిన ఆధునిక పార్కు అభివృద్ధి పనులకు ఎట్టకేలకు బుధవారం నుంచి కదలిక వచ్చింది. ఇటీవల వర్షాలకు ఎగువ నుంచి వచ్చిన వరద నీరు పార్కు ప్రాంగణాన్ని చిత్తడిగా మార్చింది. ఈ సమస్యపై 'ఈనాడు'లో ఈనెల 1న 'ఆధునిక ఉద్యాన వనానికి మురుగు కష్టాలు..' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన జోనల్ అధికారులు పునరుద్ధరణ పనులు ప్రారంభించడంతో నివాసితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఈనాడు కథనానికి స్పందన

మార్షల్ ఆర్ట్స్ హబ్‌గా విశాఖ

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: మార్షల్ ఆర్ట్స్ హబ్‌గా విశాఖ తయారైందని సినీనటుడు, అఖిల భారత మార్షల్ ఆర్ట్స్ ఛైర్మన్ సుమన్ తెలిపారు. రెండో వైజాగ్ ఓపెన్ జాతీయస్థాయి కరాటే పోటీల గోడపత్రికలను బుధవారం పోర్టు స్టేడియంలోని విశ్వనాథ స్పోర్ట్స్‌క్లబ్‌లో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సీనియర్ కరాటే మాస్టర్ మేకల విజయసారథి జ్ఞాపకార్థం జాతీయస్థాయి పోటీలు నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. ఈ పోటీలు డిసెంబరు 15 నుంచి విశ్వనాథ స్పోర్ట్స్‌క్లబ్‌లో జరుగుతాయన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు


పెదమడకలో శ్రీ మాతా దుర్గాభవానీ

అగనంపూడి, న్యూస్‌టుడే : అగనంపూడి పరిధి పెదమడక కాలనీ శ్రీ మాతా దుర్గాభవానీ ఆలయంలో ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆలయ ధర్మకర్త బి.పైడిరాజు తెలిపారు. నేటి నుంచి 12 వరకు కార్యక్రమాలు ఉంటాయన్నారు.

సింధియా, న్యూస్‌టుడే : పారిశ్రామిక ప్రాంతం గాజువాక డిపో వద్ద జయదుర్గా దేవి ఆలయంలో తొమ్మిది రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు శంకర్రావు తెలిపారు. ములగాడ కాలనీ, హిమాచల్ నగర్, బర్మాకాలనీలోనూ అమ్మవారి మండపాలను సిద్ధం చేశారు. 59వ వార్డు కొత్తనక్కవానిపాలెం వద్ద స్థానిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం దుర్గాదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా మహిళలు కోలాటం ప్రదర్శించారు.

గాజువాక, పెదగంట్యాడ, న్యూస్‌టుడే: గాజువాక సమీప కైలాస్‌నగర్, పెదగంట్యాడ బర్మాకాలనీ, చినకోరాడ, శ్రీనగర్, దుర్గానగర్ కనకదుర్గమ్మ ఆలయాల్లో ఉత్సవాలకు ఏర్పాట్లు చేశారు.

● ఈనెల 24న గాజువాకలో నిర్వహించే అయ్యప్పస్వామి పూజకు సంబంధించిన బ్రోచర్‌ను బుధవారం గాజువాక కార్యాలయంలో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆవిష్కరించారు. నిర్వాహకుడు పానీపూరి శివ, కార్పొరేటర్లు గంధం శ్రీనివాస్, పల్లా శ్రీనివాస్ పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

గాజువాక: 98494 65088

పశ్చిమం (గోపాలపట్నం): 95428 96869

న్యూస్‌టుడే, గాజువాక, పెదగంట్యాడ, సింధియా

సమస్య : గాజువాక సంజీవకాలనీలో 401-ఎ-3-4 స్తంభంపై వీధి దీపం వెలగడం లేదు.
–శివకుమార్, సంజీవకాలనీ

సమాధానం : ఫిర్యాదును పరిశీలించి, దీపాలకు మరమ్మతులు చేయిస్తాం.
–శివ, వీధిదీపాల నిర్వాహకుడు.

?: గాజువాక జోనల్ కార్యాలయం ఎదురుగా ఉన్న శ్మశానవాటిక అధ్వానంగా ఉంది. జేసీబీ సాయంతో పనులు చేపట్టడం లేదు.
–శ్యామ్, గాజువాక

✓: వర్క్ ఇన్‌స్పెక్టరును పంపి అవసరమైన చర్యలు తీసుకుంటాం. –అప్పారావు, ఈఈ.

?: గుల్లలపాలెం మార్కెట్ ఆవరణలో పాడుబడిన బావిలో వ్యర్థాలు వేయడంతో తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. వెంటనే బావిని పూడ్చివేయాలి. – వినతల్లి, స్థానిక వ్యాపారి

✓: ఈ సమస్యను జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.
–సతీష్, పారిశుద్ధ్య అధికారి

సంక్షిప్త సమాచారం..

● 'పార్టీ విజయమే లక్ష్యం'

కరాస, న్యూస్‌టుడే : రాష్ట్రంలో మరోసారి వైకాపాను అధికారంలోకి తీసుకురావడానికి శ్రేణులు సమష్టిగా కృషి చేయాలని పార్టీ విశాఖ పశ్చిమ నియోజకవర్గం ఇన్‌ఛార్జి మళ్ల విజయప్రసాద్ పిలుపునిచ్చారు. బుధవారం సీతమ్మధార పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో 52, 56, 57, 80, 90, 91, 92 వార్డుల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పార్టీ ఆధ్వర్యంలో కార్యక్రమాలు విస్తృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

● నూతన నియామకం

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : ఇండియన్ బాడీ బిల్డర్స్ ఫెడరేషన్ నూతన అధ్యక్షుడిగా సీనియర్ కోచ్ స్వామి రమేష్‌కుమార్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బుధవారం పెదగంట్యాడ సత్యహెల్త్ కేర్ జిమ్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి పాల్గొని కేక్ కట్ చేశారు. బాడీ బిల్డింగ్ పోటీల్లో గ్రామస్థాయి నుంచి జాతీయస్థాయికి ఎదగడానికి రమేష్‌కుమార్ చేసిన కృషి మరువలేనిదన్నారు. జాతీయ క్రీడాకారుడు డాక్టర్ ఎస్.రాజారావు, కోచ్‌లు సతీష్, రమణ, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● 4న విద్యుత్తు సరఫరాకు అంతరాయం



అక్కిరెడ్డిపాలెం(షీలానగర్), న్యూస్‌టుడే: షీలానగర్ విద్యుత్తు ఉప కేంద్రం పరిధిలో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరాకు అంతరాయం కలుగుతుందని జోన్-2 ఈఈ బీకే.నాయుడు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. హరిజన జగ్గయ్యపాలెం, వెంకటేశ్వరకాలనీ, షీలానగర్, గవర జగ్గయ్యపాలెం, కిమ్స్ ఆసుపత్రి ఏరియా, కుమిలీ లేఅవుట్, పోర్టు రోడ్డు, ఎస్టీబీఎల్ పరిసరాల్లో సరఫరా ఉండదన్నారు.

● ముగ్గురు సైబర్ మోసగాళ్ల అరెస్టు

ఎండాడ, న్యూస్‌టుడే : మనీ లాండరింగ్ కేసు పేరిట ఓ వ్యక్తిని బెదిరించిన ముగ్గురు మోసగాళ్లను విశాఖ సైబర్ క్రైం పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఆ వివరాలిలా.. విశాఖ నగరానికి చెందిన వ్యక్తికి ఓ బెదిరింపు ఫోన్‌కాల్ వచ్చింది. హైదరాబాద్‌కు చెందిన మనీ లాండరింగ్ కేసులో తక్షణమే హాజరు కావాలని సమాచారం అందింది. ఆందోళనకు గురైన అతడు హుటాహుటిన హైదరాబాద్ వెళ్లగా... హోటల్‌లో ఒంటరిగా ఉండాలని, ఈ విషయం ఎవరికీ చెప్పొద్దని అగంతకులు సూచించారు. అలాగే తమ బ్యాంకు ఖాతాకు రూ.16.50 లక్షలు పంపాలని చెప్పడంతో, నగదు మొత్తం జమ చేశారు. తర్వాత తాను మోసపోయానని గ్రహించి బాధితుడు సైబర్ పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు లోతుగా దర్యాప్తు చేసి హైదరాబాద్‌కు చెందిన ఉదయకిరణ్, మోహన్‌రెడ్డి, మల్లికార్జున్‌నర అరెస్టు చేసి విశాఖ తీసుకొచ్చి రిమాండ్‌కు తరలించారు. నిందితులపై వేర్వేరు రాష్ట్రాల్లో 8 కేసులు నమోదై ఉన్నట్లు సైబర్ పోలీసులు పేర్కొన్నారు.

మహాత్ముని మార్గం.. అనుసరణీయం

గాజువాక, పశ్చిమంలో గాంధీ జయంతి

గాజువాక, పెదగంట్యాడ, సింధియా, కరాస, గోపాలపట్నం, ఉక్కునగరం, కూర్మన్నపాలెం, అక్కిరెడ్డిపాలెం, మల్కాపురం, అగనంపూడి

జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని బుధవారం గాజువాక, విశాఖ పశ్చిమం నియోజకవర్గాల పరిధిలో పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. వివిధ రాజకీయ పార్టీల కార్యాలయాల్లో, ప్రభుత్వ-ప్రైవేటు రంగ సంస్థల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో నాయకులు, అధికారులు పాల్గొని మహాత్ముడి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, గణబాబు మాట్లాడుతూ... గాంధీజీ సూచనల మేరకు సమాజంలో ప్రతి ఒక్కరూ శాంతి, సమానత్వం, అహింస మార్గాలను అనుసరించాలన్నారు. స్వచ్ఛత ప్రాముఖ్యం గుర్తించి సమాజాభివృద్ధికి పాటు పడాలని పిలుపునిచ్చారు. అలాగే మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి జయంతిని పలుచోట్ల నిర్వహించారు.


గాజువాక జోనల్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే పల్లా


న్యూ కరాసలో ఎమ్మెల్యే గణబాబు, తదితరులు


86వ వార్డు కూర్మన్నపాలెంలో..


ఎన్ఎస్‌టీఎల్‌లో శాస్త్రవేత్తలు, అధికారులు


6వ వార్డు నగరాల వీధిలో..


87వ వార్డు కణితి కాలనీవీధిలో..


ఆటోనగర్ సమీప తుంగ్లాంలో..


అగనంపూడి ధర్మసత్రం కూడలిలో..


62వ వార్డు గుడివాడఅప్పన్న కాలనీలో..


87వ వార్డు వడ్లపూడిలో..


ఉక్కునగరంలో..


షిప్‌యార్డులో..


గోపాలపట్నం ఉన్నత పాఠశాలలో..


పెదగంట్యాడ సమీప నడుపూరులో..


గాజువాక జనసేన ఆధ్వర్యంలో..

'స్వచ్ఛ' సేవలకు గుర్తింపు


గంటా శ్రీనివాసరావు చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న సభ్యులు

ఉక్కునగరం(కూర్మన్నపాలెం), న్యూస్‌టుడే : గాంధీ జయంతి సందర్భంగా బుధవారం కాపులుప్పాడ 'వేస్ట్ టు ఎనర్జీ' యార్డు వద్ద స్వచ్ఛ భారత్ దివాస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడాది నుంచి స్వచ్ఛ కార్యక్రమాలు అమలు చేసిన తిరుమలనగర్ సంక్షేమ సంఘం సభ్యులకు భీమిలీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చేతుల మీదుగా పురస్కారం అందించారు. జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, మేయర్ హరి వెంకట కుమారి, అదనపు కమిషనర్ సోమన్నారాయణ, ముఖ్యవైద్యాధికారి నరేష్‌కుమార్, సంఘం ప్రతినిధులు విశ్వేశ్వరరావు, పరమానందం, సన్యాసిరావు, భాస్కరరావు పాల్గొన్నారు.

ప్రముఖులకు స్వాగతం



ఎంపీ రమేశ్‌తో భాజపా నాయకులు, షర్మిలతో కాంగ్రెస్ నాయకులు

కరాస, న్యూస్‌టుడే: విశాఖ విమానాశ్రయానికి బుధవారం పలువురు ప్రముఖులు రావడంతో అభిమానులు స్వాగతం పలికారు. ఆ వివరాలు.. అనకాపల్లి ఎంపీ సీఎం.రమేష్ రైల్వే పార్లమెంటరీ కమిటీ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత విశాఖ రావడంతో భాజపా నాయకులు మహేష్, బాలరాజేశ్వరరావు, దామోదర్ స్వాగతం పలికారు. ఎంపీ మాట్లాడుతూ... విశాఖ రైల్వేజోన్ నిర్మాణ పనులు త్వరలో ప్రారంభిస్తామని విలేకరుల ప్రశ్నకు సమాధానం ఇచ్చారు.

● పీసీసీ అధ్యక్షురాలు వైఎస్.షర్మిల విశాఖ పర్యటనకు రావడంతో కాంగ్రెస్ నాయకులు రామారావు, వర్మ, సుధాకర్, వెంకట్రావు, సత్తిరెడ్డి స్వాగతం పలికారు.

సమాజంలో రక్తదాతల పాత్ర కీలకం


రక్తదాతలు, పారిశుద్ధ్య కార్మికులకు ధ్రువపత్రాలు అందజేసిన ప్రతినిధులు

గాజువాక, పెదగంట్యాడ, న్యూస్‌టుడే : ఆపదలో ఉన్న వారికి రక్తం అందిస్తూ, ప్రాణదాతలుగా నిలుస్తున్న రక్తదాతలకు సమాజంలో ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని వక్తలు పేర్కొన్నారు. గాంధీ జయంతి సందర్భంగా బుధవారం పాతగాజువాక కూడలిలో బీసీ సంఘం అధ్యక్షుడు జాగరపు శ్రీను ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం, ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. మాజీ ఎమ్మెల్యే నాగిరెడ్డి, భాజపా కన్వీనరు కరణంరెడ్డి నర్సింగరావు హాజరై మాట్లాడారు. ఏటా యువత ఇలాంటి రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి, రక్తదానంపై అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు.

● గాజువాక హైస్కూల్‌రోడ్డులోని అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత రక్తదాన, వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విజయవాడ వరద ప్రభావిత ప్రాంతాల్లో శుభ్రత పనులు చేపట్టిన పారిశుద్ధ్య కార్మికులకు ధ్రువీకరణ పత్రాలు అందించి.. సత్కరించారు. అమ్మ ట్రస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు అయ్యలనాయుడు అధ్యక్షత వహించారు. స్థానిక నాయకులు, సభ్యులు పల్లా చినతల్లి, బాటా శ్రీను, గూటూరు శంకరరావు, నాగేశ్వరరావు, దిలీప్, జగదీశ్ పాల్గొన్నారు.

మొక్కలతో పచ్చదనం పెంపు


కార్యక్రమంలో పాల్గొన్న సాయిబాబా భక్తులు

ఉక్కునగరం(స్టీల్‌సెక్టారు-3), న్యూస్‌టుడే : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని సత్య సాయి సేవా సంస్థల ప్రతినిధులు పిలుపునిచ్చారు. బుధవారం గాంధీ జయంతి సందర్భంగా ఎస్టీబీఎల్ కాలనీలో, వైష్ణవి గార్డెన్స్‌లో, వసుంధర గార్డెన్స్‌లో, మనోహర్ గార్డెన్స్‌లో, ఉక్కునగరం హోంగార్డ్స్ వసతిగృహాల ఆవరణలో మొక్కలు నాటారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షిస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఉక్కునగరం, కేవీకే సమితి, భెల్ సమితి, గాజువాక సమితి, పెదగంట్యాడ సమితి సభ్యులు పాల్గొన్నారు.

సింధియా, న్యూస్‌టుడే : హిందుస్థాన్ షిప్‌యార్డులో బుధవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. యార్డులోని అన్ని విభాగాలు, రహదారులు శుభ్రం చేశారు. అధికారులు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొని స్వచ్ఛ ప్రతిజ్ఞ చేసినట్టు యార్డు వర్గాలు వెల్లడించాయి.


షిప్‌యార్డులో ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగులు

కాలనీ రహదారుల్లో కష్టాలు

న్యూస్‌టుడే, మల్కాపురం : పారిశ్రామిక ప్రాంతంలోని వివిధ కాలనీల అంతర్గత రహదారుల్లో నిత్యం ట్రాఫిక్ స్తంభించడంతో రాకపోకలు సాగించే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నివాసితులంతా తమ వాహనాలను రోడ్లపై నిలిపి ఉంచడంతో, ఆక్రమణలు, చిరు దుకాణాల ఏర్పాటుతో మార్గాలన్నీ ఇరుకుగా మారుతున్నాయి. అత్యవసర సమయంలో అంబులెన్స్‌లు, అగ్నిమాపక వాహనాలు వెళ్లే వీలుండడం లేదని ప్రజలు చెబుతున్నారు. ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసులు, పట్టణ ప్రణాళిక అధికారులు స్పందించి రహదారిపై ఆక్రమణలు తొలగించి రాకపోకలకు మార్గం సుగమం చేయాలని పలువురు కోరుతున్నారు.

దర్పణం


62వ వార్డు ప్రకాష్‌నగర్‌లో..

గాజువాక సినిమాలు

కన్య, శ్రీకన్య, అరుణ, అన్నపూర్ణ, లక్ష్మీకాంత్, విశేష్, మోహినీ 70ఎంఎం: దేవర, మినీ మోహినీ: జోకర్, మోహినీ: మత్తు వదలరా-2, లక్ష్మి: సత్యం సుందరం

కూలితే.. ప్రమాదమే..!

–న్యూస్‌టుడే, అగనంపూడి

ఫోకస్




జీవీఎంసీ 85వ వార్డు దిబ్బపాలెం కూడలిలోని హైమాస్ట్ దీప స్తంభం ప్రమాదకరంగా మారింది. స్తంభం అడుగు భాగం తుప్పు పట్టేయడంతో గాలికి అటూ, ఇటూ ఊగుతోంది. ఎప్పుడు కూలుతుందోనని... అటువైపు రాకపోకలు సాగించే వారు భయాందోళన చెందుతున్నారు. అయిదు రోజుల క్రితం కొత్త దీపాలు బిగించడానికి వచ్చిన సిబ్బంది.. స్తంభం పరిస్థితి చూసి తమ వల్ల కాదని జారుకున్నారు. జీవీఎంసీ అధికారులు తక్షణమే స్పందించి పాత స్తంభాన్ని తొలగించి, కొత్తది ఏర్పాటు చేయాలని నివాసితులు కోరుతున్నారు.

పట్టు జారితే... అంతే..


బీసీరోడ్డులో ఫుట్‌బోర్డు ప్రయాణం

ఆర్టీసీ సిటీ బస్సుల్లో ఫుట్‌బోర్డు ప్రయాణాలకు అడ్డుకట్ట పడడం లేదు. ప్రధానంగా విద్యార్థులు, యువకులు కదులుతున్న బస్సుల్లోకి ఎక్కుతుండడం ఆందోళన కలిగిస్తుంది. పెదగంట్యాడ నుంచి గాజువాక వైపు వెళ్తున్న పలు సర్వీసుల్లో నిత్యం ఇదే పరిస్థితి కనిపిస్తుంది. పైగా ఆ మార్గంలో ఎక్కడికక్కడ స్పీడ్ బ్రేకర్లు ఉన్నాయి. ఆయాచోట్ల కుదుపులకు ఫుట్‌బోర్డుపై ఉన్న వారు పడిపోయే అవకాశం ఉంటుందని బస్సు కండక్టర్లు, డ్రైవర్లు గగ్గోలు పెడుతున్నా... యువత పట్టించుకోవడం లేదు. ఏదైనా ప్రమాదం జరగక ముందే నివారణ చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, గాజువాక

